
₹ 10/-

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్



సంపుటి- 8 సంచిక - 14
పక్షపత్రిక జూలై 16-31, 2017

## గాంధీ - కులం

## అస్తిత్వ రాజకీయాల వైఫల్యం - మోదీ చేతిలో దళితాస్త్రం





## కుల వివక్షను తలదన్నుతున్న 'రైతుపట్ల వివక్ష'




## సెప్టెంబర్‌లో పీపుల్స్ పార్లమెంట్



# యుద్ధాలు జరగాల్సింది దేశాల మధ్య కాదు : జేపీ

యుద్ధాల్ని ప్రకటించుకోవాల్సింది సమాజాన్ని పట్టి పీడిస్తున్న పేదరికం, నిరక్షరాస్యత, అవినీతి వంటి అంశాలపై తప్ప... దేశాల మధ్య కాదని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. భౌతిక యుద్ధం చేయటంకన్నా జనం జీవితాల్ని మెరుగుపరిచేందుకే ఎక్కువ నైపుణ్యం, హీరోయిజం కావాల్సుంటాయని అన్నారు. భారత్, పాకిస్తాన్‌ల మధ్య శాంతి నెలకొనాలని కోరుతూ కోవా సంస్థ ఆగస్టు 15 వరకు సంతకాల సేకరణ ప్రచారోద్యమాన్ని ప్రారంభించింది. హైదరాబాద్ నారాయణగూడ వైఎంసీఏ మైదానంలో ప్రారంభమైన కార్యక్రమంలో జేపీ మాట్లాడారు. పాకిస్తాన్‌తోపాటు చైనాతో భారత్‌కు పెరుగుతున్న ఉద్రిక్తతలను కూడా ఈ సందర్భంగా పరోక్షంగా ప్రస్తావించారు. యుద్ధం అనేది అనివార్యం కాదని, 21వ శతాబ్దం దేశాల మధ్య యుద్ధాన్ని కోరుకోవటం లేదని అన్నారు. అత్యధికశాతం ప్రజలు శాంతిని, అభివృద్ధినే కోరుకుంటున్నారన్నారు. మెగసెసే అవార్డు గ్రహీత, నౌకాదళం పూర్వ చీఫ్ అడ్మిరల్ రాందాస్, సీపీఐ నేత అజీజ్‌పాషా, వైఎంసీఏ సీనియర్ కార్యదర్శి డా॥జీజే వినయ్ స్వరూప్, కోవా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మజర్ హుస్సేన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక జూలై 16-31, 2017

సంపుటి - 8 సంచిక - 14

## లోపలి పేజీల్లో...


రాష్ట్రపతి ఎన్నిక .............................. 5

దళితులపై దాడులు ......................... 8

విస్తరించిన 'ఉనా' దళితాగ్రహంలో....... 10

మస్తిష్కాలపై మకిలి వదిలించుకుంటేనే.. 13

కుల వివక్షను తలదన్నుతున్న ............. 16

రూ.1,50,000 కోట్లు.................... 22

ఆంధ్రప్రదేశ్ జల ప్రణాళిక.................. 24

ఆ లక్షల కోట్లలో రైతులకు ................ 26

మేక్రాన్ లాంటి నాయకుడు ............... 27

సీబీఐ దర్యాప్తునకు పార్టీల డిమాండ్..... 29

ప్రజలకు మంచి చేయాలనుకుంటూ...... 30

సెప్టెంబర్‌లో పీపుల్స్ పార్లమెంట్........... 31

కేరళ సత్తా .................................... 32


## సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

సంపాదక వర్గం

బండారు రామ్మోహన్‌రావు

డా॥ ఆలూరి విజయలక్ష్మి


కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి



# గాంధీ - కులం

'గాంధీజీ ఒక తెలివైన వైశ్యుడు' అని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా చేసిన వ్యాఖ్య ఇప్పట్లో పాతబడదు. రాబోయే అనేక పరిణామాలకు అదో సూచన అనుకోవచ్చు.. చరిత్రను తరచి చూడాలనుకోవడం మంచిదే. కానీ 'చరిత్ర నా పట్ల దయాభరితంగానే వ్యవహరిస్తుంది' అని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అనుకున్నా, తనకు చరిత్రలో ఏదో ఘనస్థానం లభిస్తుందని ప్రస్తుత ప్రధాని నరేంద్రమోదీ ఊహించుకుంటున్నా, చరిత్రకు చిత్తుప్రతులుగా భావించే వార్తాపత్రికలు కొందరికి ఊదరగొడుతున్నా.. చరిత్ర మాత్రం నిర్మొహమాటంగా వ్యవహరిస్తుంది. నిజాలు నిగ్గు తేలేవరకు కొన్ని అపోహలు, ఒడిదుడుకులు ఉండొచ్చుగాక.. అలాగే ఎన్ని తరాలు ఎన్నిసార్లు తరచిచూసినా చెక్కుచెదరకుండా చరిత్రలో స్థానాన్ని కాపాడుకోగలిగిన అర్హులు కొందరుంటారు. వారిని ఎవరితో పోల్చకుండానే గౌరవిస్తూ వారి నుంచి నేర్చుకుంటుండాలి. ఆ స్మరణీయుల జాబితాలో గాంధీ నిస్సందేహంగా ఉంటారు. అలాంటి గాంధీపై అమిత్‌షా చేసిన వ్యాఖ్య అనుచితం, దారుణం అని పలువురు విమర్శిస్తున్నారు. కానీ గాంధీ వ్యాపార తెలివితో పనిచేశారన్న బీజేపీ నేత భావనను అంతలా తప్పు పట్టనక్కర్లా. గాంధీ సహా ఏరంగంలో ఎవరైనా ఒక పనిని తెలివి, ఎత్తుగడలతో చేస్తుంటే అభినందించాల్సిందే. వ్యాపారంగా మారిన రాజకీయాన్ని ప్రజల చుట్టూ ఓ నైతిక, పవిత్రవ్యాసంగంగా చేయాలనే లక్ష్యంతోనే లోక్‌సత్తా పోరాడుతున్నా.. ఈ బృహత్ ప్రయత్నమంతటినీ ఓ వ్యాపారి తరహాలోనే చేస్తుంది. విదేశాల్లోని లోక్‌సత్తా అభిమానుల నుంచి స్వదేశంలోని రైతు, చిట్టచివరి గ్రామీణ పేదవాని వరకూ ఇదే మాట చెబుతూ వచ్చాను. 'మీరు కూడా మీ నిజమైన లాభమేమిటో తెలుసుకుని ఓటేయండి' అనే సూచించాను.. మనలో చాలామందికి చాలా ఆశలుంటాయిగానీ వ్యాపార వ్యవహారశైలిని మాత్రం చిన్నచూపు చూస్తుంటాం. ముఖ్యంగా మనం ఎంతో గౌరవించే నేతలు అమాయకంగా, దుర్భర దారిద్ర్యంలో, బలిపశువుల్లా బతకాలనుకుంటాం. అందుకే.. చెడును సహించకుండా, చెడుకు బలవకుండా ధర్మబద్ధ వ్యాపార చతురతతో వ్యవహరించే క్రమంలో లోక్‌సత్తా ధోరణులను, వేసే ఎత్తుగడలను, నా వ్యవహారశైలిని చాలామంది గందరగోళమని భావిస్తుంటారు. తొందరపాటుతనంతో వ్యవహరిస్తున్నారని నిందిస్తుంటారు. నైతిక జనరాజకీయాన్ని వ్యాపార నైపుణ్యంతో నడిపే వ్యక్తి, సంస్థ విధిగా నైతికంగానే ఉంటాయి. కానీ నిజాయతీ నాయకుల వ్యాపార తెలివి మాత్రం మనలో చాలామందికి నచ్చదు. ఏమీ సాధించకపోయినా, విధానాలు లేకపోయినా కాస్త భావోద్వేగాలతో హడావుడి చేసే నిజాయతీపరులైతే గొప్ప నేతలు అనే భ్రమ మనలో ఉండటం వల్లే.. గాంధీజీపై అమిత్‌షా వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. స్వతంత్ర పోరాటంలో గాంధీ చాలా ఎత్తుగడలు వేశారని మనం గుర్తించాలి. తన లక్ష్యసాధనను ఆలస్యం చేస్తారనుకున్నవారి పట్ల కఠినంగా వ్యవహరించారు. లౌక్యాన్ని కొన్ని సందర్భాల్లో ప్రదర్శించారు. రాజ్యవ్యవస్థ నిర్మాణంపై లోతైన చర్చ జరగలేదు. గాంధేయ ఆందోళనాపద్ధతులన్నీ.. ఆనాటి అవసరాలని బట్టి పుట్టినవేకాని, ఒక ప్రజాస్వామ్య వ్యవస్థకి పనికొచ్చేవి కావు. గాంధీ చాలా ప్రభావశీల వ్యక్తికాబట్టి, పరిమిత ఆందోళనల్నే చేశారు కాబట్టి, దేశమంతా ఒకే లక్ష్యం వైపు మళ్లింది కాబట్టి ఆయన ఆందోళనాపద్ధతులు ప్రభుత్వాల్ని కదిలించాయి. స్వతంత్ర భారతదేశంలో అలా హీరోలు రావాలని ఎదురుచూస్తూ కూర్చున్నా, ప్రతి సమస్యకూ పౌరులు అలా ఆందోళనలు చేయటం మొదలెట్టినా.. సమస్యలు పరిష్కారం కావు, పాలన ముందుకు సాగదు. గాంధీ అరాచకవాద రాజకీయాన్ని రాజ్యాంగపద్ధతులతో సరిచేసే ప్రయత్నాన్ని అంబేద్కర్ చేశారు.. విధానపరంగా లోపాలున్నా తన లక్ష్యం పట్ల మాత్రం గాంధీ నూరుశాతం చిత్తశుద్ధితో ప్రయత్నం చేశారు. ఆయన లక్ష్యం భారతదేశ స్వాతంత్ర్యమైతే కాదు. అంతకంటే గొప్పది. అందుకోసమే ఈ దేశంలోని ప్రజలందరినీ కులం, మతం, ప్రాంతం, భాషలకు అతీతంగా ఏకం చేసే అసాధారణ కృషి చేశారు. అందులో భాగంగానే స్వాతంత్ర్యాన్ని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్‌ను లోక్ సేవాసంఘ్‌గా మార్చి కొత్త రాజకీయ పార్టీతో రాజకీయ పునరేకీకరణ చేయాలని భావించారు. ఈ స్థాయి కృషి చేశారు కాబట్టే మనందరికీ, ప్రపంచమంతటికీ స్ఫూర్తిదాతగా నిలిచారు. వీటన్నిటినీ వ్యాపారనైపుణ్యాలతో పోటీపడే తెలివితేటలతోనే గాంధీ చేయగలిగారు. కానీ ఆ తెలివితేటల్ని గాంధీ తాను యాదృచ్ఛికంగా పుట్టిన కులానికి అన్వయించుకోలేదు. గాంధీ, ఆ మాటకొస్తే రాంమనోహర్ లోహియా చుట్టూ కూడా వారి కులానికి చెందినవారు తరచూ కనిపిస్తారని ఫిర్యాదులు వినిపిస్తుంటాయి. రాజకీయ, సామాజిక సంస్కరణలు చేయటానికి అవసరమైన వనరులను సమకూర్చగలిగేవారిని సొంత కులం కాబట్టి అని దూరంగా పెట్టటం ప్రచారానికి కొంత పనికొస్తుందేమోగానీ లక్ష్యాన్ని దెబ్బతీస్తుంది. కాబట్టే.. ఈ విమర్శలోనూ గాంధీకి కులాన్ని అంటగట్టలేం. అందుకే వైశ్యుడు అనే పదాన్ని ఉపయోగించిన అమిత్‌షా మితిమీరారని చెప్పాలి. రాజకీయాలంటే ఆర్థికాభివృద్ధే అని ఆయన, మోదీ భావిస్తూండవచ్చు. కానీ ఆ వృద్ధి కొందరికి మాత్రమే కాదు, అందరికీ అని కూడా వారు గుర్తించాలి. గాంధీ వైశ్య కులవృత్తికే పరిమితమై ఆలోచిస్తే, ఇంగ్లండ్ వెళ్లేవారు కాదు, ఈ దేశానికి ఓ మహాత్ముడి స్థాయి రాజకీయ నాయకత్వాన్ని అందించగలిగేవారు కాదు. గాంధీకన్నా ముందు రాచరికంలో కూడా వైశ్యులు పాలకులుగా ఉన్న ఉదంతాలున్నాయి. అలాంటిది ఈవేళ కులాన్ని బట్టి మనిషి పనిని నిర్ణయించే ధోరణిని స్థిరీకరించే ప్రయత్నం ఓటు బ్యాంకు రాజకీయాలకు కొంతకాలం పనికొస్తుందేమోగానీ.. తిరోగమనమే అవుతుంది. వివక్షను కొనసాగిస్తూ కోట్లాదిమంది ఎదిగే అవకాశాలకు గండికొడుతుంది. అమిత్‌షా వ్యాఖ్యల తర్వాత తెలంగాణలోనూ అధికార పార్టీ నేతొకరు ముఖ్యమంత్రి కేసీఆర్ ఎత్తుగడలను గాంధీ వ్యూహాలతో పోల్చినట్టు పత్రికల్లో వార్తలచ్చాయి. అయ్యా! గాంధీ తన వృత్తిని కులంతో ముడిపెట్టలా. గ్రామీణ వృత్తులను బాగుచేయటానికి కులాలవారీగా లెక్కలేసే స్థాయిలో గాంధీ ఎప్పుడూ రాజకీయం చేయలా! కాబట్టి గాంధీజీ కార్యనిర్వహణ నైపుణ్యాన్ని, వైశ్య కుల చట్రం నుంచి పాలకపక్షాలు వేరు చేయాలి. గాంధీని వైశ్యుడిగా, స్వచ్ఛభారత్‌కు, నీతులకు బ్రాండ్‌అంబాసిడర్‌గా ఉపయోగించుకునే అధర్మ వ్యాపార ధోరణికి షా, మోదీ స్వస్తి చెప్పాలి. ఏ కులంలో పుట్టినా తనకు నచ్చిన వృత్తిలో గాంధీలాగా వ్యాపార నైపుణ్యంతో, నాయకత్వ పటిమతో ప్రతి బిడ్డా వ్యవహరించగలిగేలా చట్టబద్ధపాలన, అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి, అవినీతిలేని సేవలను అందించాలి. ఈ రకమైన సంస్కరణల్ని అమలుచేస్తేనే ఉనా, సహరాన్‌పూర్, ఆగిరిపల్లి, పల్లెర్ల, గరగపర్రు తరహా ఘటనలు ఆగుతాయి. కులంతో సంబంధం లేకుండా గుణాన్ని, తెలివిని చూడలేము, దిద్దుబాటు చేసుకోలేము అంటే.. ఆ భావజాలం భారత్‌లాంటి దేశానికి, చరిత్రకు సరిపోదని తెలియచెప్పే ఓ పెద్దపాఠాన్ని నేర్చుకోవటానికి సిద్ధపడాలి.



★

# కార్టూన్ కార్నర్




## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

విడి ప్రతి : రు. **10** ,
ఏడాది చందా : రు. **200**
మూడేళ్ళ చందా : రు. **500**

చందా రుసుమును **"లోక్‌సత్తా టైమ్స్"** ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# 'రాష్ట్రపతి ఎన్నిక'..
# అస్తిత్వ రాజకీయాల వైఫల్యం - మోదీ చేతిలో దళితాస్త్రం



భారత రాష్ట్రపతి పదవిని ఓ విశిష్టమైన స్థానంగా, పార్టీలకతీతంగా చూడాలనే సంప్రదాయం మనదేశంలో బలంగానే కనిపిస్తుంది. ఇందిరాగాంధీ హయాంలో ఈ సంప్రదాయానికి కొంత గండిపడినా, ఆ తర్వాత మళ్లీ కుదురుకుంది. ఏపీజే అబ్దుల్ కలాం హయాంలో రాష్ట్రపతి పదవికి వచ్చిన గుర్తింపు పార్టీలలో ఆయన పట్ల వ్యతిరేక గళాలకు ఆస్కారం లేకుండా చేసింది. ఈదేశంలో పెను రాజకీయ మార్పులు తేవాలి, పరివర్తన తేగల సంస్కరణల్ని (పారిశ్రామికవేత్తలను ఆకర్షించటానికి సులభ వాణిజ్యం కోసం చేశామని మోదీ విదేశాల్లో చెప్పుకున్న 7,000 సంస్కరణల తరహాలోనివి కావు) తేవాలి అనుకునేవారు రాష్ట్రపతి పదవి కోసం ప్రయత్నించటంలో పెద్ద ఔచిత్యం కనిపించదుగానీ.. రాష్ట్రపతి నామమాత్రమే, ఎవరున్నా ఒకటే అని కొట్టిపారేయటానికి వీల్లేదు. పదవితో పాటు, కొంత ప్రాధాన్యత కూడా ఉన్న స్థానం రాష్ట్రపతి అనటంలో సందేహం లేదు. కాన్పు చేసే వైద్యునిలా అంతా అప్రమత్తంగా గమనిస్తూ అవసరమైతే మాత్రమే స్పందిస్తూ నిష్క్రియలా కనిపించే కార్యశూరత్వాన్ని రాష్ట్రపతి ప్రదర్శిస్తుండాలి. సంకీర్ణాలప్పుడైతే రాష్ట్రపతి పదవికి విశేష ప్రాధాన్యత ఉంటుంది. ప్రణబ్ ముఖర్జీ సహా రాష్ట్రపతి అభ్యర్థుల ఎంపిక వెనక ఈ కోణం ఎంతో ప్రాధాన్యత కలిగినది.

అయితే మనదేశంలో పదవికున్న ప్రాధాన్యత అంతాఇంతా కాదు కాబట్టి.. పరిమిత అధికారాలే ఉన్నా, పెత్తనం చెలాయించే అవకాశం లేకున్నా రాష్ట్రపతి స్థానానికి ఎన్నికలు ప్రతిష్టాత్మకంగానే ఉంటూ వస్తున్నాయి. నీలం సంజీవరెడ్డి రాష్ట్రపతి అయ్యాక ఆయన తల్లిగారిని స్పందన అడిగితే.. మా అబ్బాయి దేశానికి రాజయ్యాడంటూ ఎంతో గర్వంగా ఫీలయ్యారని ఓ పెద్దాయన చెబుతుండేవారు. అప్పటికే ముఖ్యమంత్రి సహా రాష్ట్ర, జాతీయస్థాయిలో పలు ప్రతిష్టాత్మక క్రియాశీల పదవులను సంజీవరెడ్డి నిర్వహించినా, రాజముద్ర పదవికి ఆ తల్లి అంతలా పొంగిపోయింది. అంతెందుకు, ఎంతో రాజకీయ అనుభవం ఉన్న ప్రణబ్ ముఖర్జీని కూడా.. రాష్ట్రపతి పదవితో సమయం వృధా అవుతుందన్న విజ్ఞతకన్నా పదవీవ్యామోహమే డామినేట్ చేసింది. ప్రజల రాష్ట్రపతిగా పేరొందిన అబ్దుల్ కలాంను ఆ పదవి నుంచి వైదొలిగాక ఈ దేశం సరిగా గౌరవించ లేదు. పత్రికలు ఆయనను సిటీ పేజీ వార్తలకు పరిమితం చేశాయి. ఆయన కార్యాలయంలో ఫోన్ ఎత్తటానికి కూడా సరైన వ్యక్తులు లేని దుస్థితి ఏర్పడింది. ప్రజాప్రయోజనాల కోసమే తన శేషజీవితాన్ని ఆయన అంకితం చేసినా అందుకు కూడా తగిన వసతుల్ని ఈ రాజకీయం, సమాజం ఆయనకు సమకూర్చలేకపోయాయి. పదవికి, సమాజంలో గౌరవానికి అంతలా ముర్ఘపు, కృత్రిమ లింకును మనదేశంలో పెంచి పోషిస్తున్నాం.

రాష్ట్రపతి అభ్యర్థికి రాజకీయ కృషి నేపథ్యం అవసరమే. కానీ ప్రణబ్ ముఖర్జీ భావిస్తున్నట్టు పార్టీ రాజకీయాల దృష్టి అవసరం లేదు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో మోదీకి పార్టీలకతీతంగా వ్యవహరించగల రాజకీయ నేపథ్యమున్న రాష్ట్రపతి, రాజ్యాంగ పరిరక్షకుడిగా చురుకైన పాత్ర వహించే రాష్ట్రపతి, ప్రజలతో మమేకమయ్యే రాష్ట్రపతి అక్కర్లేదు. కోటా రాజకీయమే ఇప్పుడు బాగా అవసరం అని ఆయనకు అనిపించింది. ఈ కోటా రాజకీయానికి కూడా మూలం (ఇంతకుముందే చెప్పుకున్నట్టు) మనలో అధికారం పట్ల ఉన్న లాలస, విపరీత ఆరాధనాభావం, బ్రిటిష్ పాలన నుంచి సంక్రమించిన భయభక్తులే కారణం. ప్రజలలో, రాజకీయ వర్గాలలో పదవి పట్ల ఉన్న విపరీత ఆకర్షణను గుర్తించే పార్టీలు ఎటువంటి ప్రత్యేకమైన ప్రయోజనం లేకపోయినా.. తమకు అవసరమున్న వర్గాల నుంచి రాష్ట్రపతి అభ్యర్థిని ఎంపిక చేయటాన్ని ప్రారంభించాయి. ఈ మనస్తత్వం వల్లే వివక్ష, అణచివేతలకు గురవుతున్న వారికి

న్యాయం చేయటమంటే ఆయా కులాలు లేదా మతాలకు చెందిన వారికి ఏదోక పదవి లేదా రిజర్వేషన్ ఇస్తే చాలనే ధోరణి పెచ్చరిల్లింది. ఆ పదవి లేదా రిజర్వేషన్ వల్ల బాధితుల్లోని కేవలం కొంతమంది పైస్థాయిలోని వారికే లబ్ధి చేకూరుతోందని, దాంతో ఒకస్థాయికి చేరాక వాళ్లూ అగ్రవర్ణ, ఆధిపత్య, సంపన్నుల సంస్కృతినే అనుసరిస్తూ మిగతా సహబాధితులను పట్టించుకోవటం లేదని స్పష్టంగా రుజువవుతున్నా.. ఈ టోకెనిజం చుట్టూనే మనదేశంలో అస్తిత్వ రాజకీయాలు (ఉద్యమాలు, పార్టీలు) బలపడ్డాయి. అణచివేతను ధిక్కరిస్తూ అస్తిత్వ ధోరణులు ప్రబలటం ప్రజాస్వామ్య క్రమంలో భాగమే. వాటిని తిరస్కరించనక్కర్లేదు. కానీ దళితులు, ఇతర అణగారిన వర్గాలు నిజంగా బాగుపడటానికి రిజర్వేషన్లు, కొందరికి పదవులు మాత్రమే కాకుండా ఏం చేయాలో ఈ రాజకీయాలు ఇండియాలో సీరియస్‌గా ఆలోచించలేదు. చట్టబద్ధపాలన, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి, న్యాయ సంస్కరణలు తదితర అంశాల ఎజెండా మీద వీరు దృష్టి పెట్టలేదు. వీరిలో ఎక్కువమంది భారతీయ వామపక్ష రాజకీయాల నేపథ్యం నుంచి వచ్చినవారవటం కూడా ఈ దృష్టిలోపానికి కారణమైంది. అందరికీ ఎదిగే అవకాశాలున్న ప్రజాస్వామిక రాజకీయ, పాలనా సంస్కరణల కోసం జరుగుతున్న ఉద్యమాలకు, బహిరంగ చర్చ ప్రమాణాలను పెంచే రాజకీయ సంస్కృతికి అస్తిత్వ రాజకీయవాదులు అందించే మద్దతు కూడా షరతులతో కూడినదే. ఇలా అస్తిత్వ రాజకీయవాదుల వైఫల్యం మోదీకి గొప్ప అవకాశం కల్పించింది.

అసమానతల కులదొంతరల హిందూ మతానికి ప్రాతినిధ్యం వహిస్తున్నామన్న అపప్రథ ఉన్నా కూడా అట్టడుగున ఉన్న ఓ కులానికి చెందిన వ్యక్తికి దేశ అత్యున్నత పదవిని అందిస్తున్నామని ఘనంగా చాటుకుంటూ మోదీ అభ్యర్థిని ప్రకటించారు. తన ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్న దళితుల నుంచి రామ్‌నాథ్ కోవింద్‌ను రాష్ట్రపతి పదవికి అభ్యర్థిగా ఎంపిక చేశారు. అస్తిత్వ రాజకీయాలు కులాల స్థాయిలో ఇప్పుడున్నంత బలంగా లేకపోయినా ఇందిరాగాంధీ ఈ కోటా టెక్నిక్‌ను ప్రాంతీయ అస్తిత్వభావాల్ని సంతృప్తి పరచటానికి, దుగుబలహీనవర్గాల ఓట్లు కొల్లగొట్టటానికి చాకచక్యంతో ఉపయోగించుకున్నారు. అదే టెక్నిక్‌ను మోదీ, షా ద్వయం మరింత అలవోకగా ప్రయోగించింది. ఓ దళితునికి కాంగ్రెస్ అవకాశం ఇవ్వటంకన్నా బీజేపీ అవకాశం ఇవ్వటం కచ్చితంగా పెద్ద ప్రభావం చూపుతుంది, దళితాస్త్రంగా మారి మోదీకి ప్రయోజనకరంగా మారుతుంది. దళితులు, ఇతర అణగారినవర్గాలకు కొన్ని పదవులు, రిజర్వేషన్లు మాత్రమే కాకుండా ఇంకేం చేయాలో, ప్రాంతీయ అభివృద్ధి ఎలా సాధ్యమో నిర్దిష్ట ఎజెండాను చెబుతూ గనక అస్తిత్వ ఉద్యమాలు మొదలై/విస్తరించి గనక ఉంటే ఇందిర సంగతి ఎలా ఉన్నా, ఇప్పుడు మోదీకి తప్పించుకునే అవకాశం వచ్చేది కాదు. రాష్ట్రపతి అభ్యర్థిగా రామ్‌నాథ్ కోవింద్‌ను ప్రకటించిన వెంటనే ఆయన కులం కాకుండా, ఆయన కృషి, నేపథ్యం చర్చలోకి వచ్చేవి.

రామ్‌నాథ్ కోవింద్ రాష్ట్రపతి పదవికి అనర్హుడేమీ కాదు. కాబట్టి ఆయనను ప్రత్యేకించి దళితుడుగా ఎందుకు చూస్తున్నారు? మిగతావారి నుంచి ఎంపిక చేసి ఉంటే ఇలా ప్రశ్నించేవారా? అని మోదీ అనుయాయులు అనొచ్చు. దళితుల చుట్టూ వారు పెంచుతున్న కల్లోలాన్ని పక్కనబెట్టి ఈ విషయంలో బెనిఫిట్ ఆఫ్ డౌట్‌ను బీజేపీకే ఇద్దామనుకున్నా.. కాంగ్రెస్ కూటమి మీరాకుమార్‌ను ఎంపిక చేయటంతో ప్రధాన జాతీయ పార్టీల దళిత రాజకీయ విన్యాసాన్ని ఖరారు చేసేయొచ్చు. భారత రిపబ్లిక్‌ను బలోపేతం చేయటానికే మీరాకుమార్‌ను బల పరుస్తున్నామని, దళితులపై దాడుల పట్ల మోదీ మౌనం వహిస్తున్నారని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి (సోషల్ మీడియా ద్వారా) చెప్పాక.. దళిత కోణమే ఈ ఎన్నికలకు పునాదిగా ఉందని ధృవపరచొచ్చు. తాజా రాష్ట్రపతి ఎన్నికను ఇద్దరు దళిత నేతల మధ్య పోరుగా చూడవద్దని, ఇది ప్రజాస్వామిక విలువలు, కులనిర్మూలన, బహుళత్వ సంస్కృతి కోసం జరుగుతున్న భావజాలాల మధ్య పోరు అని మీరాకుమార్, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు సోనియాగాంధీ ఎంత చెప్పినా అవి పక్షపాత సత్యాలేనని పలు పరిణామాలు రుజువు చేస్తున్నాయి.

మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కులాలను అల్పసంఖ్యాకులుగా, చిన్న కూటములుగా విడగొట్టి, అసమానతల కులవ్యవస్థతో నిండిన హిందూయిజం చట్రంలోకి తెచ్చి కుల, మత రాజకీయాలకతీతంగా ఆధునికంగా వ్యవహరిస్తున్నామన్న భావన కలిగిస్తూ ఎన్నికల్లో నెగ్గే రాజకీయ ఫార్ములా విజయవంతంగా అమలవుతోంది. అయితే ఈ ఫార్ములాలో హిందూయిజం లోని కుల వివక్ష వైరుధ్యం ఇంకా అవరోధంగా కొనసాగుతూ వస్తోంది. అందుకే దళితులపై దాడులు, సంఘర్షణలు చాలా రాష్ట్రాల్లో కనిపిస్తున్నాయి. రాజ్యాంగం కోసం కాకపోయినా దళితుల కోసం గాంధీని, అంబేద్కర్‌ని ఓన్ చేసుకునేందుకు ప్రయత్నించినా ఆశించిన స్థాయి ఫలితాలు రావటం లేదు. గోవధ నుంచి ఆహారపు అలవాట్లు, విగ్రహాల ఏర్పాటు వంటి చిన్న చిన్న అంశాల మీద గొడవలు కూడా దళితులపై దాడులకు, భావప్రకటనా స్వేచ్ఛకట్టడికి, ఊరి బహిష్కరణలకు దారితీస్తుండటం వెనక అధికార శక్తుల పరోక్ష ప్రోత్సాహం ఉందనటంలో సందేహం లేదు. గోమాంసం చుట్టూ వేధింపులు ముస్లింలు, దళితులనే ఎక్కువగా కుదిపేస్తాయని తెలియనిదేమీ కాదు. గత ఏడున్నరేళ్లలో (2017 జూన్ 25వరకు) 63 గోసంరక్షక సంబంధిత వివాదాస్పద ఘటనలు జరగగా అందులో 20 కేవలం 2017లోనే జరిగాయి. వదంతుల ఆధారంగానే సగం దాకా జరిగాయి. మొత్తం 63 దాడుల్లో సగానికిపైగా (32) బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే నమోదయ్యాయి. 2014-17 మధ్యలో దాడుల పెరుగుదల అంతకుముందటి సంవత్సరాల కన్నా ఎక్కువగా ఉందని 'ఇండియా స్పెండ్' సంస్థ విశ్లేషించింది. విశ్వవిద్యాలయాల్లో

గొడవల్ని కూడా కలిపితే ఈ జాబితా ఇంకా పెరుగుతుంది. తన ప్రభుత్వం వచ్చాక దళితులపై అత్యాచారాలు తగ్గాయని మోదీ వాదిస్తుంటారు గానీ.. ఆ సంఖ్య పెరిగినట్టు అధికారిక గణాంకాలే వెల్లడిస్తున్నాయి. దళితులపై జరిగిన మొత్తం (నమోదైన) నేరాల సంఖ్య 2012లో 33,655, 2013లో 39,408 కాగా, 2015లో 45,003. దళితుల హత్యలు 2012లో 651, 2013లో 676కాగా, 2015లో 707కు చేరినట్టు నేషనల్ క్రైం బ్యూరో లెక్కలు చెబుతున్నాయి.

దేశ ప్రయోజనాల లెక్కప్రకారం నామమాత్రపు విలువ ఉన్న వారి పుట్టినరోజులకు కూడా ట్విట్టర్ ద్వారా విషెస్ చెప్పే ప్రధాని, దళితులపై దాడులను నిర్ద్వంద్వంగా ఖండించటానికి మాత్రం చొరవ చూపలేదు. సబర్మతీ ఆశ్రమం వందేళ్ల సందర్భ కార్యక్రమంలో గోరక్షక బృందాల దాడులపై మాట్లాడినప్పుడు కూడా.. అధికారంలో ఎవరో ఉన్నారనట్టు నీతివాక్యాలతో సరిపుచ్చారు. పాలకుల మొట్టమొదటి కర్తవ్యమైన చట్టబద్ధ పాలన ఎందుకు సక్రమంగా లేదు? వ్యవస్థలు ఎందుకు నిర్వీర్యమయ్యాయి? తాను అధికారంలోకి వచ్చాకే ఎందుకు ఈ దాడులు పెరిగాయి? అనే ఆత్మసమీక్ష, దిద్దుబాటు ప్రధానిలో కరవైంది. జనాభాలో 20శాతం దాకా ఉన్న దళితులలో వ్యతిరేకత ఇతర అణగారిన వర్గాలకు పాకి, ముస్లింలతో కలిసి సంఘటితమైతే తనకు, తన పార్టీ మనుగడకు కష్టం కాబట్టే.. ముమ్మందైనా దళితుల్లోకి బీజేపీని విస్తరించాలనే ప్రణాళిక ఉంది కాబట్టే, రాష్ట్రపతి ఎన్నికను అవకాశంగా ఉపయోగించుకుని రామ్‌నాథ్ కోవింద్‌ను మోదీ ఎంపిక చేశారు.

కోవింద్‌కు రాష్ట్రపతి పదవికి కావలసిన కనీస అర్హతలున్నా, మెరుగైన అర్హతలైతే లేవు. దళితుల పట్ల అధికార పార్టీ ప్రోత్సాహంతో జరుగుతున్న అవాంఛనీయ దాడుల పట్ల నిర్మాణాత్మకంగా స్పందించిన రికార్డయితే లేదు. మీరాకుమార్‌కి కూడా రాష్ట్రపతి పదవికి కావలసిన కనీస అర్హతలన్నీ ఉన్నాయి. ప్రతిభా పాటిల్ కంటే నిస్సందేహంగా మెరుగైన అభ్యర్థి. కానీ ఆమెను ఆలస్యంగా ఎంపిక చేసి కాంగ్రెస్ పార్టీ తన ఓటమిని ముందే అంగీకరించింది. లాలూ ప్రసాద్‌నో ఇంకెవరినో బాధ్యుల్ని చేయటం వంటి సాకులు ఎన్నయినా చెప్పుకోవచ్చు. విడకలవేటలా.. రాష్ట్ర విభజన సమయంలో లోక్‌సభ తలుపులు మూసివేసి ఆమోదింపచేసిన మీరాకుమార్ ఎంపికను ఖండించాలని కొందరు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నేతలు భావించినా, ఓడిపోయే అభ్యర్థి మీద యుద్ధమెందుకని మౌనం వహించారు. తెలంగాణ ప్రజల్లో అసంతృప్తికి కారణమైన కేంద్రీకృత దుష్పరిపాలన సాగించిన, ఆ అసంతృప్తిని అధికార క్రీడలో భాగంగా రెచ్చగొట్టి ఉపయోగించుకునేందుకు ప్రయత్నించిన పార్టీలను, నాయకులను వదిలేసి మీరాకుమార్‌ను అనుకుని ఏంలాభం? అనే ఇంగితం మాత్రం వారిలో ఇంకా కలగలేదు. అభ్యర్థి ఎవరో కూడా తెలియకుండానే మోదీకి మద్దతు తెలిపేందుకు తెలుగు నాట అధికార పార్టీలు, ఏపీలో ప్రతిపక్ష వైకాపా పోటీపోటీగా ఆరాటపడ్డాయి. దళిత నేత ఎంపిక సూచన తమదేనని క్రెడిట్ కొట్టేయటానికి కూడా మీడియా బాకాలతో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పోటీపడ్డారు.


దళితులతో ఇంకా సంఘర్షణాత్మక సమస్యను ఎదుర్కొంటున్నా రాష్ట్రపతి ఎన్నిక సందర్భంగా రాజకీయ క్రీడలో మోదీ ముందున్నారనే భావించాలి. అస్తిత్వ రాజకీయాల కొలమానంతో నడుస్తూ, ఇప్పుడు కూడా మీరాకుమార్‌ని ఎంపిక చేసిన కాంగ్రెస్ పార్టీ కూటమి తన కొలమానాల ప్రకారం మోదీ మంచి ర్యాంకే ఇవ్వాలిగా! కానీ దీనివల్ల దళితులకేమన్నా ఒరుగుతుందా? వారిలో అట్టడుగున ఉన్న కోట్లాదిమందికి ఏమైనా మేలు జరుగుతుందా? అంటే.. లేదనే సమాధానమే వస్తుంది. రాష్ట్రపతి పదవికి కనీస అర్హతలున్న ఇద్దరు దళితులు ప్రధాన అభ్యర్థులుగా రాష్ట్రపతి పదవికి పోటీపడటం ప్రజాస్వామికంగా స్వాగతించాల్సిన విషయం, అన్ని వర్గాలకూ ప్రజాస్వామిక ప్రాతినిధ్యం లభించే దిశగా ఇదో మంచి పరిణామం అని మాత్రమే చెప్పగలం. రామ్‌నాథ్ కోవింద్‌ను అభినందించగలం.

కోవింద్ ఎన్నికతో అట్టడుగున ఉన్న కోట్లాదిమంది దళితులకు ఏదో చేసేస్తున్నట్టు మోదీ బృందం ఎలా ప్రచారం చేసుకుంటుంది అనే పశ్నను ఈవేళ అస్తిత్వ ఉద్యమాల్లోనివారు, వామ పక్షీయులు కూడా అడుగుతున్నారు. కానీ అడగటానికి వారికి ఏమి అర్హత ఉంది? అర్హత సాధించేందుకు ఏమి దిద్దుబాటు చేసుకుంటున్నారు? కొందరు తొత్తుల్లాంటి నాయకులకు పదవులు, రిజర్వేషన్లు, తాయిలాలకు మించి వారు అణగారిన వర్గాలు ఏ విధమైన పరిష్కారాలు చూపారు? పరిష్కారాలు చూపినవారికి ఏ రకంగా మద్దతిచ్చారు? ఏళ్ల తరబడి ఉద్యమ జీవితం గడిపినవారు తమకు నమ్మకంలేని గుళ్లుగోపురాల చుట్టూ తిరుగుతూ దేవుడే దిక్కు అని చెప్పాల్సిన పరిస్థితి ఎందుకొచ్చింది? అస్తిత్వ శక్తులు ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేస్తూ పరిష్కారంలో భాగంగా మారితే అసంఖ్యాక అణగారినవర్గాల జీవితాలు మరింత మెరుగుపడేవి కావా? అస్తిత్వ రాజకీయాల వైఫల్యంతో.. రామ్‌నాథ్ కోవింద్ ఎంపిక మోదీ చేతిలో దళితాస్త్రంగా మారింది. ఈ అస్త్రం బీజేపీ గెలుపును దాటి దేశ ప్రయోజనాలను ఏమేర సాధించగలదనేది వేచిచూడాల్సిందే. తమ భావజాల బలం మీదకన్నా ప్రత్యర్థులు, వ్యవస్థల బలహీనతల మీదే ఎక్కువ ఆధారపడిన కాంగ్రెస్ సహా అస్తిత్వ రాజకీయశక్తులకు మాత్రం ఇది పిడికిళ్లు, మెదళ్లు తెరవాల్సిన దిద్దుబాటు సమయం!

**"అత్యుత్తమ సామర్థ్యంగలవారు హేతుబద్ధ, నైతిక మార్గాల ద్వారా వేగంగా అధికారంలోకి రాగలిగేలా చేయటమే రాజకీయ పార్టీల, ఎన్నికల వ్యవస్థల నిజమైన పరమార్థం"**

**– డా॥ జేపీ, లోక్‌సత్తా వ్యవస్థాపకులు** ★

# 'దళితులపై దాడులు'.. కొత్త పరిష్కారాలపై చర్చ జరగాలి



**2014** తర్వాత దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో దళితులపై దాడులు కొత్త రూపం దాల్చాయని గణాంకాలు, సమాచారం చెబుతున్నాయి. ఉత్తరాది రాష్ట్రాలలో ఇటీవల గోరక్షణ పేరుతో దాడులు పరంపర, దక్షిణాదిన కేరళ, తమిళనాడులో పాశవిక ఘటనలు, తెలంగాణలో వెనకబడిన కులాల నుంచి సైతం దళితులు దాడులను ఎదుర్కొంటుండటం, పరువు హత్యలకు పాల్పడుతుండటం చర్చనీయాంశమవుతున్నాయి. దీనికితోడు ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నందున దాన్ని మార్చాలని, రిజర్వేషన్లను తమకూ వర్తింపచేయాలని అగ్రకులాలుగా ముద్రవేయబడ్డ వారి నుంచి డిమాండ్లు పెరుగుతుండటం సంక్షోభాన్ని జటిలం చేస్తోంది. రాజకీయ ప్రాతినిధ్యం, రిజర్వేషన్లు, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధ పాలన, కుల నిర్మూలన నుంచి పలు అంశాలపై దేశవ్యాప్తంగా ఒక చర్చ పెద్దఎత్తున జరగాలని, రాజకీయ పార్టీలు, సామాజిక శక్తుల మధ్య స్థూల ఏకాభిప్రాయంతో నూతన పరిష్కారాలను అమలుచేయటం అవసరమని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ గణాంకాలు, సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన వివరాల ప్రకారం..

దేశవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న నేరాల్లో సగం రాజస్తాన్, ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లోనే చోటుచేసుకుంటున్నాయి. మిగతా అన్ని రాష్ట్రాల్లో కంటే రాజస్తాన్‌లో దళితులపై నేరాల సంఖ్య ఎక్కువగా ఉంది. ఆ రాష్ట్రంలో జరుగుతున్న నేరాల్లో సుమారు 65శాతం కేసుల్లో వారే బాధితులు. రాజస్తాన్ మొత్తం జనాభాలో దళితులు 17.8శాతం కాగా, దేశంలోని మొత్తం దళితుల జనాభాలో రాజస్తాన్‌లో ఉన్నది కేవలం 6శాతమే. కానీ.. దేశవ్యాప్తంగా వారిపై జరుగుతున్న నేరాల్లో మాత్రం 17.2శాతం ఇక్కడే నమోదవుతున్నాయి.

**ఆ మూడు రాష్ట్రాల్లో నేరాల పెరుగుదల ఇలా..**

| రాష్ట్రం | 2013 | 2014 | 2015 |
|---|---|---|---|
| ఉత్తర ప్రదేశ్ | 7078 | 8066 | 8946 |
| రాజస్తాన్ | 6475 | 6734 | – |
| బీహార్ | 6721 | 7874 | 7893 |

- ఉత్తరప్రదేశ్‌ది ఆ తరువాత స్థానం. దేశంలోని దళితుల్లో 20శాతం మంది ఆ రాష్ట్రంలోనే ఉన్నారు. వారిపై జరుగుతున్న మొత్తం నేరాల్లో 17శాతం ఇక్కడ నమోదవుతున్నాయి.
- దేశ ఎస్సీ జనాభాలో 8శాతం మంది బీహార్‌లో నివసిస్తున్నారు. ఇక వారిపై అకృత్యాలు 16 నుంచి 17శాతం ఇక్కడ చోటుచేసుకుంటున్నాయి. బీహార్ మొత్తం జనాభాలో ఎస్సీలు 15.9శాతం ఉండగా, ఆ రాష్ట్రంలోని నేరాల్లో 45శాతం వారిపైనే.

**తెలంగాణలో..**

- తెలంగాణ ఏర్పడిన మూడేళ్ల కాలంలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద 5,120 కేసులు నమోదయ్యాయి.
- 2014లో హత్యలు 39, అత్యాచారాలు 133, గాయపరచడం 180, గృహదహనం 1, ఇతర ఐపీసీ 680, పీసీఆర్ యాక్ట్ 2, ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం

## గోరక్షకులమంటూ..

- ఒక్క గుజరాత్‌లోనే గోరక్షకుల పేరుతో గత మూడునాలుగేళ్లలో సుమారు 50 బృందాలు ఏర్పడ్డాయి. ఇంజినీర్లు, స్థిరాస్తి వ్యాపారులు, ఉన్నతవిద్య చదువుకున్నవారూ ఈ బృందాలలో ఉంటున్నారు. వాట్సయాప్ గ్రూపుల్లో సమాచారం అందించుకుంటూ గోరక్షణ పేరుతో కార్యక్రమాలు చేపడుతున్నారు.
- గోరక్షక్ దళ్, అఖిల భారతీయ నవయుగ్ సంస్థ, అఖిల భారతీయ సర్వదలియా గోరక్ష మహా అభియాన్ సమితి వంటి సంస్థల్లో సుమారు 10వేల మంది ఉన్నారు.
- గుజరాత్ జంతు సంరక్షణ చట్టం ప్రకారం గోవులను వధించడానికి తరలించడం నేరం. దీంతో ఈ బృందాలు గోవుల తరలింపును అడ్డుకుని పోలీసులకు సమాచారమిస్తూ కేసులు నమోదయ్యేలా చేస్తున్నాయి. పశుకళేబరాలను తరలించే వృత్తిలో ఉండటం, పశుమాంసాన్ని ఆహారంగా తీసుకునే సంస్కృతిని అవకాశంగా తీసుకుని దళితులపై ఈ బృందాలు తరచూ హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్నాయని, ఘర్షణలను సృష్టిస్తున్నాయని ఆరోపణలు పెరుగుతున్నాయి.
- రాజస్తాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లలో ఇలాంటి బృందాలు క్రియాశీలంగా పనిచేస్తున్నాయి.

కేసులు 582 ఉన్నాయి. 2015లో ఈ సంఖ్యలు 39, 163, 172, 1, 748, 0, 530గా ఉన్నాయి. 2016లో హత్యలు 42, అత్యాచారాలు 206, గాయపరచడం 216, గృహదహనం 2, ఇతర ఐపీసీ 958, పీసీఆర్ యాక్ట్ 0, ఎస్సీ, ఎస్టీ అత్యాచారాన నిరోధక చట్టం కేసులు 480 ఉన్నాయి. వీటి మొత్తం చూస్తే.. 2014లో 1617, 2015లో 1689, 2016లో 1904 నేరాలు (అధికారికంగా) ఉన్నాయి. ★


## ఫీజుల నియంత్రణపై అసెంబ్లీలో చట్టం చేయాలి



ప్రైవేటు/కార్పొరేట్ విద్యాసంస్థల అధిక ఫీజుల బారినుంచి పేదలను కాపాడేలా రాష్ట్ర ప్రభుత్వం చట్టం తేవాలని, ఇందుకోసం అసెంబ్లీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని విద్యార్థిసంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. తెలంగాణ బీసీ విద్యార్థిసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో.. 'కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజు దోపిడీ – విద్యార్థి సంఘాల భవిష్యత్ కార్యాచరణ'పై సంఘాల నేతలు చర్చించారు. బంగారు తెలంగాణ సాధనకు కీలకమైన విద్యావ్యవస్థ రాష్ట్రంలో అధ్వాన్నంగా ఉందని, అమ్మ పెట్టకపోతే అడుక్కుతిందామనుకున్నా ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజులు పేద, మధ్యతరగతివారికి పెద్దభారంగా మారాయని లోక్‌సత్తా అనుబంధ విద్యార్థిసత్తా రాష్ట్ర అధ్యక్షుడు పి. రాజీవ్ అన్నారు. ఇష్టమొచ్చినట్టు వసూలు చేస్తున్న కట్టలేక లక్షలాది కుటుంబాలు చితికిపోతున్నాయని ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ బీసీ సంక్షేమసంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ అన్నారు. విద్యాసమస్యలపై ప్రభుత్వాన్ని కదిలించేందుకు సెప్టెంబర్ 4న హైదరాబాద్‌లో విద్యార్థి గర్జన నిర్వహిస్తామన్నారు. విద్య అంటే కార్పొరేట్ కళాశాలలే అనే దుస్థితి తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కూడా కొనసాగుతోందని ఉస్మానియా వర్సిటీ ఆచార్యుడు బసవ చిన్నప్ప అన్నారు. రాష్ట్రం మొత్తం ఒకే విద్య, ఒకే ఫీజు ప్రవేశపెట్టాలన్నారు. సమావేశంలో బీసీ సంఘం మహిళా నాయకురాలు భాగ్యలక్ష్మి, ఎంబీసీ విద్యార్థిసంఘం నాయకుడు బడేసాబ్, ఓయూ బీసీ జేఏసీ నాయకుడు జాజుల లింగంగౌడ్, కనకాల శ్యాం కురుమ, శ్రీను, రేపాక రాంబాబు, పాలకూరి కిరణ్‌కుమార్, గండి చెర్వు వెంకన్న, ఎస్. దుర్గయ్య గౌడ్, రామ్మూర్తి తదితర నేతలు పాల్గొన్నారు. ★

# విస్తరించిన 'ఉనా' .. దళితాగ్రహంలో హిందూత్వ!

- రాజ్‌దీప్ సర్దేశాయ్



అంతగా వెలుగులోకి రాని వాస్తవాలు విస్మయకరంగా ఉండటం కద్దు. 2002 గుజరాత్ మతోన్మాద అల్లర్ల సందర్భంగా, అహ్మదాబాద్‌లో ముస్లిం లను ఊచకోత కోయడంలో అగ్రగాములుగా ఉన్నది దళితులేనన్నది, బహుశా అటువంటి వాస్తవాలలో ఒకటిగా చెప్పవచ్చు. ఎందుకు ఇటువంటి అమానుష హింసాకాండకు పాల్పడ్డావని నిందితుడైన ఒక దళిత యువకుడి (ఆ నగరంలోని నరోడ పాటియా ప్రాంత నివాసి)ని అడిగాను. అతడు ఇచ్చిన సమాధానం నన్ను ఎంతైనా కలవర పరిచింది. 'ముస్లింలు ఖాళీ చేసి వెళ్లిపోయిన ఇళ్లను మాకు ఇస్తామని భజరంగ్‌దళ్ నాయకులు హామీ ఇచ్చారు'. నిస్సహాయ ముస్లింపై విరుచుకుపడిన మూకల్లో అత్యధికులు దళితులేనన్నది ఒక పచ్చినిజం. ముస్లింలను నిర్మూలిస్తే చట్టం నుంచి రక్షణతోపాటు భారీ ఆర్థిక ప్రయోజనాలు సమకూరుస్తామని అగ్రవర్ణ హిందువులు ఇచ్చిన భరోసాతోనే ఆ దళితులు అలా వ్యవహరించారన్నది కూడా ఒక కఠోర వాస్తవం. స్థానిక ముస్లింలను తమ ఉమ్మడి 'శత్రువు'గా పెత్తందారీ హిందువులు, దళితులు పరిగణించిన దుష్టకాలమది.

ఆ పాడుకాలం ముగిసిపోయిందని చెప్పగలమా? చెప్పలేముగానీ ఇప్పుడు అంటే 2016-17లో ఆ సుసంఘటిత 'హిందూ' అస్తిత్వం విచ్ఛిన్నమవుతున్న సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఉనాలో నలుగురు దళిత యువకులను గోరక్షణ నిఘా బృందాలవారు చింత బరికెలతో బాదిన దృశ్యాలు పత్రికలు, ప్రసార సాధనాలు మరీ ముఖ్యంగా సామాజిక మాధ్యమాలలో భారతీయులనే కాదు, యావత్ ప్రపంచాన్నీ దిగ్భ్రాంతి పరిచాయి. గుజరాతీ సమాజంలో పైకి కన్పిస్తున్న మతసామరస్యం, శాంతియుత సహజీవనం మాటున సామాజిక అశాంతి ఎంత తీవ్రంగా ఉందో ఉనా ఘటన, దాని పర్యవసానాలు వెల్లడించాయి.

ఉనాలో ప్రజ్వరిల్లిన ఆగ్రహం అహ్మదాబాద్ వీథులకు, విశాల భారతానికి విస్తరించింది. ఇటువంటి వివక్షాభరిత హింసాకాండను దళితులు ఇంకెంత మాత్రమూ సహించబోరని సకల భారతీయులకూ స్పష్టమయింది. గుజరాత్ రాష్ట్ర జనాభాలో దళితుల సంఖ్య కేవలం ఏడు శాతమే అయినప్పటికీ అగ్రవర్ణ హిందువుల కపటాలను వారింకెంత మాత్రం సహించబోరని ఉనా ఘటన పూర్వాపరాలు విశదం చేశాయి. అంతేగాదు మూడు దశాబ్దాల క్రితం గుజరాత్‌లో సంఘ్ పరివార్ ప్రారంభించిన రాజకీయ పథకం పరిపూర్తికి తీవ్ర ఆటంకంగా పరిణమించాయి.

1980ల నాటి నుంచి భారతీయ జనతా పార్టీ తన రాజకీయ విస్తరణకు గుజరాత్‌ను ఒక ప్రయోగశాలగా భావించిందని మరి చెప్పనక్కర్లేదు. గుజరాత్‌లోనే రామ్ జన్మభూమి ఉద్యమం ప్రారంభమయింది. ఆ రాష్ట్రంలోని సోమనాథ్ నుంచి ప్రారంభమైన లాల్ కృష్ణ అద్వానీ రథయాత్ర దేశవ్యాప్తంగా కులాలకతీతంగా సమస్త హిందువుల మద్దతును పొందింది. అంతకుముందు ఒక దశాబ్దకాలంగా కొనసాగిన తీవ్ర కుల, మత ఘర్షణల నేపథ్యంలో ఈ కాషాయ వెల్లువ దేశాన్ని ముంచెత్తివేసింది.

రిజర్వేషన్ల వ్యతిరేక నిరసనలు 1980వ దశకం మధ్య నాళ్లలో మతతత్వ అల్లర్లుగా పరిణమించాయి. కాంగ్రెస్ పార్టీ ఎంతో కష్టపడి నిర్మించిన కులాల సంకీర్ణం 'ఖామ్' (క్షత్రియులు, హరిజనులు, ఆదివాసీలు, ముస్లింలు) విచ్ఛిన్న మయింది. ఈ సామాజిక సమైక్యత కూలిపోవడంతో గుజరాత్ రాజకీయాలలో కాంగ్రెస్ ఆధిపత్యానికి తెరపడటం ప్రారంభమయింది. కాంగ్రెస్

కోల్పోతున్న స్థానాన్ని బీజేపీ క్రమేణా ఆక్రమించింది.

బీజేపీ నిర్మించిన సుసంఘటిత హిందూ అస్తిత్వం ఇప్పుడు తీవ్ర ఒత్తిళ్లకు లోనవుతున్నది. తొలుత రిజర్వేషన్లకై పటేల్ కులస్తులు ఆందోళన చేశారు. ఆర్థిక సంస్కరణలు సాధించిన శీఘ్ర ఆర్థికాభివృద్ధి 'కొత్త మధ్యతరగతి వర్గం'ను సృష్టించింది. అయితే సంపద సృష్టి ప్రక్రియలో భాగస్వామ్యం లభించని వారు తీవ్ర అసంతృప్తికి లోనుకావడానికి కూడా ఆ ఆర్థిక పురోగతి దారితీసింది మరి. ఇందులో భాగమే పటేళ్ల ఆందోళన.

ఇక ఇప్పుడు దళితులు తాము అన్ని విధాలా దగా పడ్డామని భావిస్తున్నారు. అగ్రవర్ణ హిందువులలో తాము ఉంచిన విశ్వాసం వమ్మయిపోయిందని వారు ఆగ్రహిస్తున్నారు. అగ్ర కులాలవారు విశ్వాస ద్రోహానికి పాల్పడ్డారని దళితులు ఆరోపిస్తున్నారు. కేవలం ఉనా ఘటన ఆధారంగానే దళితులు ఇలా ఆక్షేపించడం లేదన్న సత్యాన్ని మనం గుర్తించాలి. ఎందుకంటే గుజరాత్‌లో దాడులు బాగా పెరిగిపోయాయని, ఆ దుర్మార్గాలకు పాల్పడినవారిలో దోషులుగా నిర్ధారితులై శిక్షకు గురవుతున్న వారి సంఖ్య అతి తక్కువగా ఉంటుందని అధికారిక గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. ఈ కఠోర వాస్తవాన్ని దళితులు గుర్తించటం ఎట్టకేలకు ప్రారంభమయింది. రథయాత్రలో పాల్గన్నా, మతతత్వ అల్లర్లలో చురుగ్గా వ్యవహరించినా తమ పట్ల వివక్ష యధావిధిగా కొనసాగుతుందని వారు గుర్తించారు. సౌరాష్ట్ర మొదలైన ప్రాంతాల్లో భూస్వామ్య వ్యవస్థ ఇంకా బలంగా కొనసాగుతోంది. కులపరమైన ఆంక్షలను దళితులు ఖచ్చితంగా పాటించి తీరాల్సిన పరిస్థితులు అక్కడ ఉన్నాయి.

మరింత సమ్మిళిత పార్టీగాను, సామాజికంగా తక్కువ మితవాద ధోరణి గల పార్టీగాను ప్రజలకు కనిపించడమనేది భారతీయ జనతా పార్టీ తన రాజకీయ ఆరోహణలో ఎదుర్కొన్న సవాళ్లలో ఒకటి. ఈ సవాల్‌ను అధిగమించేందుకే ఉత్తరప్రదేశ్‌లో కల్యాణ్ సింగ్, గుజరాత్‌లో నరేంద్రమోదీ లాంటి ఇతర వెనుకబడిన వర్గాలకు చెందిన నాయకులను ప్రోత్సహించింది. అందలమెక్కించింది. బ్రాహ్మిణ్–బనియా పార్టీ అనే ముద్ర నుంచి బయటపడేందుకే బీజేపీ ఈ ఉదారత్వాన్ని చూపింది. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కూడా ఈ ఉదార వైఖరిని ప్రోత్సహించింది. తత్ఫలితంగానే 1990వ దశకంలో ఉత్తరాది, పశ్చిమ భారత రాష్ట్రాలలో బీజేపీ గణనీయమైన విజయాలను సాధించింది. 2014 సార్వత్రిక ఎన్నికలకు ముందు దళిత నాయకుల మద్దతును సమీకరించుకునేందుకు బీజేపీ ఉద్దేశపూర్వకంగా ప్రయత్నించింది. బీహార్‌లో రామ్ విలాస్ పాశ్వాన్‌తో పొత్తు పెట్టుకోవడం, ఢిల్లీలో ఉదిత్ రాజ్‌ను భాగస్వామిగా చేసుకోవడం మొదలైనవన్నీ ఆ ప్రయత్నంలో భాగమే. ఉత్తర ప్రదేశ్‌లో సైతం మాయావతి నుంచి జాతవ్‌యేతర దళితులను దూరం చేయడానికి ఒక స్పష్టమైన వ్యూహాన్ని బీజేపీ అనుసరించింది. మాయావతి పార్టీ నుంచి తమ వైపునకు వచ్చిన వారికి హిందూ పరివార్‌లో సభ్యత్వం కల్పిస్తామని హామీ ఇచ్చింది. ప్రధాని మోదీ స్టాండప్ ఇండియా పథకాన్ని ప్రముఖ దళిత నాయకుడు కీర్తిశేషుడు బాబూ జగ్జీవన్ రామ్ జయంతి రోజున ప్రారంభించడం గమనార్హం. దళితులలో వ్యవస్థాపనా సామర్థ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించడం జరిగింది.

దళితుల విశ్వాసాన్ని గెలుచుకోవడానికి బీజేపీ చేసిన కృషి అంతా ఉనా వంటి ఘటనలతో వ్యర్థమైపోయే పరిస్థితి ఏర్పడింది. దళితులను అగ్రకులాల వారు భయానకంగా హింసించటం ఇదే మొదటిసారి కాదు. మహారాష్ట్రలో కాంగ్రెస్–ఎన్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఖైర్లాంజీలోను, హర్యానాలో కాంగ్రెస్ ప్రభుత్వ సాక్షిగా హిస్సార్, సోనేపట్‌లోను, బీహార్‌లో రాష్ట్రీయ జనతాదళ్ ప్రభుత్వ హయాంలో లక్ష్మణ్‌పూర్ బాథేలోను ఉనాలో కంటే అత్యంత పాశవికమైన రీతిలో దళితులపై దాడులు, దౌర్జన్యాలు జరిగాయి.

అయితే ఉనా ఘటన ప్రధాని మోదీ సొంత రాష్ట్రంలో జరిగింది. ఆ అమానుషత్వం చోటుచేసుకున్న వారం రోజులకు గానీ, అదొక రాజకీయ అగ్నిపర్వతాన్ని సృష్టించిందనే వాస్తవాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి తెలుసుకోలేక పోయారు. అప్పటికే జరగవలసిన నష్టం జరిగిపోయింది. గో సంరక్షణ బృందాలను అదుపుచేసేందుకు పటిష్ట చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం పెద్దగా ప్రయత్నించకపోవడం కూడా బీజేపీకి ఎంతైనా నష్టం కలిగించిందన్నది ఒక వాస్తవం.

గోవధపై నిషేధాన్ని దున్నపోతులు, గేదెల విషయంలో కూడా వర్తింపచేశారు. బీజేపీ పాలనలో ఉన్న హర్యానా, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలలో పశు మాంస విక్రయం, వినియోగంపై కూడా నిషేధం విధించారు. దీంతో గో సంరక్షణ బృందాలవారు తమ చర్యలకు ప్రభుత్వ అండదండలు ఉన్నాయని విశ్వసించి మరింతగా విజృంభించారు.

ఈ పరిస్థితులలో, చనిపోయిన పశు

కళేబరాలను కాల్చివేయడం, చనిపోయిన ఆవుల చర్మాలను ఒలవడం, పశుచర్మాలను శుద్ధిచేయడం ఇత్యాది 'వంశానుగత' వృత్తులలో ఉన్న దళితుల విషయమై తమ వైఖరి ఏమిటో బీజేపీ, సంఘ్‌పరివార్ స్పష్టంగా ప్రకటించాల్సిన అవసరం ఎంతైన ఉన్నది. సాంప్రదాయక హిందూ ధర్మం తమకు నిర్దేశించిన వృత్తులను ఆచరిస్తున్న దళితులను స్వచ్ఛత, కల్మషంలాంటి ప్రతికూల భావనలతో హిందూ వ్యతిరేకులుగా పరిగణించడం భావ్యమేనా?

దళితుల మద్దతుకు ప్రయత్నిస్తూ, అదే సమయంలో గో రక్షణ పేరిట అత్యంత వికృతకుల వివక్షను ఆచరించడం, లక్ష్య పరిపూర్తికి తోడ్పడదనడంలో సందేహం లేదు. బాబాసాహెబ్ అంబేద్కర్ బోధనల పట్ల భక్తిగౌరవాలు, మనుస్మృతితో ప్రగాఢ అనుబంధమూ సహజీవనం నెరపలేవు. గోమాత పేరిట జరుగుతున్న నేరాలను నిరోధించకపోతే హిందూత్వ కార్యక్రమం నిరర్థకమైపోతుంది.

తాజా కలం: 2007లో ప్రచురితమైన తన 'కర్మయోగ' అనే పుస్తకంలో 'పాయఖానాలు శుభ్రం చేయడమనేది వాల్మీకి కులస్తులకు ఒక ఆధ్యాత్మిక అనుభవమని' ప్రధాని మోదీ పేర్కొన్నారు. మలమూత్రాలను ఎత్తివేయడమనేది ఎటువంటి 'ఆధ్యాత్మిక అనుభవమో' మోదీ దేశ ప్రజలకు దయచేసి వివరిస్తారా?

(కర్టెసీ: ఆంధ్రజ్యోతి) ★

## ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా అచల్ కుమార్

**భా**రత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)గా అచల్ కుమార్ జ్యోతి నియమితులయ్యారు. ఈ బాధ్యతకు ముందు ఆయన ఎన్నికల కమిషనర్‌గా ఉన్నారు. ప్రధాని నరేంద్రమోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా (సీఎస్)గా వ్యవహరించారు.

## భారత్ - ఇజ్రాయెల్ మధ్య వెల్లివిరిసిన సహకారం

**భా**రత్, ఇజ్రాయెల్ నడుమ ఉన్న సంబంధాలను 'వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి తీసుకెళ్లి ఉగ్రవాదం పీచమణచటంలో సంయుక్త కృషి చేయాలని రెండు దేశాలూ తీర్మానించాయి. ఇజ్రాయెల్‌ను సందర్శించిన తొలి ప్రధాని నరేంద్ర మోదీకి ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు విశేష ప్రాధాన్యతనిచ్చారు. ఇరు దేశాల మధ్య మధ్య ఏడు కీలక ఒప్పందాలు కుదిరాయని, ఈ పరస్పర సహకారం భారత్‌కు వివిధ రంగాలలో ఎంతో లాభిస్తుందని మోదీ తెలిపారు. జీ-20 శిఖరాగ్ర సదస్సులోనూ పర్యావరణ పరిరక్షణ, అవినీతి అంతం, మహిళా సాధికారతకు విద్య, వ్యవసాయం-ఆహారభద్రతతోపాటు.. ఉగ్రవాదంపై పోరును ప్రధాన ఎజెండాగా దేశాలు గుర్తించాయి.

## జనావాసాల మధ్య మద్యం దుకాణాలను సహించం



**రా**ష్ట్ర ప్రభుత్వం మద్యాన్ని ఆదాయమార్గం చేసుకోవటమే దారుణమైతే, ఇప్పుడు ఇళ్ల మధ్య కూడా మద్యం దుకాణాలను ఏర్పాటు చేయటం అదనపు సమస్యల్ని సృష్టిస్తుందని బాబ్జీ అన్నారు. నేతలు, వ్యాపారులు, అధికారులు కలిసి ప్రజాప్రయోజనాలకు గండికొడుతున్నారన్నారు. జనవాసాల మధ్య దుకాణాలను తొలగించకపోతే ఆందోళన చేపట్టాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ మద్యం విధానానికి, ఇళ్ల మధ్య దుకాణాల ఏర్పాటుకు నిరసనగా విజయనగరంలో గాంధీ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేశారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్లారు. జాతీయ రహదారులపై మద్యం దుకాణాలు వద్దని కోర్టు ఇచ్చిన తీర్పును తప్పించుకునేందుకు ఏకంగా రోడ్ల కేటగిరీలనే మార్చేస్తున్న ప్రభుత్వం తీరుని కూడా బాబ్జీ లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఖండించారు. మద్యం విధానాన్ని మార్చాలని డిమాండ్ చేశారు. ★

# మస్తిష్కాలపై మకిలి వదిలించుకుంటేనే ప్రగతి!

- డా॥ జయప్రకాష్ నారాయణ్

ఇటీవల సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకం విషయంలో రాష్ట్రపతి కె.ఆర్ నారాయణన్ చేసిన సూచనల మీద కొంత దుమారం లేచింది. రాష్ట్రపతి– సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూచనల మేరకు ముగ్గురు న్యాయమూర్తులను నియమిస్తూ, న్యాయమూర్తుల పదవికి అర్హులైన దళితులు ఉన్నారని, వారికి సరైన ప్రాతినిధ్యం కల్పించేందుకు చర్యలు చేపట్టాలని, ప్రభుత్వానికి, పరోక్షంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సలహా ఇచ్చారు. వెంటనే కొన్ని పత్రికలు, ఎందరో న్యాయకోవిదులు ఈ విషయమై రాష్ట్రపతిని తప్పుపట్టారు. రాజ్యాంగం ప్రకారం భారత రాష్ట్రపతి దేశాధినేత. ఆయనకు ప్రత్యక్షంగా పాలనాధికారం లేకపోయినా, పాలన అంతా ఆయన పేరు మీదుగా నడుస్తుంది. ఆయనే సర్వసైన్యాధ్యక్షుడు. అలాగే ఆయన పార్లమెంటులో భాగం. అందుకే ఆయన ఆమోదం లేకుండా ఏ చట్టమూ చేయటం సాధ్యం కాదు. అన్ని రాజ్యాంగ సంస్థల నియామకం ఆయన చేతుల మీదగానే జరగాలి. అందులో భాగంగానే సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల నియామకం ఆయన సంతకం చేసిన వారంటు ద్వారా జరుగుతుంది. మనదేశంలో అన్ని వర్గాల ప్రజలకు, దేశ సార్వభౌమత్వానికి రాష్ట్రపతి చిహ్నం. న్యాయమూర్తుల నియామకంలో రాష్ట్రపతి సూచనలను తప్పుపట్టేవారి వాదన ఏమంటే, దేశంలో అందరికీ ప్రాతినిధ్యం వహిస్తూ, అన్ని వర్గాల వారినీ సమదృష్టితో చూడవలసిన రాష్ట్రపతి



దళిత వర్గానికి కొమ్ముకాస్తున్నారని, తనకు రాజ్యాంగం ఇచ్చిన అధికారాలని అతిక్రమించారనీ! కాస్త నిశితంగా పరిశీలిస్తే, ఈ వివాదంలో రాష్ట్రపతి మీద విమర్శలు ఏమాత్రం సహేతుకం కావని తేలుతుంది.

**రాష్ట్రపతి రబ్బరు స్టాంపు కాదు**

భారత రాష్ట్రపతికి బ్రిటిష్ రాజు (రాణి)కు ఉండే అధికారాలే ఉన్నాయి. పాలన రాష్ట్రపతి పేరు మీద నడిచినా, నిజానికి ప్రభుత్వాధికారం అంతా ప్రధానమంత్రి చేతిలోనూ, మంత్రివర్గం చేతిలోనూ ఉంటుంది. ఈ విషయాన్ని ఎవ్వరూ కాదనలేరు. అంతమాత్రాన భారత రాష్ట్రపతి ఊరికే రబ్బరు స్టాంపు కాదు. ఎన్నికయిన పార్లమెంటు ఉభయ సభల సభ్యులు, అన్ని రాష్ట్రాల శాసనసభల సభ్యులు కలిసి రాష్ట్రపతిని ఎన్నుకుంటారు. రాజ్యాంగంలో 74వ అధికరణం ప్రకారం ప్రభుత్వం చేసిన ఏ ప్రతిపాదననయినా పున:పరిశీలన కోసం రాష్ట్రపతి తిప్పి పంపవచ్చు. ప్రతిపాదనను రెండోసారి మంత్రివర్గం రాష్ట్రపతి ఆమోదం కోసం పంపితే, ఆయన దాన్ని ఆమోదించాలి. అలాగే రాజ్యాంగంలో 86వ అధికరణం ప్రకారం రాష్ట్రపతి పార్లమెంటుకు ఏదైనా అంశంపైన సందేశం పంపి దాన్ని తక్షణం పరిశీలించాలని కోరవచ్చు. అలాంటప్పుడు పార్లమెంటు విధిగా తక్షణమే రాష్ట్రపతి సందేశాన్ని పరిగణలోకి తీసుకుని పరిశీలించాలి. వీటితోపాటు లోక్‌సభను రద్దుచేసే అధికారం, ప్రధానమంత్రిని, మంత్రిమండలిని నియమించే అధికారం, మంత్రివర్గాన్ని పదవుల నుంచి తొలగించే అధికారం రాష్ట్రపతికి ఉన్నాయి. అంతేగాక, ఏ విషయం మీదయినా పాలనా సమాచారాన్ని పొందే హక్కు, ప్రభుత్వాన్ని హెచ్చరించి సలహాలిచ్చే అధికారం నిస్సందేహంగా భారత రాష్ట్రపతికున్నాయి. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకుంటే, న్యాయమూర్తుల నియామకం విషయంలో రాష్ట్రపతి సూచనలివ్వడం పూర్తిగా రాజ్యాంగబద్ధం. ఈ విషయంలో ఎలాంటి సందేహానికి తావులేదు. మరయితే, రాజ్యాంగబద్ధంగా రాష్ట్రపతి రహస్యంగా ఇచ్చిన సలహా మీద ఇంత దుమారం ఎందుకు చెలరేగింది? ఇదే రాష్ట్రపతి ఉత్తరప్రదేశ్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని గుజ్రాల్ ప్రభుత్వం పంపిన ప్రతిపాదనను 1997లో తిరస్కరించినందుకు అందరూ ప్రశంసించారు. అప్పుడు ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ, బీఎస్పీ సంకీర్ణ ప్రభుత్వం నుంచి బహుజన్ సమాజ్ పార్టీ తప్పుకుంది. బీఎస్పీ శాసనసభా పక్షం చీలి కొందరు సభ్యులు ప్రభుత్వానికి మద్దతు పలికారు. గవర్నర్ ఆదేశం మీద శాసనసభలో బలపరీక్ష జరిగినప్పుడు ప్రభుత్వం అధిక సంఖ్యాకుల మద్దతుతో సభ విశ్వాసాన్ని

పొందింది. అప్పటి గవర్నర్ రమేష్ భండారీ, శాసనసభలో హింసాకాండ చెలరేగిందన్న వంకతో సభ విశ్వాసాన్ని పొందిన ప్రభుత్వాన్ని రద్దుచేసి రాష్ట్రపతి పాలన విధించాలని సిఫారసు చేశారు. అప్పటి రక్షణ మంత్రి ములాయంసింగ్ యాదవ్, వామపక్షాలు పట్టుబట్టగా, గుజ్రాల్ మంత్రివర్గం రాష్ట్రపతిపాలన విధించాలని తీర్మానించి ఆమోదానికి రాష్ట్రపతి కె.ఆర్ నారాయణన్‌కు పంపింది. రాష్ట్రపతి పరిస్థితుల్ని బేరీజు వేసి ఆ ప్రతిపాదనను ఆమోదించకుండా దాన్ని పునఃపరిశీలించమని తిప్పి పంపారు. ఆనాడు బీజేపీ నాయకులు, పత్రికలు, దేశంలో ఎందరో ఆలోచనాపరులు రాష్ట్రపతి నిర్ణయాన్ని హర్షించారు. దళిత నాయకులు కాన్షీరాం, మాయావతి కోరినా ఆమోదించక రాష్ట్రపతి నిష్పాక్షికంగా, హుందాగా, రాజ్యాంగబద్ధంగా వ్యవహరించి ప్రజాస్వామ్యాన్ని రక్షించారు. స్వయంగా దళితుడుగా జన్మించి ఎన్నో ఇక్కట్లపాలయిన రాష్ట్రపతి నారాయణన్ ఏ వర్గానికీ కొమ్ము కాయలేదు. అలాగే 1998లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గవర్నర్ ఎస్.ఎస్ భండారీ సిఫారసు మేరకు బీహార్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని పంపిన ప్రతిపాదననూ ఆయన తిరస్కరించారు. అప్పుడు కూడా వామపక్షాలు, రాష్ట్రీయ జనతాదళ్ వగైరా పార్టీలు రాష్ట్రపతి నిర్ణయాన్ని హర్షించాయి.

**కులాల పేరుతో ఉద్రేకాలు**

అలాంటిది ఇప్పుడు దేశ జనాభాలో 22శాతం పైగా ఉన్న షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ జాతులవారికి న్యాయమూర్తుల నియామకంలో తగిన ప్రాధాన్యమివ్వాలని సూచిస్తే, ఏదో అన్యాయం జరిగినట్టుగా గుండెలు బాదుకోవటం చాలా అన్యాయం! కుల మతాల విభేదాలు మనుషుల్ని ఎంతగా ఉద్రేకాలకు, ఉన్మాదాలకు గురిచేస్తాయో ఈ చిన్న సంఘటన తెలియజేస్తుంది. న్యాయమూర్తుల నియామకంలో దళితులకు ప్రత్యేక కోటాగానీ, రిజర్వేషన్‌గానీ కావాలని రాష్ట్రపతి సూచించలేదు. భారత సమాజాన్ని దృష్టిలో ఉంచుకుని, వాస్తవికంగా ఆలోచించి వ్యవహరించాలని, అవకాశమున్న మేరకు సమాజంలో అణగారిన వర్గాలకు, దోపిడీకి గురవుతున్న వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం ఉండాలని మృదువుగా సూచించారు. ఏ విధంగా చూసినా ఈ సూచన ధర్మబద్ధమైనది, న్యాయమైనది, ఆచరణ సాధ్యమైనది. ఇలాంటి అంశాల మీద నిజాయతీగా, నిష్పాక్షికంగా ఆలోచించే శక్తిని నేతలు, అధికారులు, మేధావులనబడేవారు చాలామేరకు కోల్పోయారు. దళితులకు రిజర్వేషన్లు ఇలా కొనసాగాలా వద్దా అని ఎవరయినా ప్రశ్నిస్తే, వాటిని రద్దుచేయాలని సమాధానం చెప్పేవారిలో నూటికి 99మంది రిజర్వేషన్ల వల్ల ప్రయోజనం పొందని అగ్రకులాలవారు, మధ్యకులాల వారు అయిఉంటారు! అలాగే రిజర్వేషన్లు ఏ మార్పు లేకుండా ఇలాగే కొనసాగాలని కోరేవారిలో నూటికి 99మంది వాటి వల్ల లబ్ధి పొందే దళితులయి ఉంటారు! అంటే, ఈ అంశంలో సమాజంలో లోతైన పరిశీలనగానీ, విచక్షణా దృష్టిగానీ కానరాదు.

**దుర్భేద్యమైన అడ్డుగోడలు**

వీటన్నింటి వెనుక మరొక మౌలిక సమస్య ఉంది. శతాబ్దాల పర్యంతం భారతీయ సమాజంలో కోట్లాదిమందిని బానిసలుగా చూశారు. పుట్టుకతోనే అంతరాలను సృష్టించి, శాశ్వతమైన కృత్రిమ అడ్డుగోడల్ని నిర్మించారు. ఒకసారి ఒక కులంలో పుట్టాక ఇక దాన్నుంచి బయటపడటం అసాధ్యం చేశారు. ముక్కుపచ్చలారని కోటానుకోట్ల పసిపాపల్ని పుట్టు బానిసలుగా చేశారు. అస్పృశ్యత పేరుతో ఎందరినో హేయంగా, నీచంగా అవమానించి మానవత్వాన్ని మంటగలిపారు. స్వతంత్ర భారతంలో చట్టబద్ధంగా పేరుకు అస్పృశ్యతను నిషేధించినా, వాస్తవానికి నేటికీ కోట్లాది దళితులు అవహేళనకు, అవమానాలకు గురవుతున్నారు. మనదేశంలో ఉన్న నిరక్షరాస్యులలో అత్యధికులు దళితులే. దళిత కులాలలో పుట్టిన ఒకే ఒక్క కారణాన నూటికి 90మంది ప్రపంచంలో ఏ అవకాశం లేక, కనీసం అక్షరజ్ఞానం లేక, సరైన ఆరోగ్య సదుపాయం లేక దుర్భర దారిద్ర్యంలో మగ్గుతున్నారు. లేతవయసులో నడుములు విరిగేలా వెట్టిచాకిరి చేస్తూ పొట్ట నింపుకుంటున్న బాలకార్మికులలో అధిక సంఖ్యాకులు దళితులే. పాఠశాలల్నే చూస్తే, ఒకప్పుడు సవర్ణ హిందువులకు ఉపయోగ పడినంతకాలం అవి బాగానే పనిచేశాయి. అదే ఇప్పుడు ప్రైవేటు విద్యాసంస్థలు పెరిగి, ప్రస్తుతం ప్రధానంగా దళితులకు ఉపయోగపడుతున్న ప్రభుత్వ పాఠశాలలపైన ఖర్చు ఎన్నో రెట్లు పెరిగినా వాస్తవానికి ప్రయోజనం మాత్రం శూన్యమవుతున్నది. తరచి చూస్తే స్వతంత్ర భారతంలో పేరుకు దళిత జనోద్ధరణకని రాయితీలు కల్పించినా, రాజ్యాంగబద్ధ రక్షణ ఇచ్చినా, ప్రభుత్వం ఎన్నో కంటితుడుపు పథకాలను ప్రకటించినా దళితుల స్థాయి సమాజంలో మిగిలినవర్గాలతో పోలిస్తే ఏమీ పెరగలేదు. దళితులను, బలహీన వర్గాలవారిని వారి పేదరికాన్ని సాకుగా తీసుకుని మభ్యపెట్టడం, వివిధ పథకాల పేరుతో తాత్కాలికంగా ప్రలోభపెట్టడం, వారి ఓట్లు దండుకుని అధికారంలో తిష్టవేయడం– ఇవి మాత్రమే రాజకీయ పార్టీల లక్ష్యాలయిపోయాయి.

స్వాతంత్ర్యానికి ముందు మహాత్మా జోతిబాఫూలే, నారాయణగురు, మహాత్మాగాంధీ, అంబేద్కర్ వంటి ఎందరో మహనీయులు దళితుల విముక్తి కోసం, కులం కారణంగా అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాటం చేశారు. ఎన్నో ఉద్యమాలు చేపట్టారు. గత 50 సంవత్సరాలలో కాగితాల మీద ఎన్నో హక్కుల్ని కల్పించి, సమాజంలో ఏమాత్రం పురోగతిల ఏకుండా పాలకులు జాగ్రత్త పడ్డారు. అక్షరజ్ఞానం, మౌలిక అవకాశాలు కల్పిస్తే దళితులు ఎక్కడ తెలివిమీరిపోయి తమ చేయిదాటి పోతారోనని అవి మాత్రం లేకుండా చేశారు. రాజ్యాంగబద్ధ దోపిడీని యథావిధిగా కొనసాగించారు.

**అణగారిన వర్గాలకు అన్యాయం**

కొంతకాలం క్రితం సుప్రసిద్ధ కార్టూనిస్టు ఆర్‌కే లక్ష్మణ్ ఒక వ్యంగ్య చిత్రం వేశారు. ఆ చిత్రంలో ఇద్దరు పిల్లలు, ఇద్దరు తల్లులు ఉంటారు. ఒక పిల్లవాడు దర్పంగా, ఆరోగ్యంగా, స్కూలు యూనిఫారంలో తళతళలాడుతూ ఉంటే, మరొక కుర్రవాడు చాలా పేలగా, బలహీనంగా, పక్కటెముకలు కనిపిస్తూ, వంటి మీద చిరిగిన లాగూ తప్ప మరేమీ లేకుండా ఉండి, బండెడు పుస్తకాల బరువు వంగి మోస్తూ ఉంటాడు. ఒక తల్లి మరొకామెతో, 'మరీ స్కూళ్లలో పుస్తకాలు పెంచేసి గాడిదబరువు పిల్లల నెత్తిన పెడుతున్నారండీ. అందుకే మా అబ్బాయి పుస్తకాలు మోయటానికి ఈ పనివాణ్ణి పెట్టాను!' అంటుంది. వర్ధమాన భారతంలో దళిత బాలలకు, అణగారిన వర్గాలకు జరుగుతున్న అన్యాయాన్ని కళ్లకు కట్టినట్టుగా చూపించిన కార్టూను అది. ఈనాడు నిజంగా ప్రజాస్వామ్యాన్ని నిర్మించాలంటే చేపట్టవలసిన మొట్టమొదటి కార్యక్రమం, దళితులకు, కులం పేరుతో వివక్షకు గురవుతున్న వర్గాలకు సమాజంలో హుందాతనాన్ని, కనీస అవకాశాల్ని కల్పించటం. బీఎస్పీ నేత కాన్షీరాం 'ఓట్ హమారా, రాజ్ తుమ్‌హారా: ఏ నహీ చలేగా, నహీ చలేగా' (ఓటు మాది పెత్తనం మీద, ఇది చెల్లదుగాక చెల్లదు) అని దళితుల హక్కుల కోసం ఒక అద్భుతమైన నినాదాన్ని ఇచ్చారు. అయితే దురదృష్టమేమంటే, ఆ నినాదంలోని పరమార్థాన్ని చివరికి బీఎస్పీ నేతలు కూడా విస్మరించారు. అగ్రవర్ణ దోపిడీ బదులు దళిత నేతల దోపిడీ జరిగితే దళితులకు ఏ ప్రయోజనమూ సిద్ధించదు. అసలు దోపిడీనే అరికట్టాలి. దళిత బాలలు, అగ్రవర్ణాల పిల్లలు అందరూ కలసికట్టుగా సమాన అవకాశాలతో హుందాగా నివసించేలా రాజ్యవ్యవస్థను నిర్మించాలి. కళ్యాణ్‌సింగ్ బదులు మాయావతి గద్దెనెక్కితేనో, జగన్నాథ్‌మిశ్రా బదులు లాలూయాదవ్ వచ్చినంత మాత్రానో దళితులకేమీ ఒరగదు. కులాన్ని నిచ్చెనగా వాడుకుని ఎందరో అందలాలెక్కుతున్నారు. ఒకసారి నెత్తికెక్కాక స్వకార్యం, కుటుంబ పాలన తప్ప జనాన్ని విస్మరిస్తున్నారు. కులం పేరుతోనయినా తమ కులాలలో బడుగు జీవుల బతుకుల్ని బాగు చేస్తే చాలు– దేశం అనతికాలంలో సుభిక్షమవుతుంది! 'ఓట్లు వేసినంత మాత్రాన, కబుర్లు చెప్పినంత మాత్రాన మనది ప్రజాస్వామ్యం అనిపించుకోదు'. పుట్టుక కారణంగా దుర్భేద్యమయిన గోడల మధ్య బందీలవుతున్న బాధాసర్పదష్టులు అసంఖ్యాకంగా ఉన్నంతకాలం మనది చాలా పాశవికమైన, అనాగరికమైన, అప్రజాస్వామికమైన దోపిడీ వ్యవస్థే. అసలు రాజ్యాంగబద్ధంగా జరుగుతున్న దోపిడీ అంతం కావాలి. చట్టబద్ధ చౌర్యాన్ని అరికట్టాలి. ప్రజలు ప్రభువులయ్యేలా, దళితులు సమాన పౌరులయ్యేలా, అందరు బాలలు సగర్వంగా తలెత్తుకునేలా రాజ్యవ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేయాలి. అందుకు మొదట కావలసింది మస్తిష్కాలకు పట్టిన మకిలిని శుద్ధి చేసుకోవడం.

**(అధికార రాజకీయాలలో భాగంగా పార్టీలు దళితులను రాష్ట్రపతి అభ్యర్థులుగా నిలబెడుతుంటే, రాష్ట్రపతి బాధ్యతల నిర్వహణలో ఓ దళితునికి సమాజం నుంచి ఎలా వివక్షాపూరిత స్పందనలు వచ్చాయో తెలియచేస్తూ లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఫిబ్రవరి 8, 1997న రాసిన వ్యాసమిది. జేపీ 'భవిష్యత్ భారతం' కాలమ్‌లో భాగంగా ఈనాడులో ప్రచురితమైన ఈ వ్యాసాన్ని.. తాజా రాష్ట్రపతి ఎన్నిక సమయంలో సందర్భోచితమని భావించి అందిస్తున్నాం)** ★

# రాజకీయ పార్టీల నిధుల ప్రక్షాళనే పెద్దసవాలు

**జీ**ఎస్టీ అమలులోకి రావటంతో ఊపిరి పీల్చుకున్న కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ.. రాజకీయ పార్టీల నిధుల ప్రక్షాళనే ప్రభుత్వం ముందున్న పెద్దసవాలు అని అభిప్రాయపడ్డారు. పారదర్శకత లేనందున పార్టీల నిధుల సేకరణలో అవినీతి చోటుచేసుకుంటోందన్నారు. సక్రమంగా ఆర్జించిన సొమ్మే పార్టీలకు విరాళంగా అందేలా చేసే రాజకీయ, ఎన్నికల సంస్కరణలు తేవటమే తమ తదుపరి ఎజెండా అన్నారు. ★

# కుల వివక్షను తలదన్నుతున్న 'రైతు పట్ల వివక్ష'!



పుట్టుకను బట్టే జీవితం నిర్ణయమై పోవటమంటేనే.. అది ప్రజాస్వామ్యం కాదని అర్థం. కానీ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యమని చెప్పుకునే మనదేశంలో అత్యధికుల జీవితాలు పుట్టుకను బట్టే నిర్ణయమై పోతాయి. యాదృచ్ఛికంగా ఓ కులంలో పుట్టటాన్ని బట్టి ఒక వ్యక్తి పెత్తనం చెలాయిస్తాడు, లేదా వివక్షకు గురవుతాడు, లేదా ఓటును అడ్డంపెట్టుకుని జీవచ్ఛవంలా బతుకీడుస్తుంటాడు. పుట్టుకతో/ కులంతో వివక్ష అనే అమానుషమైన, అప్రజాస్వామికమైన వివక్ష మన దేశంలో చాలా మామూలు విషయంలా చెలామణి అవుతుంది. ఆ వివక్ష పట్ల మనలో చాలామంది మోరల్ న్యూట్రాలిటీని ప్రదర్శిస్తారు. మాటల్లో కులవ్యతిరేకుల మనేవారు, కొన్ని సందర్భాల్లో చేతల్లో కులవ్యతిరేకుల మన్నట్టు ప్రవర్తించేవారు కూడా ఆచరణ దగ్గరికొచ్చేసరికి కుల చట్రాన్ని ఛేదించి సమానత్వాన్ని అంగీకరించలేరని చుట్టూ రోజూ అనేక ఉదాహరణలు కనిపిస్తుంటాయి. ఈ మోరల్ న్యూట్రాలిటీని కేవలం కులానికే కాదు, ఒక వృత్తి ప్రజానీకానికి కూడా గంపగుత్తగా వర్తింప చేస్తున్నామని భారతదేశం స్పష్టంగా గుర్తించాలి. అలాంటి అమానుష వివక్షకు గురవుతున్న ఈ వర్గం దేశ జనాభాలో అత్యధికులుగా ఉన్న రైతులు! రైతులంటే, కౌలుదారులు కూడా.

రైతులకు పంట నష్టాలు, పండినా ధర రాకపోవటాలు, పండించిన పంటను రోడ్ల మీదే పారబోయటాలు, అప్పుల కోసం బ్యాంకుల చుట్టూ, వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరగటాలు, అధికారుల వేధింపులను తాళలేక అప్పులు తీర్చలేక బలవన్మరణాలు, నిరంతర పేదరికం, దయనీయస్థితి.. ఇవన్నీ ఏటా మామూలే అనుకుంటుంటాం. అందుకే ఎప్పుడో తప్ప రైతు మరణాలు ఓ సాధారణవార్త స్థాయికి మించి మన మనసుల్లో రిజిస్టర్ అవ్వవు.

బడుగు బలహీన కులాల్లో కొందరి పేర్లను సంకేతంగా తీసుకుని వారిని దేవుళ్లుగా పూజలు చేస్తూనే, ఆ కులాల్లో పుట్టినవారిని ఎలా చిన్నచూపు చూస్తారో, అలాగే రైతులను కూడా.. రైతే రాజు, రైతే దేశానికి వెన్నెముక వంటి బిరుదులతో కీర్తిస్తూనే వెన్నుపోటు పొడుస్తూ కాళ్ల కింద తొక్కేస్తున్నారు.

మనిషి బతకటానికి కావలసిన కనీస అవసరాల్లో మొట్టమొదటిది రోటీ. ఆ తర్వాతే కపడా, మకాన్. కాబట్టే రోటీకి ఆర్థికపరంగా కూడా అత్యధిక ప్రాధాన్యత లభించాలి. ఆహారాన్ని ఉత్పత్తి చేసేవారికి మంచి ఆదాయం లభించాలి. కానీ ఆహారం పండించిన పాపానికి అందరికంటే పేదలుగా రైతులు బతుకుతున్నారు. దేశ జనాభాలో అత్యధిక శాతం ప్రజలు ఆధారపడిన రంగాన్ని ఇంత నిర్లక్ష్యం చేసిన దేశం ప్రపంచంలో వేరే ఏదైనా ఉంటే.. ఆ పాలకుల్ని అత్యంత దుర్మార్గులుగా మనం తీర్మానించేసి ఉండేవాళ్లం. కానీ మనదేశంలో వ్యవసాయాన్ని దశాబ్దాలపాటు నాశనం చేసిన పాలకులను మహానాయకులుగా, దైవసమానులుగా కీర్తిహారతులందిస్తున్నాం. చరిత్ర పుస్తకాలకెక్కిస్తున్నాం.

దేశానికి స్వతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు దాటాక 2017లో కూడా దేశ జనాభాలో అత్యధిక శాతం మంది ఆధారపడిన వ్యవసాయం చేసుకుంటున్న వారు కనీస ధర కోసం దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తుంటే.. కుల వివక్ష తరహాలోనే రైతుల పట్ల వివక్ష మామూలే అనుకుంటున్నామని అంగీకరించి, జాతి దిద్దుబాటు చేసుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. దేశ భవిష్యత్తుకు అది ఏమాత్రం క్షేమకరం కాదు.

పంట ఎక్కువ పండించినంత మాత్రాన రైతుకు లాభం రాదని, రైతుకు ఆదాయం చుట్టూ వ్యవసాయ విధానాలను రూపొందించటమే పరిష్కారమని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా।। జయప్రకాష్ నారాయణ్ కొన్నేళ్లుగా పాలకులకు, సమాజానికి ఎలుగెత్తి చాటుతున్నారు. ఆ విధానాలను డిమాండ్లుగా మలచుకోండి, ఐక్యంగా పోరాడండి అంటూ రైతులను చైతన్యపరుస్తూ వచ్చారు. 'పంట పండినా, ఎండినా రైతుకు నష్టమే.. ఇది ప్రకృతి శాపం కాదు, పాలకుల పాపమే' అనే నినాదాన్ని జనంలోకి బలంగా తీసుకెళ్లే ప్రయత్నాన్ని జేపీ పలుమార్లు చేశారు. కొందరు వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతు సంఘాల నేతలు కూడా ఇదే మాట చెబుతూ వచ్చారు. కానీ పంట ఎక్కువ పండితేనే చాలు, రైతుకు ఆదాయం పెరుగుతుందనే వాదనకే పరిమితమై సాంప్రదాయ పాలకులు, రాజకీయ

## రుణమాఫీ డబ్బును పంట ధరల రూపంలో ఇవ్వమని కోరాలి

మరోవైపు, రుణమాఫీ వల్ల తెలుగు రాష్ట్రాల్లో పలువురు రైతులకు పరపతి అస్తవ్యస్తంగా మారింది. ఎంత, ఏ ప్రాతిపదికన మాఫీ జరిగిందో చాలామంది రైతులకు అర్థంకాని రీతిలో రుణమాఫీ చేశారు. కొత్త రుణాలు అందటంలో జాప్యంతోపాటు బ్యాంకుల్లో ఉన్న అప్పులు కూడా పెరగటం రైతులను కలవరపరుస్తున్నది. నరేంద్రమోదీ ప్రభుత్వం అసమర్థంగా అమలుచేసిన నోట్ల రద్దు తర్వాత నగదు ప్రవాహం కూడా తగ్గటం రైతులకు పలు ఇబ్బందుల్ని సృష్టిస్తోంది. సమస్యల్ని పరిష్కరించాల్సిన ప్రభుత్వాల విధానాలే సమస్యగా మారటంతో రైతులు అష్టదిగ్బంధంలో చిక్కుకుపోయారు. ఈ నేపథ్యంలోనే మళ్లీ రుణమాఫీ చర్చకు వస్తోంది. ఇది పరిష్కారం కాదని తెలిసినా, నరేంద్ర మోదీ ఉత్తర ప్రదేశ్‌లో ప్లేటు ఫిరాయించారు కాబట్టి అమలు చేస్తే బాగేనని కొందరు రైతు సంఘాల నేతలు కూడా ప్లేటు పిరాయిస్తున్నారు. ఇప్పటికే ఒకసారి రుణమాఫీ అమలు చేసిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో కూడా ఈసారి రెండు లక్షల మేర రుణమాఫీ అమలు చేస్తామని ప్రతిపక్షాలు హామీ ఇస్తున్నాయి. వైకాపా నేత జగన్ నాలుగేళ్లలో ఒక్కో సన్నకారు రైతుకి రూ.50వేలు క్యాష్ డౌన్ హామీని ప్లీనరీలో ప్రకటించారు. అధికార పార్టీలు కూడా ఈ నేపథ్యంలో మరోసారి మాఫీకి లేదా అలాంటి పథకానికి హామీ ఇవ్వొచ్చు. 2019 ఎన్నికల్లో రుణమాఫీ జరగొచ్చని బ్యాంకులు కూడా అభిప్రాయానికి వచ్చేసి వ్యవసాయ పరపతి విషయంలో వీలైనంత కఠినంగా వ్యవహరిస్తున్నాయి. రుణమాఫీతో ఈ కష్టాలన్నిటినీ రైతులు ఎన్నికల సమయానికి మర్చిపోయేలా చేయగలమని పార్టీలు భావిస్తున్నాయి. కానీ ఇది రైతుల పాలిట మళ్లీ శాపంగా మారుతుందనే చెప్పాలి. కార్పొరేట్ కంపెనీలకు, కొందరు వ్యక్తులకు లక్షల కోట్ల రుణమాఫీ చేస్తున్నప్పుడు రైతులకు చేయటానికి బాధేమిటన్నది చాలామంది అలవోకగా వేసే ప్రశ్న. ఇది న్యాయమైన ప్రశ్నలా కనిపిస్తున్నా, హానికరమైన ఫలితాలనిచ్చేది. కొద్దిమంది వ్యక్తులు, కొన్ని కంపెనీలు అసమర్థతతోనో, పరిస్థితులు అనుకూలించకో, ఉద్దేశపూర్వకంగా అవకతవకలకు పాల్పడో దివాలాతీయటాన్ని దేశంలో కోట్లాదిమంది అదే పని చేయమని లైసెన్సు ఇవ్వటంతో పోల్చిచూడలేం. ఆ కొద్దిమంది అవకతవకల్ని చర్యలు తీసుకోవాల్సిన నేరంగా భావిస్తారు, అదే కోట్లాదిమందికి లైసెన్సు ఇస్తే ఇక అదే వ్యవస్థ అనుకుంటారు. ప్రభావంలో అంత తేడా ఉంటుంది. అందరూ బాకీలు ఎగ్గొట్టచ్చు అంటే ఇక వ్యవస్థ కుప్పకూలిపోతుంది. అప్పు చేయటం ఎగ్గొట్టడానికే అనే దేశం భవిష్యత్తు అగమ్యమవుతుంది. కాబట్టి రైతుకు ఆదాయం కోణంలో ఇది చాలా దుష్ప్రభావమే చూపుతుంది తప్ప వారికి మేలు చేయదని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. రైతు పండించిన పంటకు న్యాయమైన ధర అందించే అవకాశాలన్నిటినీ అమలుచేశాక కూడా భయంకర పరిస్థితి ఉంటే రుణమాఫీ తరహా ప్రత్యామ్నాయం గురించి ఆలోచించాలిగానీ, అసలు చేయాల్సినవి చేయకుండా మాఫీ అంటే అది పూర్తిగా ఓట్లు కొల్లగొట్టేందుకు రైతుల్ని మోసం చేసే రాజకీయమే అవుతుంది. రైతు హితం కోరేవారు ఇలాంటి వాటితో మోసపుచ్చకూడదు, మోసపోకూడదు. అంతగా రుణమాఫీ చేస్తామంటే.. ఆ డబ్బుతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి తాము కష్టపడి పండించిన పంటలకు మెరుగైన రేట్ల రూపంలో ఇవ్వమని రైతులు డిమాండ్ చేయాలి.

నేతలు, మీడియాలో, శాస్త్రవేత్తల్లో ఒక వర్గం రైతులను మోసం చేస్తూ వచ్చారు. వీరిలో రైతు కుటుంబాల నుంచి వచ్చినవారే అధికంగా ఉన్నారు. అయినా ఏరు దాటాక తెప్పతగలేసే ఆలోచనాతీరు, స్వార్థ ప్రయోజనాలు, ఓటు బ్యాంకు రాజకీయాలు, వివక్ష మామూలే అనుకునే మోరల్ న్యూట్రాలిటీ, మానవశాస్త్ర అభివృద్ధి పట్ల అనాసక్తత, విధానపరమైన అవగాహనారాహిత్యంతో వీరు రైతులను దెబ్బతీసే పంథాలోనే వ్యవహరించారు.

2017లో దేశవ్యాప్తంగా జరుగుతున్న రైతుల ఆందోళనలు లోక్‌సత్తా, కొందరు వ్యవసాయశాస్త్రవేత్తలు, రైతునేతల వాదాన్నే ప్రస్ఫుటంగా రుజువుచేస్తున్నాయి. పంట పండినా ఈసారి రైతులు భారీగా నష్టపోయారు. వ్యవసాయరంగం గణనీయంగా అభివృద్ధి చెందిందని చెప్పే మధ్యప్రదేశ్‌లో కూడా రైతులు రోడ్డెక్కారు. వ్యవసాయోత్పత్తుల ధరల కంటే కొన్నిరెట్లు ఎక్కువగా సాగు నిర్వహణ ఖర్చులు పెరిగిపోవటవే ఇందుకు కారణం. ప్రభుత్వం సీఏసీపీ ద్వారా అసంబద్ధంగా నిర్ణయిస్తున్న మద్దతు ధరలు కూడా ద్రవ్యోల్బణం ప్రకారం ఉన్నకొద్దీ దిగజారుతూ వస్తున్నాయి.

మధ్యప్రదేశ్ నుంచి రాజస్థాన్ వరకు, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, తెలుగు రాష్ట్రాల్లో జరిగిన రైతు ఆందోళనలు గతంలో కంటే తీవ్రమైనవి. వీటికి ఈ తీవ్రత రావటానికి ఈసారి మీడియా సహకారం లభించటం కూడా ఒక కారణం. కానీ ఇంత తీవ్రమైన చర్చ జరుగుతున్నా మోదీ బృందం ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకోకపోవటానికి కారణం ఇది పట్టణ ప్రాంత ప్రజానీకాన్ని పెద్దగా ప్రభావితం చేయకపోవటం. అవును! మీడియాలో ఇంత పెద్దఎత్తున తీవ్ర చర్చ జరుగుతున్నా, రైతులు రోడ్లెక్కినా ప్రత్యక్షంగా ఇబ్బందులు ఎదుర్కొన్న ముంబయి ప్రాంత వాసులు మినహా మిగతా గొంతున్న పట్టణ ప్రాంత వాసులెవరూ ఈ గొడవను ఇంకా సీరియస్‌గా తీసుకోలేదు. కులవివక్షలాగా రైతు వివక్ష చాలా మామూలు విషయమేనని వారు తమ రోజువారీ పనుల్లో మునిగిపోతున్నారు. మార్కెట్‌లో కూరగాయల ధరలు పెరిగినప్పుడు మెడలో

## మద్దతు ధరల పట్ల 79శాతం మందిలో అసంతృప్తి

తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువమంది రైతులు తమ అవసరాల రీత్యా మద్దతు ధరకన్నా తక్కువ ధరకు ఉత్పత్తులను విక్రయించేస్తున్నారు. వేచి చూడగల అవకాశం ఉన్నవారిలో కూడా పలువురు కనీస మద్దతు ధరకే సరకును అమ్ముకుంటున్నారు తప్ప న్యాయమైన ధర పొందే సందర్భాలు తక్కువ. లాభాలార్జించటం యాధృచ్ఛికంగా అరుదుగానే జరుగుతుంటుంది. మద్దతు ధరల పట్ల అవగాహన ఉన్నవారిలో 79శాతం మంది అసంతృప్తితో ఉన్నారు. అయితే వ్యాపారుల దోపిడీని అరికట్టటానికి (ప్రభుత్వ అసమర్థత వల్ల) మద్దతు ధర విధానాన్ని కొనసాగించాలని కోరారు. తూకాలు సరిగా ఉంటాయి, గ్రేడింగ్ నిజాయతీగా చేస్తారనే ఉద్దేశంతో చాలామంది రైతులు ప్రభుత్వ వ్యవస్థలకు అమ్ముకోవడానికి మొగ్గు చూపుతున్నారని నీతి ఆయోగ్ పరిశీలనలో తేలింది.

ఏపీ, తెలంగాణలో పంట ఉత్పత్తులు అమ్ముకున్న రోజే ప్రతిఫలం అందుకుంటున్న రైతులు 13శాతం మాత్రమే ఉన్నారని కూడా ఈ పరిశీలనలో వెల్లడైంది. సుమారు 77శాతం మంది రైతులకు సరకు అమ్మిన తర్వాత వారం నుంచి నెలరోజుల మధ్యలో పైసలు చేతుల్లో పడుతున్నాయి. రైతులకు తక్షణం డబ్బు చెల్లించే రాష్ట్రాల జాబితాలో కర్ణాటక, ఒడిషా ముందున్నాయి. బీహార్, గుజరాత్, మధ్యప్రదేశ్‌లలో చెల్లింపుల పరిస్థితి తెలుగు రాష్ట్రాల్లో కంటే అధ్వాన్నంగా ఉందని నీతి ఆయోగ్ తెలిపింది. దేశవ్యాప్తంగా ప్రభుత్వ వ్యవస్థలు కేవలం 4శాతం మంది రైతులకు సేవలందించగలుగుతున్నాయని కూడా ఈ పరిశీలనలో తేలింది.

కూరగాయల దండలు వేసుకుని వచ్చే నేతలు, తెగ కవరేజీ ఇచ్చే మీడియా.. రేటు పడిపోయినప్పుడు రైతుల గురించి ఎందుకు మాట్లాడటం లేదని అసెంబ్లీలో జేపీ పలుమార్లు ప్రశ్నించారు. బహుశా తెలుగు రాష్ట్రాల్లో నేతల మెడలో కూరగాయల దండల సంస్కృతికి ఆ దెబ్బతోనే తెరపడింది. అప్పటితో పోలిస్తే మీడియా రైతు సమస్యలపై స్పందనను పెంచినప్పటికీ, సమస్యను సహేతుంగా వివరించి స్పష్టమైన పరిష్కారాలతో ప్రభావశీలమైన పట్టణ ప్రాంత వర్గాలనూ ఆమోదింపచేసేలా కథనాలను ప్రచురించటం ఇంకా ఉండాల్సిన స్థాయిలో లేదు. కుల వివక్షపై తరహాలోనే.. మానవీయ కథనాలు, దార్శనికత లేని సెంటిమెంటల్ కవితా గానాలను దాటి నిర్దిష్ట ఆచరణాత్మక పరిష్కారాలను ఆకట్టుకునేలా, అవగాహన పెంచేలా అందించటం లేదు. అందుకే.. ఇంత సంక్షోభమున్నా పాలకులు ఇంకా సీరియస్‌గా స్పందించటం లేదు. ఓట్ల పండగ సమయానికి అమాయక రైతుల్ని మచ్చిక చేసుకోగలమన్న దిలాసాను ప్రదర్శిస్తూ సత్యాగ్రహ, ఎక్స్‌గ్రేషియా, తాయిలాల, ఉచిత స్కీముల డ్రామాలనే ఇంకా చిద్విలాసంగా వల్లెవేస్తున్నారు.

**శ్రీమహావిష్ణువు తరహా డ్రామాలు ఇక చెల్లవని చెప్పాలి**

సాగు విధానాలకు 'రైతుకు ఆదాయం' కేంద్ర బిందువు అయితేనే వ్యవసాయానికి న్యాయం జరుగుతుంది. ఏ తిండి లేకపోతే మనం బతకలేమో, ఆ తిండిని పండించేవారికి న్యాయమైన ధర అందాలనే స్పృహను విధిగా ప్రతి ఒక్కరిలో కలిగించాలి. ఆహార సబ్సిడీలను, ఉచిత భోజనాలను ఎవరి సొమ్ముతో ఎవరిస్తున్నారో ప్రజలకు అర్థమవ్వాలి. ఈ రాయితీల భారాన్ని ప్రభుత్వంకన్నా రైతులే ఎక్కువ మోస్తున్నారనేది అనేది ప్రతి ఒక్కరూ గుర్తించేలా చేయాలి. శ్రీమహావిష్ణువు ఎటు తిరిగి శయనించినా లక్ష్మీదేవి తన పాదాల వద్దే ఉండేలాగా చేసినట్టు.. రైతు సాగు ఖర్చు రూ.80 అయితే రూ.60 ఇస్తాం, రూ.60 అయితే 40 ఇస్తాం అనే ధోరణులు ఇక మీద చెల్లవని తేల్చి చెప్పాలి.

**తెలుగు రాష్ట్రాలు – ఒక సీజన్ – ఒక పంట**

రైతుకు ఆదాయం చుట్టూ పరిష్కారాలకు ప్రభుత్వాల తీరు మారటం ఎంత అవసరమో ఈ ఏడాది తెలుగు రాష్ట్రాల్లో ఒక సీజన్‌లో, ఒక పంట పరిణామాల నేపథ్యం నుంచే చూద్దాం.

తాజా రబీ సీజన్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ధాన్యం ఉత్పత్తి, అమ్మకాలపై ప్రభుత్వ నేతలు, ఉన్నతాధికారులు, రాజకీయవర్గాలు సహా ఎక్కువమంది చదివే ఓ దినపత్రికలోనే ఒక రిపోర్టు వచ్చింది. అందులో ఒక రైస్ మిల్లర్ ఇలా చెప్పారు.. "వర్షాభావం, నీటికొరత వల్ల ఈ ఏడాది (రబీలో) ఆంధ్రప్రదేశ్‌లో ధాన్యం దిగుబడి తక్కువగా ఉంది. దీంతో మేం తెలంగాణ నుంచి కొంటున్నాం. తెలంగాణలో క్వింటాల్ ధాన్యం రూ.800–900కు దొరుకుతుండగా, ఏపీలో ఆ ధర రూ. 1800–2500దాకా ఉంది".

ఈ రైస్ మిల్లర్ మాటల్ని గణాంకాల పరంగా కచ్చితంగా కాకపోయినా స్థూలంగా అంగీకరించ వచ్చు. తెలంగాణలో సప్లయ్ ఉంది, ఏపీలో డిమాండ్ ఉంది. ఆ మాటకొస్తే, దశాబ్దాల లోనే పెద్ద కరవు వచ్చిన తమిళనాడు, కేరళల్లో కూడా బియ్యానికి భారీ డిమాండ్ ఉంది. అయితే ఈ ఏడాది తెలంగాణలో ధాన్యం రైతుకు వచ్చిన రేటెంత?

తెలంగాణలో ఈ రబీ సీజన్‌లో రికార్డుస్థాయిలో ధాన్యం ఉత్పత్తి జరిగింది. ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యమే అధికారిక సమాచారం ప్రకారం ఉజ్జాయింపుగా 40లక్షల టన్నులు ఉంది. ఇది కూడా ఓ రికార్డే. 1,044 మిల్లీమీటర్ల వర్షపాతంతోపాటు మిషన్ కాకతీయ వంటి ఏర్పాట్ల వల్ల గతేడాది కంటే సుమారు 3లక్షల హెకార్లు అదనంగా, 8.65లక్షల హెక్టార్లలో ఈ ఏడాది ధాన్యం పండించటం వల్ల ఇది సాధ్యమయింది.. పంట బాగా పండింది, డిమాండ్ భారీగా ఉంది, కానీ ప్రభుత్వ కేంద్రాల్లో అమ్మినవారికి మద్దతు ధర మాత్రమే లభించింది. కామన్ వెరైటీకి క్వింటాలుకు రూ.1470, 'ఏ' గ్రేడ్ రకానికి రూ.1510 ధర మాత్రమే రైతులకు చెల్లించారు. ఇలా ప్రభుత్వం చెల్లించిన సొమ్ము రూ.6,000కోట్ల మేర ఉంటుంది. మిగిలిన లక్షల టన్నుల (ఈ లెక్క స్పష్టంగా అందుబాటులోకి రాలేదు) ధాన్యంలో

కొంత నిల్వ చేసుకున్నా ఎక్కువభాగం ధాన్యాన్ని రైతులు మధ్యవర్తులకు తక్కువ ధరకే అమ్ముకుని ఉంటారు (లేకుంటే, క్వింటాలు రూ.800–900కు మిల్లర్లకు ఎలా లభించింది?).. దళారీలు కొనుగోలు చేసిన మిగిలిన ధాన్యం దాకా కూడా పోకుండా ప్రభుత్వం కొనుగోలు చేసిన 40లక్షల టన్నులకే పరిమితమై ప్రస్తుతం చర్చిద్దాం.

పక్క రాష్ట్రాల్లో క్వింటాలుకు రూ.1800–2500 దాకా డిమాండ్ ఉందన్న అంచనాల ప్రకారం, కనీసం సర్కారీ కొనుగోళ్లలో రైతుకు క్వింటాలుకు రూ.300–500 అదనంగా లభించి ఉండాలి. ప్రభుత్వం ఏమాత్రం ప్రయత్నం చేసినా ఇది పూర్తిగా సాధ్యం. కానీ ఆ ప్రయత్నం ఎక్కడా కనిపించదు. అసంబద్ధమైన మినిమం సపోర్ట్ ప్రైస్ (కనీస మద్దతు ధర)నే మాగ్జిమమ్ సెల్లింగ్ ప్రైస్ (గరిష్ట అమ్మకం ధర)గా చేసేశారు. పౌరసరఫరాల శాఖలో ఒక సత్తాగల అధికార కృషి వల్ల అంతకుముందు ఏడాదికన్నా దాదాపు ఏడు రెట్లు ఎక్కువ ధాన్యాన్ని సేకరించగలిగారుగానీ, ధాన్యాన్ని పండించిన రైతుకు మాత్రం ధర ఇచ్చే అవకాశాల్ని మాత్రం సద్వినియోగం చేయలేకపోయారు.

2010–12లో లోక్‌సత్తా చేసిన ప్రయత్నం గురించి ఇక్కడ ప్రస్తావించాలి. ఇతర దేశాల నుంచి దిగుమతుల్ని మనదేశంలోకి అనుమతిస్తూ, మనదేశంలోని వ్యవసాయోత్పత్తులను ఇతర దేశాలకు ఎగుమతి చేయటం వల్ల మన రైతులే ఎక్కువ లాభపడతారంటూ 1990లలో ఆర్థిక మంత్రిగా డా॥ మన్మోహన్‌సింగ్, వాణిజ్యమంత్రిగా ప్రణబ్ ముఖర్జీ పార్లమెంటులో చెప్పారు. కానీ అదే మన్మోహన్ ప్రధాని అయ్యాక కూడా ఇతర దేశాల్లో డిమాండ్ ఉన్న మన వ్యవసాయోత్పత్తుల ఎగుమతులకు అనుమతి ఇవ్వలేదు. పైగా మనదేశంలో డిమాండ్ ఉన్న పప్పుధాన్యాలు, వంటనూనెల ఉత్పత్తుల్ని స్వదేశంలో పెంచేందుకు ప్రయత్నించకుండా.. దిగుమతి చేసుకోవటానికి మాత్రం



ఎటువంటి దిగుమతి సుంకమూ విధించకుండా అనుమతి ఇచ్చారు. 1990లలో పార్లమెంటుకు చెప్పిన దానికి పూర్తి విరుద్ధంగా వ్యవహరించి మన్మోహన్, ప్రణబ్ మనదేశ రైతులను దెబ్బతీశారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా గానే, జేపీ 2010లో రైతు ఆదాయ ఉద్యమాన్ని ప్రారంభించారు. ఆహారధాన్యాల ఉత్పత్తులు కుళ్లిపోతున్నా, ఆదాయం లేక రైతులు అల్లాడుతున్నా, విదేశాల్లో మన ఉత్పత్తులకు డిమాండ్ ఉన్నా ఎందుకు ఎగుమతుల్ని అనుమతించటం లేదు? అని పార్టీలకతీతంగా రైతుల్ని, రైతు సంఘాల్ని, వామపక్షాలు సహా విపక్ష నేతల్ని, చివరికి మిల్లర్లను కూడా కూడదీసి, యూపీయే ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దేశ ఆహారభద్రత పరిధిలో ఆహారధాన్యాల ఎగుమతులకు ప్రభుత్వాన్ని చివరకు ఒప్పించారు. ఆంక్షలను తొలగింపచేశారు. ఆ తర్వాత తెలుగు రాష్ట్రాల్లో (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్)లో పక్క జిల్లాలకు కూడా ఎగుమతులు అనుమతించని దుర్మార్గపు పాలనకు వ్యతిరేకంగా 2012లో రైతు సత్యాగ్రహ యాత్రను చేపట్టారు. తెలుగు రాష్ట్రాల నుంచి కర్ణాటక, మహారాష్ట్రకు ధాన్యాన్ని తీసుకెళ్లి అమ్మారు. ఆంక్షల పేరుతో చెక్‌పోస్టుల వద్ద కోట్ల రూపాయల లంచాలు మింగుతూ రాజకీయ నేతలు–అధికారులు రైతుల ఆదాయానికి ఎలా గండికొడుతున్నారో బైటపెట్టారు. వాస్తవాలు, రాజ్యాంగస్ఫూర్తి తనకు వ్యతిరేకంగా ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం కిమ్మనలేదు. రైతు సత్యాగ్రహ యాత్ర వల్ల పొరుగు రాష్ట్రాలకు ధాన్యం స్వేచ్ఛగా తరలటం వల్ల ఆ సీజన్‌లో బీపీటీ రైతులకు 75 కేజీల బస్తాకే తక్కువలో తక్కువగా రూ.400–500అదనపు ఆదాయం వచ్చింది. రైతులు నిల్వ చేసుకున్న పాత ధాన్యానికీ గిరాకీ పెరిగి మంచి ధర వచ్చింది. డిమాండ్–సప్లయ్, స్వేచ్ఛా వాణిజ్యం సూత్రాలుగానే జేపీ ఈ విజయం సాధించారు. మరి డిమాండ్, సప్లయ్ ఉన్నా తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాది రబీ ధాన్యానికి మద్దతు ధర మించి ఎందుకు రూపాయి ఇవ్వలేకపోయింది? చాలామంది రైతులు ధరల పట్ల అనిశ్చితితో కళ్లాల్లోనే తక్కువ ధరకు అమ్ముకున్నారు. తక్కువలో తక్కువగా 40లక్షల టన్నుల ధాన్యానికి క్వింటాలుకు రూ.300–500 అదనంగా వేసుకున్నా, రైతులకు అదనంగా రూ.1500–2,000కోట్లు వచ్చేవి. మిగిలిన ధాన్యానికీ అలాంటి భరోసా ఇవ్వగలిగి ఉంటే, రైతులకు ఆర్థిక ప్రయోజనం మరింత పెరిగేది.

మరోవైపు, 629 మిల్లీమీటర్ల వర్షపాతం, నీటి ఇబ్బందుల మధ్య కూడా ధాన్యం పండించిన ఆంధ్రప్రదేశ్ రైతులకు లాభాలు వచ్చాయనుకుంటే పొరపాటే. గత ఏడాది కంటే ఈసారి అక్కడ రబీ సాగు మూడులక్షల ఎకరాలు తగ్గి 5.67 లక్షల విస్తీర్ణానికే పరిమితమైంది. సుమారు 39లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అయినట్టు అంచనా. ధాన్యంకు బయట డిమాండ్ ఉన్నా నాసిరకం, మట్టిపెళ్లలు, పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్) వంటి

## 2017-18లోనూ గిట్టుబాటు అందని ద్రాక్షే, కొన్నిటికి 'మద్దతూ' కష్టమే

2017-18 ఖరీఫ్‌లోనూ రైతులకు గిట్టుబాటు ధర అందని ద్రాక్ష చందమేనని, అపరాలు, పొద్దుతిరుగుడు వంటి కొన్ని పంటలకైతే మద్దతు ధరకూ అందే అవకాశాలు తక్కువని శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలోని మార్కెటింగ్ ఇంటెలిజెన్స్ విభాగం విశ్లేషించింది. పత్తికి మద్దతు ధర మాత్రం దక్కే అవకాశమున్నా విస్తీర్ణం పెరగటం దెబ్బతీయవచ్చని, పసుపు, మిర్చి విషయంలో భారీ పెట్టుబడులు పెట్టే ముందు రైతులు ఆలోచించుకోవాలని సూచించింది. 2009 నుంచి ఎస్వీ వ్యవసాయ కళాశాల ఏటా మూడు దఫాలుగా విడుదల చేస్తున్న వ్యవసాయోత్పత్తుల ధరల అంచనాలు 85 శాతం నుంచి 90శాతం దాకా కచ్చితత్వంతో ఉంటాయని నిపుణుల అభిప్రాయం.

సాకులతో వ్యాపారస్తులు తక్కువ రేటుకు అడుగుతుండటంతో దాదాపు 17లక్షల టన్నుల ధాన్యాన్ని రైతులు కేవలం మద్దతు ధరకే ప్రభుత్వ కేంద్రాల వద్ద అమ్ముకున్నారు. కొద్దిమందికి మాత్రమే డిమాండ్‌కు తగ్గ ప్రతిఫలం వచ్చిందని లోక్‌సత్తా వర్గాల సమాచారం, మీడియా వార్తలు సూచిస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో మిర్చి రైతులు ఈ ఒక్క సీజన్‌లోనే రూ.5000కోట్లు నష్టపోయినట్టు అంచనా. రైతులకు ఉచితంగా ఎరువుల కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం వల్ల ఏటా రూ.5,000-6,000కోట్లు ఖర్చవుతుందని అంచనా.. ఒక్క సీజన్‌లో, ఒక్క పంటకే వేలకోట్లు రైతులకు వచ్చే ఆదాయాన్ని నష్టపరుస్తూ ఎన్ని ఉచితాలు ఇచ్చి ఏం లాభం? రైతు సంక్షోభం యధాతథంగా కొనసాగుతూనే ఉంటుంది.

**అమెరికాలోలా మనకు సాధ్యం కాదు, మార్కెట్ చుట్టూ ఆదాయం మనకు సరైన పరిష్కారం**

రైతుల జనాభా, వారు ఉత్పత్తి చేసే పంటలకు డిమాండ్‌కు తగ్గ ధర వచ్చేలా చేయడం, దేశ ఆహారభద్రత.. ఈ మూడింటినీ పరిగణలోకి తీసుకుంటూ ప్రభుత్వం వాస్తవాల ఆధారంగా 'రైతుకు ఆదాయం' చుట్టూ హేతుబద్ధ వ్యవసాయ విధానాన్ని రూపొందిస్తేనే రైతు సంక్షోభానికి సమగ్ర పరిష్కారం లభిస్తుంది.

స్వామినాథన్ కమిషన్ చెప్పినట్లు సాగు వ్యయానికి అదనంగా 50శాతం కలిపి మద్దతు ధర ఇచ్చినా లేక అంతకంటే ఎక్కువ ధర రైతులకు ఇస్తే సంతోషమే (ఇలా ఇస్తామని ఎన్నికల సమయంలో చెప్పే నరేంద్ర మోదీ ఎన్నికల్లో రైతుల ఓట్లు కొల్లగొట్టారు. కానీ గెలిచాక ఏరు దాటాక తెప్ప తగలేసినట్టు వ్యవహరిస్తున్నారు). అమెరికా వంటి దేశాల్లో మార్కెట్‌తో సంబంధం లేకుండా ఇలా రైతులకు భారీగా రాయితీలిస్తుంటారు. కానీ అమెరికా తదితర అభివృద్ధి చెందిన దేశాలలో వ్యవసాయం మీద ప్రత్యక్షంగా ఆధారపడినవారి సంఖ్య బాగా తక్కువ అని మనం గుర్తించాలి. మిగతావారి ఆదాయం ఎక్కువ కాబట్టి రైతులకు ఎంతయినా సబ్సిడీ ఇచ్చి తమ ఆహారభద్రతను పొందగలుగుతున్నారు. కానీ మనదేశంలో పరిస్థితి అందుకు భిన్నం. జనాభాలో 50-60శాతం వ్యవసాయం మీద ఆధారపడి ఉంటే, మిగిలినవారు వారికి అన్నిరకాలుగా సబ్సిడీలతో భరించాలంటే జరిగే పనికాదు. అయ్యవార్ని చేయబోతే ఏదో అయిన చందంగా దేశ ఆర్థిక పరిస్థితి తయారవుతుంది. అందుకే రైతుకు "కొన్ని రాయితీలు, రక్షణలతో మార్కెట్ ఆదాయం చుట్టూ వ్యవసాయ విధానాన్ని రూపొందించుకోవటం'' మనదేశంలో కీలకమని గుర్తించాలి. ఈ మాటను తొలినుంచీ లోక్‌సత్తా చెబుతోంది. భారీ మద్దతు ధర హామీలు, రుణమాఫీలు వంటివి తాయిలాలు నమ్మి మోసపోవద్దని ఎన్నికల సమయంలోనూ హెచ్చరించింది. ప్రభుత్వ సొమ్మును తమ సొంత సొమ్ము, ప్రజలు తమ కుటుంబసభ్యులు అనుకుని ఉంటే.. పాలకులు వ్యవసాయం పట్ల కచ్చితంగా లోక్‌సత్తా చెప్పిన 'రైతుకు మార్కెట్ అనుసంధాన ఆదాయం' విధానాన్నే అనుసరించి ఉండేవారు. దీన్ని పట్టించుకోలేదు కాబట్టే తెలుగు రాష్ట్రాల్లో ధాన్యం రైతులు ఈ ఏడాది రబీ సీజన్‌లోనే కోట్లాది రూపాయలు నష్టపోయారు. పంట పండినా కూడా నిల్వ సదుపాయాలు, స్వేచ్ఛా మార్కెట్ లేకపోవటం వల్ల మధ్యప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్రలలో రైతులు భారీగా దెబ్బతిన్నారు.

రైతుకు ఆదాయాన్ని పెంచే క్రమంలో.. పర్యావరణహితంగా తక్కువ వ్యయంతో ఎక్కువ ఉత్పాదకతకు, భూసారాన్ని పెంచేందుకు, బయో ఇంధనాలు సహా వంట నిర్ణయం, నిర్వహణ పద్ధతులపై సాంకేతిక సాయానికి, వంట వండాక నిల్వ, ప్రాసెసింగ్ సదుపాయాలు, రవాణా మౌలిక వసతులకు, ప్లెడ్జి రుణాలకు, మార్కెట్ యార్డులను ప్రక్షాళన చేసి రైతుల ఆధ్వర్యంలోకి తేవటానికి, డిమాండ్ ఉన్న చోట అమ్ముకునేందుకు ఎగుమతి ప్రోత్సాహకాలతో స్వేచ్ఛామార్కెట్లకు ప్రభుత్వాలు పక్కా చర్యలు తీసుకోవటం అవసరం.

**భారంపడకుండా కొన్ని రాయితీలు, రక్షణలు ఇక్కడా ఇవ్వాల్సిందే**

ఉపాధి కల్పిస్తున్నందుకు కంపెనీలకు రెడ్‌కార్పెట్ ఆహ్వానంతో బోలెడు రాయితీలిస్తారు. వ్యవసాయం చుట్టూ బోలెడు మంది ఉపాధి పొందుతున్నారు, పైగా ఆహారభద్రత లేకుంటే దేశ మనుగడ కష్టం. కాబట్టి, ఆటుపోట్లను తట్టుకుని రైతు నిలబడి సుస్థిరంగా ఆహారోత్పత్తి చేయడానికి స్వేచ్ఛామార్కెట్‌లోనూ కొన్ని రాయితీలు, రక్షణలు కల్పించాలి. సహకార పరపతి వ్యవస్థతో రుణ సదుపాయం వంటి వాటితో పెట్టుబడి దగ్గర్నుంచీ.. ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు, వ్యవసాయ కమిటీల్లో రాజకీయ జోక్యం తొలగించటం తదితరాలతో మార్కెట్ వరకూ ఉండాలి. సామాజిక భద్రతా పథకాల ద్వారా రైతులకు వృద్ధాప్యంలో కూడా లబ్ధి

చేకూర్చేలా వీలైనంత సాయం అందించాలి. ఇతర ప్రజానీకం మీద భారం లేకుండా ఈ సాయాల్ని ఆచరణాత్మకంగా నిర్ణయించాలి. అలాగే రైతులకు ఖర్చులు పెరగటానికి విద్య, ఆరోగ్య సేవలు, ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు పెద్ద కారణాలుగా ఉన్నాయి. రైతు కుటుంబాలకు విద్య, ఆరోగ్యం ఉచితంగా అందిస్తూ ప్రభుత్వ కార్యాలయాలలో రైతుల సేవలకు లంచాలు అడగకుండా ఉండేందుకు 'పౌర సేవల' చట్టం వంటి ఏర్పాట్లు ఉంటే.. దేశ ఖజానా మీద పెద్ద భారం పడకుండానే రైతులకు ఆర్థిక సత్తాని అందించవచ్చు. ఇంతకుముందు చెప్పుకున్నట్టు.. రైతుల పిల్లలు చిన్న పట్టణాల్లో, వ్యవసాయనుబంధ పరిశ్రమల్లో తేలిగ్గా ఉపాధి పొందగలుగుతారు. ఇలా రైతులకు స్థిరమైన ఆదాయం కనిపిస్తుంటే, అప్పుడు కొంత పన్ను వారి మీద విధించొచ్చు. వారూ స్వచ్ఛందంగా చెల్లిస్తారు, ప్రభుత్వం ఇచ్చే రాయితీలు కూడా క్రమంగా తగ్గుతాయి.

అలాగే ఆకర్షణీయ నగరాల పేరుతో ప్రాజెక్టులకన్నా కూడా ముందు గ్రామాల చుట్టూ చిన్న పట్టణాలను అభివృద్ధి చేయాలి. గ్రామాల క్లస్టర్లుగా చిన్న పట్టణాలను ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేసి, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు ఏర్పాటుచేయాలి. వ్యవసాయ రాయితీల్లో భాగంగా రైతుల పిల్లలకు నాణ్యమైన ఉచిత విద్య, నైపుణ్యాలను అందించి ఈ పరిశ్రమల్లో ప్రాధాన్యత కల్పించాలి. ముడి ఆహారోత్పత్తుల మీద ప్రత్యక్షంగా ఆధారపడే వారి సంఖ్యను క్రమంగా తగ్గించాలి. వ్యవసాయాన్ని పరిశ్రమలు, సేవారంగానికి అనుసంధానం చేయాలి. వ్యవసాయాన్ని వ్యాపారంలా మార్చాలి. అప్పుడు న్యాయమైన ఆదాయంతో రైతులకు భరోసా లభిస్తుంది. తలెత్తుకుని బతకగలుగుతారు. రైతు బిడ్డలకు గౌరవప్రదమైన ఉపాధి దొరుకుతుంది. బాగా నైపుణ్యముంది అనుకున్నవారు ఊరు దాటి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూడా సేవలందించగలుగుతారు.

ఎకరాకి రూ.47,000 విద్యుత్తు బిల్లు.. సాగు ప్రాజెక్టుల ప్రయోజనాన్ని చివరికి కంపెనీలపరం చేస్తారా?

రానున్న కాలంలో ఉపాధి అవకాశాలు పెద్ద సవాలని, వ్యవసాయాన్ని నమ్ముకుంటేనే బండి నడుస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు సరిగ్గానే గుర్తించారు. కానీ ఆయన చెబుతున్నట్టు రొటీన్ రైతు సమాఖ్యలు/వేదికలను ఏర్పాటు, వ్యవసాయ బడ్జెట్‌తోనో, ఎడాపెడా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంతోనో రైతుల మనుగడ సాధ్యం కాదు. లక్షల ఎకరాల సాగు లక్ష్యంగా నిర్మిస్తున్న కాళేశ్వరం ఎత్తిపోతల కింద ఆయకట్టుకు ఎకరాకి ఏటా విద్యుత్తు బిల్లే ప్రస్తుత లెక్క ప్రకారం నగటున రూ.47,000 దాకా అవుతుంది (మల్లన్నసాగర్, కొండపోచమ్మ బ్యారేజీల కింద రూ.ఎకరాకి రూ.80,000 దాకా). విద్యుత్ టారిఫ్‌లు ముమ్ముందు సగానికి సగం తగ్గుతాయని ప్రభుత్వం డీపీఆర్‌లో లెక్కేసినా, ఆ వ్యయం తక్కువేమీ కాదు. దానికితోడు భారీ మెషినరీ నిర్వహణ ఖర్చు. మీ సొంత సొమ్మయితే ఇలాగే చేస్తారా? ఇలా పరిధి దాటి ఉచితాలిస్తే తెలంగాణ మనుగడ సాధ్యం కాదు. కాబట్టి.. దిగుబడిని మించిన వ్యయంతో అసంబద్ధ సాగునీటి ప్రాజెక్టులను చేపట్టి చివరకు లాభసాటికాలేదనే నెపంతో, వ్యవసాయాన్ని కాంట్రాక్టు ఫార్మింగ్ పేరుతో లక్షల కోట్ల రూపాయల జనం సొమ్ముతో సాగువసతి కల్పించిన భూములను ప్రైవేటు కంపెనీలకు అప్పగించి, అక్కడే రైతులు కూలీలుగా పనిచేసే పరిస్థితి తీసుకురాకుండా.. హేతుబద్ధంగా ప్రాజెక్టులను చేపట్టాలి. కాంట్రాక్ట్ ఫార్మింగ్ వద్దు అనక్కర్లేదుగానీ, బేరసారాల్లో రైతుల ప్రయోజనాలను పరిరక్షించే పరిస్థితుల్ని ప్రభుత్వం నెలకొల్పాలి. ప్రభుత్వ తీరు, వ్యవసాయ విధానాలు ఈ దిశగా లేవు. మార్కెటింగ్ కమిటీలను జవాబుదారీ తనంతో రైతుల చేతుల్లో పెట్టి.. కనీసం రూ.10,000కోట్లతో తెలంగాణలో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి ఉంటే, చాలామంది రైతులకు భరోసా లభించివుండేది.

హేతుబద్ధ ప్రాజెక్టులు, రైతుకు ఆదాయం చుట్టూ స్వేచ్ఛామార్కెట్ అనుసంధానం సహా పైన పేర్కొన్న చర్యలతో.. వ్యవసాయాన్ని వ్యాపారంలా చేసే (పంటల ఎంపిక సహా) విధానాల్ని అమలుచేస్తేనే వ్యవసాయ పరిరక్షణ లక్ష్యం నెరవేరుతుంది.

రైతుల ప్రయోజనాలను మాటల్లోనే కాకుండా చేతల్లోనూ పరిరక్షించింది లోక్‌సత్తా. 2011లో కేంద్రప్రభుత్వం ఆహారధాన్యాల మార్కెట్‌పై ఆంక్షలను ఎత్తివేయటం వల్ల కొద్దికాలంలోనే ఎగుమతులు 2కోట్ల టన్నులకు చేరాయి. సుమారు 39 బిలియన్ డాలర్ల విదేశీ మారక ద్రవ్యాన్ని భారత్ ఆర్జించింది. ఇలా వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాల ద్వారా 100 బిలియన్ డాలర్లను సంపాదించుకోగల సత్తా భారత్‌కి ఉంది. దేశ ప్రయోజనాలు, భవిష్యత్తు దృష్ట్యా కొన్ని మౌలికాంశాల మీద అన్ని పార్టీలకూ, పౌరసమాజ సంస్థలకూ, సమాజంలోని వివిధ వర్గాలకు ఒకే అభిప్రాయం, విధానం ఉండాలని లోక్‌సత్తా తరచూ చెబుతూ అందుకు ప్రయత్నిస్తుంటుంది. అందులో వ్యవసాయ విధానం ఒకటి. రైతుకు ఆదాయం చుట్టూ లోక్‌సత్తా ప్రతిపాదించిన వ్యవసాయ విధానాలను http://www.fdrindia.org/agriculture/లో చదవవచ్చు. వీటిని పరిగణలోకి తీసుకుంటూ వ్యవసాయ సమస్యలకు పరిష్కారాలపై దేశవ్యాప్తంగా చిత్తశుద్ధితో ఇప్పటికైనా చర్చ జరగాలి. తాజా పరిస్థితులకనుగుణంగా శాశ్వత పరిష్కారాలుగా ఉండే వ్యవసాయ విధానాలను మోదీ ప్రభుత్వానికి కూడా అందించేందుకు పార్టీలు, రైతు సంఘాల నేతలు, ప్రజాప్రతినిధులు, శాస్త్రవేత్తలు, పౌరసమాజంతో కలిసి జేపీ కసరత్తు చేస్తున్నారు. ఏ కులమైనా, ఏ పార్టీ అయినా రైతులంతా ఐక్యంగా ఉండి పోరాడితే ఈ పరిష్కారాలను వేగంగా సాధించుకోగలం. ★

# రూ.1,50,000 కోట్లు - 3,82,512 ఎకరాలు

తెలంగాణలో నిర్మాణంలో ఉన్న, గత ఏడాది ప్రారంభించిన సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయడానికి రూ.లక్షా యాభై వేల కోట్లు అవసరమవుతాయి. ఇది కూడా ప్రస్తుత అంచనాల ప్రకారమే.

నిర్మాణంలో ఉన్న, ఇటీవల పనులు ప్రారంభించిన ప్రాజెక్టుల అంచనా వ్యయం, 2016 డిసెంబర్ వరకు చేసిన ఖర్చు, రీడిజైన్, భూసేకరణ, పునరావాసం ఇలా అన్ని అంశాలతో కూడిన నివేదికను నీటిపారుదలశాఖ ఇటీవల ప్రభుత్వానికి సమర్పించింది. కొత్త భూసేకరణ చట్టం, ఇతరత్రా కారణాల వల్ల ఈ అంచనాల్లో ఇప్పటికే కొన్ని మార్పులు జరిగినప్పటికీ, తెలంగాణ సాగునీటి స్థితిగతులపై స్థూలంగా ఇది శాస్త్రీయ నివేదిక.

మంత్రివర్గం ఆమోదించిన ఈ నివేదిక ప్రకారం.. భారీ, మధ్యతరహా ప్రాజెక్టులు, ఆధునికీకరణ పథకాలకు రూ.1.41లక్షల కోట్లతో పరిపాలనా అనుమతులు ఇచ్చారు. ఈ ప్రాజెక్టుల కింద 2016 డిసెంబర్ వరకు రూ.54,234కోట్లు వ్యయం చేశారు. పరిపాలనా అనుమతుల్లో కాళేశ్వరం ఎత్తిపోతల అంచనా రూ.38,500 కోట్లుగా పేర్కొన్నారు. ఇది ప్రాణహిత–చేవెళ్ల అంచనా. దీనిని రీడిజైన్ చేసి కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం చేపట్టింది. ఈ పథకం అంచనా రూ.80,500కోట్లుగా కన్సల్టెన్సీ సంస్థ వాప్కోస్ సమగ్ర ప్రాజెక్టు నివేదిక ఇచ్చింది. పనుల వారీగా ప్రభుత్వం ఆమోదం తెలిపి టెండర్ ప్రక్రియ చేపడుతుంది. పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సుమారు 50వేల కోట్లతో సవరించిన అంచనాలు సంబంధిత ఇంజినీర్లు, నీటిపారుదల శాఖ అధికారుల వద్ద ఉన్నాయి. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకుంటే రూ.లక్షన్నర కోట్లు ఖర్చవుతుంది. అదనంగా మరికొన్ని పథకాలకు ప్రతిపాదనలు వస్తున్నాయి. జలయజ్ఞంలో 2004లో చేపట్టిన ప్రాజెక్టుల నుంచి ఇటీవల పునరాకృతి చేసిన ప్రాజెక్టులు కూడా ఈ నివేదికలో ఉన్నాయి.

**నివేదికలోని ఇతర అంశాలు :**

- ఆరు ప్రాజెక్టులు పూర్తయ్యాయి. వీటి అంచనా రూ.851.80కోట్లు కాగా, రూ.812కోట్లు ఖర్చు చేశారు.
- 15 ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. వీటి అంచనా రూ.46,351కోట్లు కాగా, రూ.32,987కోట్లు ఖర్చయ్యాయి. ఎక్కువభాగం పనులు పూర్తయిన భీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి, దేవాదుల, ఎల్లంపల్లి, ఎస్సారెస్పీ రెండోదశ, వరద కాలువ తదితర పథకాలు దీనిలో ఉన్నాయి. కొన్ని ప్రాజెక్టుల అంచనాలు ఇటీవలే సవరించడంతో ఖర్చు ఇంకా పెరగనుంది.
- 8 మధ్యతరహా ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల పూర్తికి మరో రూ.700కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. దీనిలో ఎక్కువశాతం (రూ.300కోట్లు పైగా) కొమరం భీంలోనే ఉంది.

**కొత్త ప్రాజెక్టులకు రూ.89వేల కోట్లు :** కొత్తగా దిండి, పాలమూరు – రంగారెడ్డి, సీతారామ, కాళేశ్వరం ఎత్తిపోతల పథకాలతో పాటు లోయర్ పెన్‌గంగ, చనఖా – కొరాటా పథకాలను ప్రభుత్వం చేపట్టింది. వీటికి సంబంధించి మంత్రివర్గానికి అందచేసిన నివేదిక ప్రకారం అంచనా రూ.89,411కోట్లు కాగా రూ.17వేల కోట్లు ఖర్చుచేశారు. అయితే ఇందులో కాళేశ్వరం ఎత్తిపోతల, పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల సవరించిన అంచనా ప్రకారం మరో రూ.67వేల కోట్లు పెరిగే అవకాశముంది. వీటన్నింటనీ పరిగణలోకి తీసుకుంటే ప్రాజెక్టులు పూర్తిచేయడానికి రూ.లక్షన్నర కోట్లపైగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. వచ్చే మూడేళ్లలో ఈ పనులన్నీ పూర్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఇందులో జాప్యం జరిగితే నిర్మాణ వ్యయం మరింత పెరుగుతుంది. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల్లో ఎక్కువభాగం వచ్చే ఆరేడు నెలల్లో పూర్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఎల్లంపల్లి, దేవాదుల మూడో దశ తదితర పనులు ఈ ఏడాది ఆఖరు, వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని తలపెట్టింది. పాలమూరు – రంగారెడ్డి, దిండి, కాళేశ్వరం, సీతారామ ఎత్తిపోతల తదితర ప్రాజెక్టుల గుత్తేదారులతో కుదుర్చుకున్న ఒప్పందాల ప్రకారం వీటిని మూడేళ్లలో పూర్తి చేయాలి.

తెలంగాణ వచ్చాక సేకరించింది 60,500 ఎకరాలు: తెలంగాణ ఏర్పడిన తర్వాత సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి 60.500 ఎకరాల భూమిని సేకరించినట్టు నీటిపారుదల శాఖ నివేదించింది. తెలంగాణలోని ప్రాజెక్టుల నిర్మాణానికి 3,82,512 ఎకరాలు అవసరంకాగా, 2004 నుంచి 2016 డిసెంబర్ వరకు 2,64,140 ఎకరాలను సేకరించినట్టు మంత్రివర్గానికి తెలియచేసింది. ఇందులో పాత

## హేతుబద్ధ అభ్యంతరాలే అయినా..



ముఖ్యమంత్రి కేసీఆర్ ఏకపక్ష ధోరణితో చేపడుతున్న కొన్ని భారీ ఎత్తిపోతల ప్రాజెక్టులను తర్వాతి పాలకులు కొనసాగించకపోవచ్చని తెలంగాణ ఐకాస నేత కోదండరాం అభిప్రాయపడ్డారు. మిషన్ భగీరథ పేరుతో కూడా అనవసరంగా కొత్త పైపులు బిగిస్తున్నారని, ఇలాంటి అసంబద్ధమైన ప్రాజెక్టులతో కాంట్రాక్టర్లకు తప్ప ప్రజలకు ఉపయోగముండదని అన్నారు. కోదండరాంలా తీవ్ర హెచ్చరికలు చేయకపోయినా.. కేంద్ర ప్రభుత్వ జలవనరుల శాఖ సలహాదారు శ్రీరాం వెదిరె కూడా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కొన్ని సాగునీటి పథకాల పట్ల అభ్యంతరాలు వ్యక్తం చేశారు. మైదాన ప్రాంతంలో నిర్మిస్తున్న మల్లన్నసాగర్ రిజర్వాయర్ అవసరం లేదన్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా ఒకటి రెండు రిజర్వాయర్లు కడితే సరిపోతుదన్నారు. లోయర్ మానేరు, అప్పర్ మానేరు డ్యాంలలో 90 టీఎంసీల నీటిని నిల్వ చేసుకోవచ్చన్నారు. ఎల్లంపల్లి, శ్రీరాంసాగర్ మధ్య మరో తొమ్మిది బ్యారేజీలు నిర్మించుకోవాలని సూచించారు. రిజర్వాయర్ల కోసం వేల కోట్లు రూపాయలు ఖర్చు పెట్టే బదులు.. మానేరు, చలివాగుల్లో బ్యారేజీలు నిర్మించటం ద్వారా రివర్స్ టెక్నాలజీతో నీటిని మళ్లించవచ్చన్నారు. కేవలం 80,000 కోట్ల ఖర్చుతో రాష్ట్రంలోని గోదావరి, కృష్ణా బేసిన్‌లకు సాగునీరందించవచ్చన్నారు. వెయ్యి టీఎంసీల గోదావరి నీటిని వినియోగించుకునే విధంగా ప్రాజెక్టులకు రూపకల్పన చేయాలన్నారు. గోదావరి నీటిని కృష్ణాలోకి మళ్లించటం (నదుల అనుసంధానం) వల్ల రాయలసీమకు, తెలంగాణలో అనావృష్టితో బాధపడే ప్రాంతాలకు, పెన్నా, కావేరి నదీపరివాహక ప్రాంతాలకు మేలుజరుగుతుందన్నారు. నదులు, కాల్వల ద్వారా జలరవాణా చేసుకునే అవకాశముందని, దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రాజెక్టులను డిజైన్ చేయాలని సూచించారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ భిన్నాభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని సీనియర్ పాత్రికేయుడు కె. రామచంద్రమూర్తి కూడా శ్రీరాం రచించిన 'గోదావరి జలాల సమగ్ర వినియోగం – జాతీయ, తెలంగాణ రాష్ట్ర దృక్పథాలు' పుస్తకావిష్కరణ సందర్భంగా కేసీఆర్‌కు సూచించారు. హన్మంతరావు, డాక్టర్ రాజిరెడ్డి వంటి ఇంజినీర్ల సేవలను ఇతర రాష్ట్రాలు వినియోగించుకున్నాయని గుర్తు చేశారు. ఈ అభ్యంతరాలు హేతుబద్ధంగానే ఉన్నా.. కేసీఆర్ స్పందించకుండా సొంత నిర్ణయాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. కాళేశ్వరంకు ముందున్న ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు ఎత్తిపోతల పనులకే వేల మెగావాట్ల విద్యుత్తు అవసరమవుతుందని, నిర్వహణ వ్యయం కలుపుకుంటే తెలంగాణకు భారంగా మారుతుందని లోక్‌సత్తా చెప్పినప్పుడు.. ఉమ్మడి రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష నేతలు విమర్శించారుగానీ కేసీఆర్ మాత్రం (సూర్యాపేట సభలో) సమర్థించారు. అలాంటి కేసీఆర్ ఇప్పుడు ఎకరాకు విద్యుత్ బిల్లే సగటున రూ.47,000 అయ్యే భారీ ఎత్తిపోతలను లక్షల ఎకరాల సాగులక్ష్యమంటూ ఏకపక్షంగా చేపడుతున్నారు. ప్రాణహిత–చేవెళ్లను వ్యతిరేకించటమంటే తెలంగాణను వ్యతిరేకించటమే అనే ధోరణులు కొనసాగిన తరుణంలో కూడా లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ అసెంబ్లీలో ఆ ప్రాజెక్టు వల్ల తెలంగాణకు కలిగే నష్టాలను నిర్ద్వంద్వంగా ఎండగట్టారు. ఆ వేల కోట్ల డబ్బును తెలంగాణకే ఖర్చుపెడుతూ చిన్న ఎత్తిపోతలలు ఏర్పాటు చేయటానికి, వ్యవసాయనుబంధ పరిశ్రమలతో ఆర్థిక కేంద్రాలుగా ఉండే చిన్న పట్టణాలను అభివృద్ధి చేయటానికి వినియోగించాలని సూచించారు.

భూసేకరణ చట్టం, 2013 భూసేకరణ చట్టం ప్రకారం 2,14,240 ఎకరాలు సేకరించారు. తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో 123 ప్రకారం సేకరించింది మరో 49,900 ఎకరాలు. జీవో 123 కింద కాళేశ్వరం, పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుల్లో ఎక్కువ సేకరణ జరిగింది. ప్రాజెక్టుల నిర్మాణం కారణంగా 103 గ్రామాలు, 39 తండాలు పూర్తిగాను, 24 గ్రామాలు పాక్షికంగాను ముంపునకు గురవుతాయి. 68,321 కుటుంబాలు నిరాశ్రయులు కాగా, మరో 17301 కుటుంబాలు భూసేకరణ ప్రభావానికి గురయ్యాయి. ఇప్పటివరకు 17,103 కుటుంబాలకు పునరావాసం కల్పించారు.

కొత్త ఆయకట్టు 12.77లక్షల ఎకరాలు

తెలంగాణలో 2005 నుంచి 2016 వరకు భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల కింద 12.77లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు సాగులోకి వచ్చింది. మొత్తం 71.42లక్షల ఎకరాలను సాగులోకి తేవటం లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది. తెలంగాణలో 36 భారీ, మధ్యతరహా ప్రాజెక్టులున్నాయి. ★

# ఆంధ్రప్రదేశ్ జల ప్రణాళిక



**2018** మార్చిలోపు వీలైనన్ని నీటిపారుదల ప్రాజెక్టులను అందుబాటులోకి తేవటం లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ప్రణాళిక రూపొందించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి అందచేసింది. దీనిప్రకారం కొన్ని ప్రాజెక్టులను పూర్తిస్థాయిలో నిర్మించి ప్రారంభించనున్నారు. మరికొన్ని ప్రాజెక్టుల్లో కొన్ని దశలను పూర్తిచేసి, వాటి ప్రయోజనాలు రైతులకు అందించాలని యోచిస్తున్నారు. ఇందులో వంశధార రెండో భాగం రెండో దశ పనులతోపాటు పురుషోత్తపట్నం ఎత్తిపోతల, వివిధ కీలక ప్రాజెక్టులు ఉన్నాయి.

- పురుషోత్తపట్నం ఎత్తిపోతలను ఈ ఏడాది ఆగస్టు 15న ప్రారంభించాలని లక్ష్యం. గోదావరి నుంచి 30 టీఎంసీల నీటిని మళ్లించటం దీని ఉద్దేశం. పోలవరం ద్వారా వచ్చే ప్రయోజనాలు ముందే పొందేందుకు దీన్ని నిర్మిస్తున్నారు. 2.15లక్షల ఎకరాలకు ప్రయోజనం, విశాఖ పారిశ్రామిక, తాగునీటి వినియోగానికి ఇది ఉపయోగపడుతుందని చెబుతున్నారు.
- 2018 జనవరి 1న వంశధార రెండో భాగం రెండో దశ పనులు పూర్తిచేసి హిరమండలం జలాశయాన్ని జాతికి అంకితం చేస్తారు. దీని వల్ల 45వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరివ్వడంతోపాటు వేలాది ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ సాధ్యమవుతుంది.
- వంశధార, నాగావళి నదుల అనుసంధానం 2018 మార్చి 24 నాటికి పూర్తిచేయాలనే లక్ష్యంతో ఉన్నారు. హిరమండలం జలాశయం నుంచి నారాయణపురం ఆనకట్ట ఎగువకు నీటిని మళ్లిస్తారు.
- పశ్చిమ గోదావరి జిల్లా బుట్టాయగూడెం మండలం పోగొండలో జలాశయ నిర్మాణాన్ని పూర్తి చేసి 2017 అక్టోబర్ 22న ప్రారంభిస్తారు. దీనివల్ల 4000 ఎకరాల ఆయకట్టుకు నీరందుతుంది. ఇదే జిల్లాలో ఎర్రకాలువ ఆధునికీకరణ పనులు ఇదే ఏడాది అక్టోబర్ 22నాటికి పూర్తిచేస్తారు. అనంతపల్లి వంతెన నుంచి నందమూరు అక్విడక్టు వరకు ఎర్రకాలువను వెడల్పు చేస్తున్నారు. ప్రవాహ సామర్థ్యాన్ని 5000 క్యూసెక్కుల నుంచి 20,250 క్యూసెక్కులకు పెంచడమే లక్ష్యం.
- రాజధాని అమరావతిలో వరద నీటిని మళ్లించే కొండవీటి వాగు ఎత్తిపోతల పనులను ఈ ఏడాది ఆగస్టు చివరి నాటికి పూర్తి చేయనున్నారు.
- ప్రకాశం జిల్లాలోని 9 మండలాలకు నీరందించే గుండ్లకమ్మ ప్రాజెక్టులో మిగిలిన పనులను 2017 సెప్టెంబర్‌లోగా పూర్తిచేయనున్నారు. ఇదే జిల్లాలోని కొరిశపాడు ఎత్తిపోతల పథకం పనులను 2017 సెప్టెంబర్ నాటికి పూర్తి చేస్తారు. దీనివల్ల 12 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తారు.

**హంద్రీనీవా**

హంద్రీనీవా రెండోదశలో వివిధ పనులను పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అడివిపల్లి ఎత్తిపోతల పథకాన్ని 2017 ఆగస్టు తొలివారానికి పూర్తి చేయనున్నారు. దీనివల్ల చిత్తూరులోని పుంగనూరు, వాయల్పాడు, పీలేరు నియోజకవర్గాల్లో 80వేల ఎకరాల ఆయకట్టుకు నీరందుతుంది. కుప్పం బ్రాంచి కాలువ పనులను కూడా ఈ ఏడాది సెప్టెంబర్ నెలాఖరుకు పూర్తిచేయాలని నిర్ణయించారు. దీనివల్ల కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లోని 8 మండలాల ప్రజలకు తాగు నీరందుతుంది. 6300 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు వీలవుతుంది.

## ఉత్తరాంధ్ర సుజల స్రవంతి తొలిదశ పూర్తికి ప్రయత్నం

పోలవరం పూర్తవటానికి ముందే పురుషోత్తపట్నం ఎత్తిపోతలతో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం తొలిదశ కింద విశాఖ జిల్లాలోని 1,30,866 ఎకరాలకు నీరందించాలని భావిస్తున్నట్టు నివేదికలో తెలిపారు. ఇందుకు రూ. 2,142కోట్లు ఖర్చవుతాయని అంచనా.

పోలవరం ప్రాజెక్టు నుంచి ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాలకు 63.33 టీఎంసీల గోదావరి నీటిని సరఫరా చేయాలనే లక్ష్యంతో ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని రూపొందించారు. ఈ పథకం కింద విశాఖ జిల్లాలో 3.25లక్షల ఎకరాలకు, విజయనగరం జిల్లాలో 4లక్షల ఎకరాలకు, శ్రీకాకుళం జిల్లాలో 75వేల ఎకరాలకు.. మొత్తం 8లక్షల ఎకరాలకు నీరందించాలనేది ప్రణాళిక. 2009లోనే అప్పటి ప్రభుత్వం పాలనామోద ఉత్తర్వులు ఇచ్చినా ఇప్పటివరకూ ముందడుగు పడలేదు.

సుజల స్రవంతి తొలిదశలో భాగంగా.. పోలవరం ఎడమకాలువ 162.5 కిలోమీటర్ వద్ద ఆఫ్‌టేక్ ద్వారా ఉత్తరాంధ్రకు నీరు తీసుకుంటారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల ద్వారా ఏలేరుకు అనుసంధానం చేసే నీరు కూడా ఏలేరు కుడికాలువ ద్వారా ఇక్కడికే చేరుతుంది (పురుషోత్తపట్నం ఎత్తిపోతలలో 30 టీఎంసీలు తరలించాలనేది ప్రణాళిక. ఇందులో 12 టీఎంసీలను ఏలేరు జలాశయానికి, 7 టీఎంసీలను ఏలేరు ఆయకట్టుకు ఇవ్వనున్నారు. మిగిలిన 11 టీఎంసీలతో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి తొలి దశ పథకం ద్వారా విశాఖ జిల్లాలోని బుచ్చయ్యపేట, రావికమతం, మాడుగుల, మాకవారిపాలెం, కోట ఊరట్ల, రోలుగుంట, నర్సీపట్నం, కశింకోట మండలాల్లో ఆయకట్టుకు నీరివ్వాలన్నది ప్రయత్నం). ఈ నీటిని ఇక్కడి (తాళ్లపాలెం) నుంచి సుజల స్రవంతి తొలిదశ కింద 23 కిలోమీటర్ల మేర గ్రావిటీ కాలువ ద్వారా తీసుకువెళ్తారు. రెండుచోట్ల నీటిని ఎత్తిపోసి పెదపూడి జలాశయానికి తరలిస్తారు. తొలుత జమ్మదులపాలెం వద్ద 28 మీటర్ల నుంచి 45 మీటర్లకు నీటిని ఎత్తిపోస్తారు. రెండోదశలో పెదపూడి సమీపంలో 73 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోసి జలాశయంలోకి మళ్లిస్తారు. ఈ కాలువ నుంచి కుడి వైపు మూడు డిస్ట్రిబ్యూటరీ కాలువలు, ఎడమవైపు ఒక డిస్ట్రిబ్యూటరీ కాలువ ద్వారా మొత్తం 8 మండలాల్లోని ఆయకట్టుకు నీరందిస్తారు.

అనంతపురం జిల్లాలో మారాల జలాశయం, చెర్లోపల్లి జలాశయం పనులతోపాటు మడకశిర బ్రాంచి కాలువ పనులు ఆగస్టు నెలాఖరుకు పూర్తిచేయనున్నట్టు ప్రకటించారు.

- నెల్లూరు జిల్లాలోని మూడు మండలాల్లో 20,700 ఎకరాలు కొత్త ఆయకట్టుకు నీరందించేందుకు కండలేరు ఎడమ కాలువ ఎత్తిపోతల పథకాన్ని ఆగస్టు తొలివారంలో ప్రారంభించ నున్నారు. ఇదే జిల్లాలోని లక్ష ఎకరాల స్థిరీకరణకు ఉపయోగపడే నెల్లూరు బ్యారేజీ నిర్మాణం 2017 అక్టోబర్ నెలాఖరుకు ప్రారంభించదలచారు. పెన్నార్ కాలువ వ్యవస్థలో 2,59,387 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు వీలుగా సంగం బ్యారేజీ నిర్మాణాన్ని 2017 అక్టోబర్ నెలాఖరుకు పూర్తిచేయాలని ప్రణాళిక సిద్ధం చేశారు.
- శ్రీశైలం వరద జలాలతో నింపేలా 26.85 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో గండికోట జలాశయం నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీరు నిలిపేలా పనులు సెప్టెంబర్ నెలాఖరుకు పూర్తిచేయనున్నారు. గండికోట జలాశయం నుంచి చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు నీటిని ఎత్తిపోసే పనులు కడప, అనంతపురం జిల్లాల్లో కలిపి జరుగుతున్నాయి. 45 రోజుల్లో గండికోట నుంచి చిత్రావతికి 8.3 టీఎంసీలు అయిదు దశల్లో ఎత్తిపోసేలా పనులు చేస్తున్నారు. 2017 సెప్టెంబర్ నెలాఖరుకు ఈ పనులు పూర్తిచేస్తామని జలవనరుల శాఖ పేర్కొంటోంది. గండికోట జలాశయం నిర్మాణం నేపథ్యంలో రాష్ట్ర రహదారి 31 ముంపులో చిక్కుకుంటోంది. దీంతో ప్రత్యామ్నాయ రహదారి నిర్మిస్తున్నారు. ఈ పనులు సెప్టెంబర్ నెలాఖరుకు పూర్తిచేస్తారు.
- గాలేరునగరిలో భాగమైన అవుకు టన్నెల్ పనుల్ని ఆగస్టు నెలాఖరుకు పూర్తిచేస్తామంటున్నారు. 5000 క్యూసెక్కుల నీటిని దీని నుంచి మళ్లించి గండికోట జలాశయానికి ఈ ఖరీఫ్‌లోనే చేరుస్తామంటున్నారు.
- గోరకల్లు రిజర్వాయర్‌లో ఈ ఏడాది ఖరీఫ్‌లో 9 టీఎంసీల నీరు నిల్వచేసేలా పనులు పూర్తిచేస్తారు. 2017 ఆగస్టు చివరివారానికి ఈ పనులు పూర్తిచేస్తామని చెబుతున్నారు.
- కర్నూలు జిల్లా సిద్ధాపురం ఎత్తిపోతల పథకం పనుల్ని ఈ ఏడాది జులై నెలాఖరుకే పూర్తిచేస్తామంటున్నారు. పులికనుమ, పులకుర్తి ఎత్తిపోతల పథకాలను 2017 ఆగస్టు చివరినాటికి పూర్తిచేయాలని ఆశిస్తున్నారు. ★

# ఆ లక్షల కోట్లలో రైతులకు న్యాయమైన వాటా అందే వరకూ పోరాటం: జేపీ



రష్యాలో కిలో బియ్యం రూ.130 అమ్ముతున్నప్పుడు భారత్‌లో రైతులకు దక్కుతున్నది కిలోకి రూ.10. అలా డిమాండ్ ఉన్నప్పుడు అక్కడికి ఎగుమతి చేసి మన రైతులు లాభాలు సంపాదించుకోవచ్చు కదా అని మెడ మీద తలకాయ ఉన్నవాడెవడికైనా తట్టే ఆలోచన. విదేశాల మాట అలా వుంచి, పక్క జిల్లాకు కూడా రైతులు తమ పంటల్ని తరలించకూడదు అని ఆంక్షల్ని విధించి, ఆహార సబ్సిడీనంతా ప్రభుత్వమే ఎంతో కష్టపడి భరిస్తున్నట్టు పాలకులు నాటకాలాడుతున్నారు. అసలు సబ్సిడీ భరిస్తున్నది రైతులు. తమ లాభాలను ప్రభుత్వం అణగదొక్కుతుంటే, పాలకులు విదిల్చే తాత్కాలిక తాయిలాలు, రాయితీలు,కస్కీములు, కులం, పార్టీ వంటి ఆకర్షణల్లో మునిగిపోయి రైతులు నిత్యదరిద్రుల్లా బతుకుతున్నారు. మరీ భరించలేని పరిస్థితి వచ్చినప్పుడు రోడ్లెక్కుతున్నారుగానీ మళ్లీ ఆకర్షణల్లో వారిని ముంచేసి ఉద్యమాలను పాలకులు, వ్యాపారవర్గాలు విజయవంతంగా అణచివేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లోనే రైతుకు ఆదాయం చుట్టూ స్వేచ్ఛా వాణిజ్య వ్యవసాయ విధానాలతో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ 2010లో రైతు ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. కౌలుదారులు సహా వ్యవసాయం చేసేవారంతా రైతులేనని స్పష్టం చేస్తూ వారి ప్రయోజనాల కోసం తెలుగు రాష్ట్రాల్లో, జాతీయస్థాయిలో పలువురిని కదిలించారు. అవసరానికి రెట్టింపున్న ఆహారధాన్యాలు కుళ్లిపోతున్నా, రైతులకు ధర రాకున్నా ఎగుమతులను ఎందుకు అనుమతించరని ఆనాటి యూపీయే ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రతిపక్ష బీజేపీ పార్లమెంటు సభ్యులు కూడా జేపీకి అండగా పార్లమెంటులో మాట్లాడారు. స్వయంగా ప్రధానమంత్రి డా॥ మన్మోహన్ సింగ్‌ను కలిసి సమస్యను క్షుణ్ణంగా జేపీ తెలియచేశారు. వ్యవసాయ సంక్షోభం గురించి తనకంటే ప్రధాని మన్మోహన్‌కు బాగా తెలుసని, అనేక విషయాలను భేటీలో ఆయన అలవోకగా చెప్పారని జేపీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. జేపీ చొరవ, సొంత పార్టీవారే కాకుండా బీజేపీ ఎంపీలు కూడా గట్టిగా డిమాండ్ చేయటంతో ఎగుమతులపై ఆంక్షల్ని తొలగించేందుకు చివరికి ప్రధాని అంగీకరించి ఆదేశాలిచ్చారు. ఇలా భారత్ నుంచి ఆహారధాన్యాల ఎగుమతి 2012-13లో రికార్డుస్థాయికి చేరుకుని 2కోట్ల టన్నుల మార్కును దాటింది. బియ్యం ఎగుమతుల్లో థాయ్‌లాండ్‌ను కూడా అధిగమించి భారత్ లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించింది. రైతు సంఘాల సహకారంతో రైతు ఐక్యతా యాత్రలు, సత్యాగ్రహ యాత్ర వంటి కార్యక్రమాలతో గల్లీ నుంచి ఢిల్లీ వరకు జేపీ చేసిన పోరాటం వల్ల తెలుగు రాష్ట్రాల్లోని బీపీటీ ధాన్యం రైతులకే రూ.3,600కోట్ల మేర లాభం చేకూరినట్టు అంచనా. అలాగే తెలంగాణలో పత్తి రైతులు ఆ ఏడాది రికార్డు స్థాయి ధరను పొందారు. తర్వాత అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్‌ననుసరించి ఎగుమతులు తగ్గినా, భారత్‌కు ఆదాయం మాత్రం చెప్పుకోదగిన స్థాయిలోనే వస్తోంది. గత ఏడాది మొత్తం అన్ని రకాల పంటలు, అనుబంధ ఉత్పత్తుల ఎగుమతులపై భారత్‌కు రూ.1.28లక్షల కోట్ల ఆదాయంరాగా, అందులో బియ్యం వాటా రూ.38,000కోట్ల వరకు ఉంది. ఈ విషయంపై జేపీ స్పందన కోరగా.. తాను ఇంకా సంతృప్తి చెందలేదని, వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా వచ్చే ఆదాయంలో రైతులకు న్యాయమైన వాటా దక్కేవరకు తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. పంట బాగా పండినా దళారులు, ఓటుబ్యాంకు పాలకులే లాభపడుతున్నారు తప్ప రైతులకు ఆదాయం దక్కటం లేదన్నారు. మినిమం సపోర్ట్ ప్రైస్ (కనీస మద్దతు ధర)ను మ్యాగ్జిమం సెల్లింగ్ ప్రైస్ (గరిష్ట అమ్మకం ధర)గా మార్చేసి పాలకులు రైతులను మోసం చేస్తున్నారన్నారు. ఈ పరిస్థితిని మార్చేవరకు రైతుల తరపున పోరాటం ఆగదన్నారు.

నిజాయతీతో, అవగాహనతో రాజకీయ పోరాటం చేస్తే దేశానికి ఎన్ని లక్షల కోట్ల ఆదాయాన్ని అందించవచ్చో చెప్పటానికి ఇదో ఉదాహరణ. ఇలాంటి పోరాటాలను అనేకం ప్రచారం లేకుండానే జేపీ చేశారు. వాటిలో కొన్నిటికి (పెట్రోలు బంకుల్లో కొలతల అక్రమాలను బైటపెట్టటం, 2జీ స్పెక్ట్రం అక్రమ లైసెన్సుల్ని రద్దు చేయించి బహిరంగ వేలం విధానం అనుసరించేలా చేయటం వంటివి) వెంటనే ఫలితాలు కనిపిస్తాయి, మరికొన్నిటికి కాలక్రమంలోనే తెలుస్తాయి. నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి లేని సేవలు, పోలీసు, న్యాయ సంస్కరణలు వంటి అంశాల్లో లోక్‌సత్తా కృషి వల్ల రైతులకు, ఇతర వర్గాలకు అందే ఫలాల్ని దీర్ఘకాలంలో తప్ప తక్షణం లెక్కేయలేం. ఏదో ఒక నాయకుడు దైవదూతలా వరమిచ్చినట్టుగానో, దానం చేసినట్టుగానో కాకుండా.. ప్రజలు తమ కాళ్ల మీద తాము నిలబడేరీతిలో పరిష్కారాలు చూపుతూ దేశానికి భారీ లాభం చేయటం, విస్తృత స్థాయి ప్రాతిపదికన జనజీవితాన్ని ప్రభావితం చేయటం లోక్‌సత్తా పరిష్కారాల విశిష్టత.

(కర్టెసీ: సోషల్‌పోస్ట్ న్యూస్ పోర్టల్) ★

# మేక్రాన్ లాంటి నాయకుడు మనదేశంలో సాధ్యమా?

**- రామచంద్ర గుహ,** చరిత్రకారులు



పాలక భారతీయ జనతా పార్టీకి 'ప్రతిపక్షం'గా వున్న రాజకీయ పార్టీలకు వర్తింప చేయదగ్గ విశేషణాలు చాలా వున్నాయి. అవినీతి, ఆశ్రిత పక్షపాతి, బలహీన, అనర్హ, ఉదాసీన, నిర్జీవ, సోమరిపోతు, అసమర్థ ఇత్యాదులను మొదట చెప్పుకోవచ్చు. ప్రస్తావిత విశేషణాలలో చివరి రెండు లక్షణాలు ఇటీవల బాగా ప్రస్ఫుటమయ్యాయి. మధ్యప్రదేశ్‌లోని మందసార్‌లో రైతులు ఆందోళన, పోలీసు కాల్పుల ఘటన అనంతరం కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆ ప్రాంతాన్ని సందర్శించారు. అంతగా బద్ధకస్తుడుకాని రాజకీయవేత్త అయితే అక్కడే మకాం వేసి, ఉద్యమిస్తున్న రైతులకు సంఘీభావం ప్రకటించి, రైతులపై కాల్పులకు ఆదేశించిన అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకొని, బాధిత కుటుంబాలకు తగు పరిహారం చెల్లించి, వ్యవసాయరంగంలో నెలకొని వున్న దుస్థితిని రూపుమాపేందుకు అవసరమైన చర్యలకు ఉపక్రమించేంత వరకు మధ్యప్రదేశ్ నుంచి నిష్క్రమించేవాడు కాదు. మరి రాహుల్ చేసిందేమిటి? మందసార్ వచ్చి, రైతులతో ఫోటోలు దిగి, ఢిల్లీ తిరిగివెళ్లి, ఆ వెన్వెంటనే విహారయాత్రకు యూరప్‌లో వాలిపోయాడు! మరోవైపు, రాష్ట్రపతి పదవీ ఎన్నికలలో తమ ఉమ్మడి అభ్యర్థిని ప్రకటించడంలో ప్రతిపక్షాలు చేసిన క్షమార్హంకాని జాప్యం వాటి అసమర్థతను స్పష్టంగా వెల్లడించింది.

ఈ రెండు ఉదంతాలు, ప్రథమ కుటుంబం నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ పునరుజ్జీవనం పొందలేదని, దేశ రాజకీయాలలో ప్రజాస్వామిక పోటీకి కాంగ్రెస్ పార్టీ అంతకంతకూ అసంగతమైపోతోందని చాలాకాలంగా నేను చేస్తున్న వాదనను ధృవీకరించాయి. కాంగ్రెస్ పార్టీకి దేశవ్యాప్తంగా కొద్దోగొప్పో గుర్తింపు ఇంకా ఉండగా బీజేపీకి ప్రతిపక్షాలుగా ఉన్న ఇతర పార్టీలు ఒక నిర్దిష్ట రాష్ట్రానికి, అందునా ఆ రాష్ట్రంలోని ఒకటి లేదా రెండు సామాజికవర్గాలకు మాత్రమే పరిమితమై వున్నాయి. ఒక నిరంకుశ లేదా అవినీతిపరుడైన నాయకుని సారథ్యంలో ఉన్న ఈ చిన్న పార్టీలు రానున్న సంవత్సరాలలో బీజేపీకి గట్టిపోటీనిచ్చే అవకాశం లేనే లేదు. దేశ రాజకీయాలలో బీజేపీ ఆధిక్యం, బీజేపీ అంతర్గత వ్యవహారాలలో నరేంద్రమోదీ, అమిత్‌షాల ప్రాబల్య పర్యవసానాలు మన ప్రజాస్వామ్య వ్యవస్థ, జాతి భవితవ్యాన్ని ఏవిధంగా ప్రభావితం చేయనున్నాయి? మోదీ, షాల గురించి ముందుగా మనం గుర్తుపెట్టుకోవాల్సిన వాస్తవం ఒకటి ఉన్నది. ఎన్నికలలో విజయం సాధించడానికి మించి ప్రజాస్వామ్యం విషయంలో ఆ ఇరువురికి నిజమైన నిబద్ధత లేదన్నదే ఆ వాస్తవం.

ప్రతిపక్షాలు పటిష్టంగా లేవు. అయితే ప్రజాస్వామ్యం పార్టీ రాజకీయాలకు మించిన వ్యవహారం కదా. కనుకనే మోదీ భావాలు, విధానాలను కనీసం పంచాయత్ ఎన్నికలలో సైతం పోటీచేయని ఎంతోమంది భారతీయులు సవాల్ చేస్తున్నారు. దేశవ్యాప్తంగా పలు పత్రికలు, మరీ ముఖ్యంగా వివిధ టీవీ ఛానెళ్లు పాలక బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నప్పటికీ కొన్ని దినపత్రికలు, కొంతమంది ఎడిటర్లు, విలేకరులు నిర్భయంగా వాస్తవాలను వెల్లడిస్తున్నారు. బీజేపీ నాయకుల నేరాలు, ఆ పార్టీ నిర్దేశకత్వంలో వున్న రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న తప్పులను వారు ఎత్తిచూపుతున్నారు. కొన్ని వెబ్‌సైట్లు మరింత స్వతంత్ర వైఖరితో పాత్రికేయ వృత్తిధర్మాన్ని నిర్వహిస్తున్నాయి. సామాజిక మాధ్యమాలలో సైతం ప్రజాస్వామిక, ఉదారవాద అభిప్రాయాలు మరింత ప్రభావశీలంగా వ్యక్తమవుతున్నాయి.

ప్రధాన స్రవంతి మీడియాతోపాటు సామాజిక మాధ్యమాలపై కూడా నియంత్రణ సాధించడానికి బీజేపీ తన సమయాన్ని మేధో, ఆర్థిక వనరులను ఎంతగా వినియోగిస్తున్నప్పటికీ సహేతుక చర్చను, స్వతంత్ర విశ్లేషణను అణచివేయలేకపోతోంది. ఇదిలావుండగా ఆసేతు హిమాచలం భారతీయ సమాజంలో కోట్లాదిమంది, హిందూత్వను దృఢంగా వ్యతిరేకిస్తున్న రాజ్యాంగబద్ధ దేశభక్తి భావనకు నిబద్ధమై వున్నారు. తమ దేశం ఒక హిందూ పాకిస్తాన్‌గా రూపొందాలని ఈ భారతీయులు కోరుకోవడం లేదు. తాము ఏమి తినాలో,

ఏ దుస్తులు ధరించాలో, ఎవరిని ప్రేమించాలో, ఎవరిని అపఖ్యాతిపాలు చేయాలో పాలకులు నిర్దేశించడాన్ని వారు వ్యతిరేకిస్తున్నారు. భారత రాజ్యాంగం కింద ఏడు దశాబ్దాల స్వాతంత్ర్యం, స్వేచ్ఛా జీవనం ఫలితంగా నిరంకుశ పాలనాధోరణులు, అధిక సంఖ్యాకుల ఆధిపత్యవాదానికి విరుద్ధమైన కట్టుబాట్లు, అలవాట్లు అసంఖ్యాక భారతీయులకు అలవడ్డాయి. బీజేపీ పట్ల ఈ స్వతంత్ర, పార్టీయేతర వ్యతిరేకత క్రమంగా ఒక పార్టీగా (లేదా పార్టీలుగా) రూపుదాల్చి, 2024 సార్వత్రిక ఎన్నికలలో బీజేపీని ఓడించగలుగుతుందా? ఫ్రెంచ్ రాజకీయాలలో నవశకాన్ని ప్రారంభించిన మేక్రాన్ లాంటి నాయకుడు మనదేశంలో కూడా సాధ్యమా? ఈ ప్రశ్నలకు నా వద్ద సమాధానాలు లేవు. అయితే ప్రజాస్వామ్యాన్ని ఎన్నికలలో జయాపజయాలకు కుదించకూడదన్న వాదనను పునరుద్ఘాటిస్తున్నాను.

ప్రజాస్వామ్యం ఒక జీవన విధానం. ఒక విలువల వ్యవస్థ. వీటిని మనం ప్రతిదినమూ ఆచరించాలి. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి వాటిని సుప్తావస్థలో నుంచి బయటకు తీసుకువస్తే ప్రజాస్వామ్యం పరిపుష్టమవదు. ప్రజాస్వామ్యం గురించిన ఈ లోతైన భావనను అసంఖ్యాక భారతీయులు ఆమోదిస్తున్నారు. కనుకనే వివిధ రాష్ట్రాల ఎన్నికలలో బీజేపీ విజేతగా నిలుస్తున్నప్పటికీ ఆ పార్టీ విధానాలు, నాయకులు ప్రజారంగంలో తీవ్ర విమర్శలకు గురవుతున్నారు. పాతకాలపు హిందూత్వవాదులు హిట్లర్, ముస్సోలినీలను అభిమానించేవారు. వర్తమాన బీజేపీ నాయకులు ప్రజా జీవితంలో మొరటుగా వ్యవహరి స్తుండటం మనకు తెలిసిందే. పార్టీ వ్యతిరేకులను అణచివేయడానికి రాజ్యవ్యవస్థ అధికారాలను సైతం వినియోగిస్తున్నారు. గోరక్షణ పేరిట అమాయకులను నడివీధిలో




చిత్రహింసలు పెట్టి హతమారుస్తున్నారు. ఈ పరిణామాల ఫలితంగా భారతదేశం ఫాసిజంలోకి జారిపోతుందనే భయాందోళనలను వామపక్ష మేధావులు వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి భయాందోళనలు భారత్‌లో ప్రజాస్వామ్య సంస్థాగత చరిత్రను, భారతీయుల ప్రజాస్వామిక సహజాతాలను తక్కువ చేస్తున్నాయని చెప్పక తప్పదు. బీజేపీని అదుపుచేయడంలో ప్రతిపక్షాలు విఫలమయినప్పటికీ ఇతర భారతీయులు ఆ పార్టీ విధానాలను సవాల్ చేస్తారు. ఆ పార్టీ నాయకుల తీరుతెన్నులను ప్రశ్నిస్తారు. పాలనలో అక్రమాలు, అవకతవకలకు బీజేపీని జవాబుదారీగా చేస్తారనడంలో సందేహం లేదు. నరేంద్ర మోదీ, అమిత్‌షాలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ లాంటివారిని ఎన్నికలలో ఓడించి ఉండవచ్చు. అయితే అంబేద్కర్, నెహ్రూ వారసత్వాలతో వారు పోరాడవలసి ఉంటుంది. ఆ మహానాయకులు మనకు అందించిన గణతంత్ర రాజ్యానికి, ప్రజాస్వామిక, బహుళత్వ వ్యవస్థలకు నష్టం చేకూర్చడానికి హిందూత్వ పేరుతో ప్రయత్నిస్తున్నారు. అయితే వారు తమ లక్ష్యసాధనలో సఫలమవ్వడాన్ని భారతీయులు ఎట్టి పరిస్థితులలోను అనుమతించరు. ★

## మానవవనరుల అభివృద్ధికి 'సాత్'తో కాయకల్ప చికిత్స

రాష్ట్రాలతో కలిసి మానవ వనరుల అభివృద్ధికి నీతి ఆయోగ్ 'సాత్' పేరుతో కార్యాచరణ చేపట్టింది. 'సస్టెయినబుల్ యాక్షన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ హ్యూమన్ కేపిటల్' (ఎస్ఏటీహెచ్-సాత్) అనే ఈ కార్యక్రమం ద్వారా విద్య, వైద్య రంగాలలో సంస్కరణలు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రాలు కోరినట్టు సాంకేతికపరమైన మద్దతునివ్వనుంది. వైద్యరంగంలో మూడు మార్గదర్శక (రోల్‌మోడల్) రాష్ట్రాలను తీర్చిదిద్దాలని భావిస్తోంది. ఇందుకు అర్హమైన రాష్ట్రాలను గుర్తించటానికి మూడంచెల వడపోత కార్యక్రమాన్ని చేపట్టింది. తెలంగాణ, ఏపీ సహా 16 రాష్ట్రాలు ఇందుకు సుముఖత వ్యక్తం చేశాయి. మెకన్సీ అండ్ కంపెనీ, ఐపీఈ గ్లోబల్ కన్సార్టియం ఈ కార్యక్రమానికి చెల్లింపు సేవలు అందిస్తాయి. అయితే, ఇది కాయకల్ప చికిత్సే తప్ప మౌలిక మార్పులు తెచ్చే స్థాయి కార్యక్రమం కాదని నిపుణులు అంటున్నారు.

## ఏటీఎల్: ఏడాదిలో 2000 ఆన్‌లైన్ కోర్సుల ప్రారంభం

'స్వయం' పథకం కింద ఏడాదిలో దాదాపు రెండువేల ఆన్‌లైన్ కోర్సులు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు కేంద్ర మానవ వనరుల శాఖా మంత్రి ప్రకాష్ జవదేకర్ చెప్పారు. గత ఏడాది ప్రారంభించిన ఈ పథకం ద్వారా 380 కోర్సులు అందిస్తున్నామని, దాదాపు 60వేల మంది శిక్షణ పూర్తిచేసుకున్నారని తెలిపారు. తక్కువ ఖర్చుతో వీలున్న సమయంలో చదువుకోవడానికే ఈ పథకాన్ని రూపొందించినట్టు చెప్పారు. ఇది ఏ సమయంలోనైనా చదువు (ఎనీ టైం లెర్నింగ్- ఏటీఎల్) అని అభివర్ణించారు. 9వ తరగతి నుంచి పీజీ వరకు ఏ కోర్సునైనా చదివే అవకాశం ఉందని చెప్పారు. ★

# సీబీఐ దర్యాప్తునకు పార్టీల డిమాండ్





విశాఖ జిల్లాలో భూ కుంభకోణంపై సీబీఐ దర్యాప్తు చేయించాలని లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనా కార్యక్రమంలో వివిధ పార్టీల నేతలు డిమాండ్ చేశారు. 'ఉడా' చేపట్టిన భూసమీకరణలో జరిగిన అవినీతి, అక్రమాలు, భూదోపిడీల్లో సూత్రధారులు, పాత్రధారులను బైటపెట్టాలని, ఇందుకు సీబీఐ దర్యాప్తు అవసరమని లోక్‌సత్తా, సీపీఐ, సీపీఎం, ఏసీపీ (ఆంధ్ర చైతన్య పార్టీ) నేతలు స్పష్టంచేశారు. విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ ఎదురుగా గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన ఆందోళనలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ, భూకుంభకోణాన్ని స్థానిక సమస్యగా, ఇద్దరు మంత్రుల మధ్య గొడవగా చిత్రీకరిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని, దీనిపై ఉన్నతస్థాయి విచారణ జరగాల్సిందేనని అన్నారు. లోతైన విచారణ జరిపి పేద, మధ్యతరగతి ప్రజల భూములు తిరిగి వారికి దక్కేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇన్ని అక్రమాలు జరిగినా రాష్ట్ర రెవెన్యూమంత్రి కనీసం విశాఖకు రాలేదన్నారు. కుంభకోణంలో ప్రమేయముందని ప్రత్యక్ష ఆరోపణలు ఎదుర్కొంటున్న స్థానిక మంత్రులు విచారణను పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, వారి చేత ముఖ్యమంత్రి తక్షణం రాజీనామా చేయించాలన్నారు. సీపీఐ నేత ఏజే స్టాలిన్ మాట్లాడుతూ.. జిల్లాలో కనీవినీ ఎరుగనిరీతిలో కుంభకోణాలు వెలుగుచూస్తే చంద్రబాబు కేసును పక్కదోవ పట్టించేందుకు 'సిట్' వేశారన్నారు. స్వచ్ఛపాలన పేరు చెప్పే ముఖ్యమంత్రి సీబీఐ దర్యాప్తునకు ఎందుకు వెనకాడవలసి వస్తోందని ప్రశ్నించారు. ప్రభుత్వం పేదల పొట్టకొట్టటమే ధ్యేయంగా పనిచేస్తోందని, అధికారుల చేతలకు ముఖ్యమంత్రి మాటలకు పొంతనలేదని సీపీఎం నేత బి.గంగాధరరావు అన్నారు. చంద్రబాబుపై ప్రజలకు నమ్మకం పోయిందన్నారు. కార్యక్రమంలో ఏసీపీ అధ్యక్షుడు ఉమానాయుడు, సీపీఎం నాయకులు మణి, పి. అప్పారావు, కె.కుమారి, లోక్‌సత్తా పార్టీ నేతలు ఎంఎస్ఎన్ మూర్తి, హరిగణేష్, వేణుగోపాల్, లెక్కల శ్రీను, దేవరపల్లి మార్కండేయులు, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు. ★

# కేంద్రానికి లేఖ రాయండి: జేపీకి వివరాలందించి కోరిన బాబ్జీ



రాష్ట్రంలో ఇప్పటివరకూ వెలుగుచూసిన కుంభకోణాల్లో విశాఖ భూ దోపిడీయే అతిపెద్దదని, మంత్రులు సహా ప్రభుత్వంలోని పలుకుబడి గలవారు ఈ కుంభకోణంలో ఉన్నందున 'సిట్'తో తేలదని, దీనిపై సీబీఐ విచారణకు కేంద్రప్రభుత్వానికి లేఖ రాయాలని పార్టీ వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్‌ను హైదరాబాద్‌లో కలిసి కోరినట్టు బాబ్జీ విజయనగరంలో మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. విశాఖ జిల్లాలోని వివిధ నియోజకవర్గాలలో జరిగిన అవినీతి, భూ కబ్జాల వివరాలను జేపీకి అందజేసినట్టు చెప్పారు. మందపాకలో ల్యాండ్‌పూలింగ్ పేరుతో జరిగిన అవినీతిని లోక్‌సత్తా పార్టీయే వెలుగులోకి తెచ్చిందని, వెంటనే కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ స్పందించి రికార్డుల ట్యాంపరింగ్ జరిగిందని ప్రకటించారని బాబ్జీ గుర్తుచేశారు. విశాఖపట్నం జిల్లాలో 2,95,000 ఎస్ఎఫ్ఏ కాపీలు, 16,375 ఎఫ్ఎంబీలు, 233 గ్రామాల మ్యాపులు, 375 రీసెటిల్‌మెంట్లు రిజిస్టర్లు మాయమైపోయాయని, ఈ రికార్డులన్నీ హుద్‌హుద్ తుపానులో కొట్టుకుపోయాయని పాలకులు చేస్తున్న ప్రకటనలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. పెందుర్తి, భీమిలి, ఆనందపురం మండలాల్లో ఎమ్మెల్యేలు, మంత్రి, అనుచరులు వందలాది ఎకరాల స్వాహాకు స్కెచ్ వేసి ప్రభుత్వం నుంచి కొన్ని జీవోలు కూడా తెచ్చి రైతులను ముంచారని భీశెట్టి ఆరోపించారు. లోక్‌సత్తా కార్యాలయంలో జరిగిన సమావేశంలో పార్టీ నేతలు అల్లంశెట్టి నాగభూషణం, రాజారావు, పతివాడ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు. ★

# ప్రజలకు మంచి చేయాలనుకుంటూ అవగాహనతో చదవండి.. తేలిగ్గా నెగ్గుతారు!



సివిల్ సర్వీసు పరీక్షలను కెరీర్ దృష్టితోనే కాకుండా సమాజదృష్టితో చూడాలని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ యువతకు సూచించారు. సివిల్ సర్వెంట్ల ద్వారా దేశానికి కలిగే ప్రయోజనాలను అర్థం చేసుకోవాలన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ వృత్తి వ్యక్తిగతం కోసమే అనుకునేవారు చివరకు సాధించేదేమీ పెద్దగా ఉండదన్నారు. హైదరాబాద్ దోమలగూడ ఇందిరాపార్కు చౌరాస్తా వద్ద గల జీఆర్ స్టడీసర్కిల్‌లో సివిల్ సర్వీసు శిక్షణా తరగతులను జేపీ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తూ.. స్వతంత్ర భారతదేశం ఏర్పడిన 70 ఏళ్ల తర్వాత కూడా కలెక్టర్లకవ్యవస్థ పట్ల అదే గౌరవం కొనసాగుతుందంటే సివిల్ సర్వీసుకు–ప్రజాస్వామ్యానికి మధ్య ఉన్న బలమైన బంధమే అందుకు కారణమన్నారు. సివిల్ సర్వీసులోకి ఎంపికవ్వాలనుకునే విద్యార్థులు విషయాలను సమగ్రంగా అర్థం చేసుకోవాలని, ఇతరులపై ఆధారపడకుండా పత్రికలు వివిధ మార్గాల ద్వారా సమాచారాన్ని సేకరించుకోవడం, హేతుబద్ధంగా విశ్లేషించి అభిప్రాయాలను ఏర్పరచుకోవటం చేయాలన్నారు. చిట్కాలు, టిట్‌బిట్ల మీద ఆధారపడకుండా.. మౌలిక స్థాయి నుంచి అన్ని విషయాలను సమగ్రంగా తెలుసుకుంటేనే సమాజాన్ని, సమస్యలను, వ్యవస్థలను పూర్తిగా అర్థం చేసుకోగల అవకాశం లభిస్తుందన్నారు. ప్రిలిమినరీ పరీక్షలను మరీ సీరియస్‌గా తీసుకుని హైరానాపడకుండా రోజువారీ అధ్యయనంతో రాసే విధంగా ప్లాన్ చేసుకోవాలన్నారు. సివిల్స్‌లో ప్రిలిమినరీలో ఆప్టిట్యూడ్ పరీక్షను తొలగించాలని యూపీఎస్సీ ఆలోచిస్తున్నట్టు వార్తలస్తున్నాయని, ఇది తప్పుడు ఆలోచనని అన్నారు. ఈ సర్వీసెస్‌లోకి రావాలనుకునేవారికి విషయ పరిజ్ఞానంతోపాటు ఆప్టిట్యూడ్ కూడా అత్యంత కీలకమని, వీలైతే దాని ప్రాధాన్యత పెంచే ఆలోచన చేయాలన్నారు. తొలి ప్రయత్నంలో విఫలమైతే దాన్నో పరాజయంగా భావించవద్దన్నారు. ఆత్మవిశ్వాసంతో, అవగాహనతో, ప్రజలకు మంచి చేయాలనే లక్ష్యంతో చదివితే గెలుపు అంత కష్టం కాదన్నారు. కార్యక్రమంలో జీఆర్ స్టడీ సర్కిల్ ప్రిన్సిపల్ కొంగర గంగాధరరావు, లోక్‌సత్తా పార్టీ నాయకులు గన్‌రెడ్డి రాజారెడ్డి, అనమోలు రాఘవయ్య, కిషోర్, దగ్గుబాటి శ్రీనివాసమూర్తి, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ★

# మన్యానికి వైద్యం అందించండి

విజయనగరం జిల్లా మన్యం ప్రజలు ఏటా ఈ సీజన్‌లో మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా తదితర వ్యాధుల బారినపడి మరణిస్తున్నా ప్రభుత్వాలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవటంలేదని, శాశ్వత నివారణ చర్యలు మన బాధ్యత అన్న స్పృహ కూడా పాలకుల్లో కనిపించటం లేదని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. ఇప్పటికే జ్వరాలతో వైద్యం అందక మంచం పట్టిన గూడేలు, గంజాయిభద్ర పంచాయతీ ఎగువశెంచి, కరడవలస, జల్లేడువలస, పనుకులోవ తదితర గ్రామాలలో వైద్యసేవలందించి ప్రాణాలను కాపాడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి పద్మజను కలిసి కోరారు. గంజాయిభద్ర గ్రామంలో మలేరియా జ్వరంతో గమ్మెలగిత్త (4) మరణించటం విచారకరమని, ముఖ్యంగా గిరిశిఖర గ్రామాల నుంచి ఆసుపత్రులకు వచ్చే రోడ్డుసౌకర్యాలు లేక ఎక్కువమంది మృతి చెందుతున్నారని, వైద్యులనే అక్కడికి పంపి యుద్ధప్రాతిపదికన ఆరోగ్య పరిరక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. మైదాన ప్రాంతంలోనూ వైరల్ జ్వరాలు విస్తరిస్తున్నాయని, అప్రమత్తం కావాలని అన్నారు. ప్రజలు చనిపోయాక ఎక్స్‌గ్రేషియాలు, సానుభూతులు చెప్పి మోసం చేసే ధోరణిని ఇప్పటికైనా వీడి, అందరికీ ఆరోగ్యం అందించేందుకు పాలకులు, అధికారులు సమగ్ర ప్రజారోగ్య విధానాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు. తాట్రాజు రాజారావు, ఎర్నిబాబు తదితరులు డీఎంహెచ్‌వోని కలిసినవారిలో ఉన్నారు. ★

# సెప్టెంబర్‌లో పీపుల్స్ పార్లమెంట్

సమాజంలో చైతన్యం, ఆరోగ్యకరమైన చర్చ లేకుండా జనం జీవితాల్ని బాగుచేయలేమని, కానీ దేశంలో అత్యున్నత చర్చావేదికలైన అసెంబ్లీలు, పార్లమెంట్‌లు తిట్టుకోవడానికి, అవాకులు చవాకులు పేల్చుకోవడానికి తప్ప ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రయత్నించటం లేదని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఈ నేపథ్యంలో పీపుల్ అగనెస్ట్ కరప్షన్ (పీఏసీ) యువ నాయకత్వం 'పీపుల్స్ పార్లమెంట్' పేరిట జాతీయ సదస్సు నిర్వహించటం గొప్ప విషయమని అన్నారు. మనదేశాన్ని మనమే బాగు చేసుకోవాలన్నారు. కడపలో సెప్టెంబర్ 1, 2 తేదీల్లో పీపుల్స్ పార్లమెంట్ జరుగుతుందని, ఇందులో దేశం ప్రస్తుతం ఎదుర్కొంటున్న రెండు తీవ్ర సంక్షోభాలు– రైతుల దయనీయత, ప్రభుత్వ కార్యాలయాల్లో సేవల వైఫల్యంపై చర్చిస్తారని ప్రకటించారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన పీపుల్స్ పార్లమెంట్–2017 ప్రకటన, వెబ్‌సైట్, పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో.. సీనియర్ జర్నలిస్టు కె.రామచంద్రమూర్తి, ఆర్టీఐ మాజీ కమిషనర్ పి.విజయ్‌బాబు, మాజీ ఎంఎల్‌సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, పీఏసీ వ్యవస్థాపకుడు మారంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డితో కలిసి జేపీ పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో, దేశంలో ఎక్కువశాతం ప్రజలు ఆధారపడిన వ్యవసాయం వాటా జాతీయాదాయంలో కుదించుకుపోతున్నా పాలకులు ఇంకా చిట్కాలనే అమలు చేస్తుండటం వల్ల రైతులు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయారని, దీనివల్ల రైతుల ఆత్మహత్యలు కూడా పెరుగుతూ వస్తున్నాయని జేపీ అన్నారు. రైతుకు ఆదాయం చుట్టూ పరిష్కారాలపై పెద్దఎత్తున చర్చ జరగాల్సిన తరుణంలో ఈ అంశాన్ని పీపుల్స్ పార్లమెంటు ఎంచుకుందన్నారు. మరోవైపు, పాలకులకు సౌకర్యాలు, ఏడవ పే కమిషన్‌తో ప్రభుత్వోద్యోగులకు జీతాలు పెరుగుతున్నాయి తప్ప ప్రజలకు సరైన సేవలు అందటం లేదన్నారు. జనం పన్నులు కడుతున్నది జీతాలు, నేతల విలాసాల కోసం కాదన్నారు. అవినీతి, వేధింపులు లేకుండా ప్రజలు కట్టిన పన్నులకు తగ్గ సేవలను ప్రభుత్వ కార్యాలయాలలో నిర్ణీత గడువులోగా అందించేందుకు, అలా అందించలేకపోతే రోజుకు ఇంత డబ్బుని పరిహారం చెల్లించేందుకు 'పౌర సేవల' చట్టాన్ని తీసుకురావాల్సి ఉందన్నారు. ఇప్పటికే ఆలస్యమైన ఈ చట్టాన్ని ఎజెండాలో రెండో అంశంగా పీపుల్స్ పార్లమెంట్ ఎంచుకోవటం సరైన




నిర్ణయమన్నారు. యువత చేస్తున్న పీపుల్స్ పార్లమెంట్ కార్యక్రమానికి అండగా నిలిచి ప్రోత్సహిస్తున్న వివిధ పార్టీల నేతలను, పలు రంగాల ప్రముఖులను అభినందించారు.

రామచంద్రమూర్తి మాట్లాడుతూ, పార్లమెంట్, శాసనసభల్లో రచ్చ తప్ప ప్రజాసమస్యలు, విధానపరమైన అంశాలపై చర్చ లేదన్నారు. ఎత్తులు వేసి సభలు జరగకుండా చూస్తున్నారన్నారు. 1998 నుంచి రైతుల ఆత్మహత్యలు మొదలయ్యాయని, అప్పటి నుంచి వ్యవసాయదారుల స్థితిగతులపై ప్రత్యేక సమావేశాలు జరగాలని తాము కోరుతూ వస్తున్నామన్నారు. చట్టసభల్లో చర్చలు జరగకపోవడం సిగ్గుచేటని, కొంతమంది చదువుకున్న యువకులు ముందుకొచ్చి మోడల్ పార్లమెంట్ అంటూ చర్చలు, సదస్సులు ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ప్రజల హక్కులను కాపాడాల్సిన పాలకులు వాటిని తుంగలో తొక్కి భవిష్యత్తు తరాలతో ఆడుకుంటున్నారని విజయ్‌బాబు అన్నారు. క్లిష్టసమయంలో ప్రజలకు ఎంతో అవసరమైన సమస్యలపై జరుగుతున్న ఈ సదస్సుకు అన్ని రకాల మీడియా సంస్థలూ సహకరించాలన్నారు.

సుబ్బారెడ్డి మాట్లాడుతూ, ఇటువంటి కార్యక్రమాల్లో యువత చురుగ్గా పాల్గనటం చూస్తుంటే, మార్పు ఎంతో దూరం లేదని అర్థమవుతోందన్నారు. ఉన్నత విద్యావంతులైన యువజన బృందం సమాజంలో మార్పు కోసం నిర్వహించే ఈ సదస్సులో భాగస్వాములయ్యేందుకు యువతీయువకులు వెబ్‌సైట్‌లో తమ పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, సదస్సుకు జాతీయస్థాయిలో ప్రముఖులు, మేధావులు, పార్లమెంట్ సభ్యులు, మాజీలు సహా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఔత్సాహికులు హాజరవుతారన్నారు. యువత ఆన్‌లైన్ ద్వారా కాంటాక్ట్ చేయాలని కోరారు.

కార్యక్రమంలో పీపుల్స్ పార్లమెంట్ ముఖ్యనేతలు మనోజ్ చిట్టిమల్ల, గురు మల్లి, సంతోష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ★




# కేరళ సేత్తా !

- ఎ. అన్నపూర్ణ, కాలిఫోర్నియా

కేరళ అనగానే ప్రకృతి అందాల తోపాటు నారాయణ గురు గుర్తుకొస్తారు. ఆధునిక భారతదేశంలోని ఐదుగురు మౌలిక సంస్కర్తల్లో ఒకరుగా.. మహాత్మాఫూలే, మహాత్మాగాంధీ, పెరియార్, డా॥ అంబేద్కర్‌ల సరసన నారాయణ గురు నిలుస్తారు. నాణ్యమైన విద్యను రాజకీయానికి కేంద్రబిందువు చేసేందుకు పోరాడే లోక్‌సత్తాలో ఉన్నాను కాబట్టి..కులం పేరుతో వివక్షకు గురైె అణగారినవారిని 'విద్య ద్వారా' నారాయణ గురు ఎలా బాగుచేశారో కొంత తెలుసుకోగలిగాను. తన సంస్కరణ ఫలాల్ని నారాయణ గురు జీవితకాలంలోనే చూడగలిగారు. ఆయన కృషి వల్లే మిగతా రాష్ట్రాల్లో కంటే కేరళలో కొంత మెరుగైన సామాజిక వాతావరణం కనిపిస్తుంది.

ఆ తర్వాత ఐఏఎస్‌కు రాజీనామా చేసి రాజకీయాలలోకి వచ్చి ప్రస్తుతం బీజేపీలో ఉన్న కేజే అల్ఫోన్సె గురించి.. కేరళ ప్రస్తావన గుర్తుచేస్తుంది. లోక్‌సత్తా జయప్రకాష్ నారాయణ్ స్థాయిలో రాజకీయ, పాలనా సంస్కరణలకు ఓ పెద్ద ఉద్యమాన్ని నిర్మించి వ్యవస్థీకృత మార్పుల కోసం కృషి చేయకపోయినా.. ఐఏఎస్ అధికారి అల్ఫోన్సె మంచి రాజకీయం కోసం చెప్పుకోదగిన ప్రయత్నమే చేశారు. 1988లో కేరళలోని కొట్టాయం జిల్లా కలెక్టర్‌గా పనిచేసినప్పుడు.. దేశంలోనే నూరుశాతం అక్షరాస్యత సాధించిన మొదటి జిల్లాగా మార్చారు. ఆ తర్వాత ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్‌గా పనిచేసే సమయంలో.. అక్రమ కట్టడాలను కూల్చివేసి వేలకోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఆదా చేశారు. దేశ రాజధానిలో అవటంతో అల్ఫోన్సె కృషికి జాతీయస్థాయి ప్రచారం లభించింది. టైమ్ మ్యాగజైన్ 100 యంగ్ గ్లోబల్ లీడర్స్‌లో ఒకరుగా (1994) కూడా గుర్తింపు పొందారు. తర్వాత పదవీ విరమణ చేసి.. తాను కలెక్టర్‌గా పనిచేసిన కొట్టాయం జిల్లాలోని కంజీరప్పల్లి నియోజకవర్గంలోనే ఎమ్మెల్యేగా గెలిచారు. వ్యక్తిగత దూషణలు లేకుండా, డబ్బు, మద్యం పంచకుండా వామపక్షాల మద్దతుతో ఈ విజయం సాధించారు. ప్రస్తుతం జాతీయ నూతన విద్యావిధానం ముసాయిదా రూపకల్పన కమిటీలో సభ్యులుగా ఉన్నారు.

''రాజకీయాలంటే కుళ్లు అని మనదేశంలో చాలామంది నమ్ముతుంటారు. గత 33ఏళ్లకుపైగా నేను 20లక్షలమందికి పైగా విద్యార్థులతో మాట్లాడాను. ఒక ప్రశ్నను మాత్రం నిరంతరం అడుగుతుండేవాడిని: "రాజకీయ నాయకులు కావాలని మీలో ఎంతమంది అనుకుంటున్నారు?''. సమాధానం ఎప్పుడూ ఒకటే వచ్చేది: ''వేం రాజకీయాల్ని అసహ్యించుకుంటున్నాం''.

మనకు స్వచ్ఛమైన రాజకీయనేతలు కొంతమంది ఉన్నారనటంలో సందేహం లేదు. అయితే ఆ నిష్కల్మష విద్యార్థి హృదయాలలో వారు మార్పు తేలేకపోతున్నారని నా భావన'' అని అల్ఫోన్సె 2012లో టైమ్స్ ఆఫ్ ఇండియాకు రాసిన ఓ కాలమ్‌లో అభిప్రాయపడ్డారు.

తాను ఎమ్మెల్యేగా పనిచేశాక, కంజీరప్పల్లిలోని ఓ స్కూలులో 'మీలో ఎవరైనా రాజకీయాలలో చేరాలనుకుంటున్నారా?' అని ప్రశ్నించినప్పుడు వందమంది విద్యార్థులు చేతులెత్తారని, రాజకీయాల పట్ల ఇలాంటి మార్పు దేశవ్యాప్తంగా రావాలని అల్ఫోన్సె అన్నారు. ఒక ఉద్యమంగా, పార్టీగా లోక్‌సత్తా అప్పటికి 16 ఏళ్లుగా చేస్తున్న కృషికి అల్ఫోన్సె గొంతునిచ్చి ఆచరించి చూపారు. ఇలాంటివాళ్లు ఎంత ఎక్కువ పెరిగితే కొత్త రాజకీయానికి అంత త్వరగా ఎన్నికలలో ఆదరణ పెరుగుతుంది. అందుకే ఆయన ప్రొఫైల్ అంతగా గుర్తుండిపోయింది.

ఆ తర్వాత 2016లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో.. కొన్ని దశాబ్దాలుగా బీజేపీ జెండా మోస్తున్న ఓ. రాజగోపాల్ ఎమ్మెల్యేగా నెమాం నియోజకవర్గం నుంచి గెలవటం, సీపీఎం ముఖ్యమంత్రి ఉదార ఆర్థిక విధానాల సలహాదారుసు

నియమించుకోవటం వంటి పరిణామాలు కొంత ఆసక్తిని కలిగించినా.. సీపీఎం–బీజేపీల హత్యారాజకీయాలతో ఆ రాష్ట్రం పట్ల ఆసక్తి సన్నగిల్లింది. అయితే, ఇటీవల మరొకవార్త కేరళ గురించి ఈ వ్యాసం రాయటానికి ఉత్సాహాన్నిచ్చింది.

కోజికోడ్ జిల్లాకు కలెక్టర్‌గా ప్రశాంత్ నాయర్ చేసిన కృషి (ఈయన్ని కేరళ వామపక్ష ప్రభుత్వం పార్టీ రాజకీయాల కోసం ట్రాన్స్‌ఫర్ చేసిందని పెద్దఎత్తున ఆరోపణలున్నాయి) గురించి సోషల్ మీడియాలో తెలుసుకున్నాను.

కేరళ రాష్ట్రం అక్షరాస్యతలో ముందున్నా.. ఇన్నేళ్ల పాలకుల పుణ్యమాని మౌలిక వసతులు, ఉద్యోగాల సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఉపాధి సమస్య పరిష్కారానికి, పాలనలో ప్రజల భాగస్వామ్యానికి ప్రశాంత్ నాయర్ కోజికోడ్ కలెక్టర్‌గా పెద్ద పీట వేశారు. ఇందుకోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని పెద్దఎత్తున ఉపయోగించుకున్నారు. ఫేస్‌బుక్, ఇతర సోషల్ మీడియా టూల్స్‌లో చాలా యాక్టివ్‌గా ఉన్నారు. పేదల కడుపు నింపేందుకు 'ఆపరేషన్ సులేమాన్', కొల్లా సరస్సు ప్రక్షాళన వంటివి ఆయన వనితీరుకి ఉదాహరణలుగా నన్ను ఆకట్టుకున్నాయి.

దేశంలోని అనేక సరస్సుల్లాగే కోజికోడ్ జిల్లాలోని కొల్లా సరస్సు కూడా కాలుష్యం బారినపడింది. చెత్తాచెదారంతో దుర్గంధం వెదజల్లుతోంది. చెరువులు, కుంటలలో వ్యర్థాలను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా.. టెండర్ల దగ్గర్నుంచీ కమీషన్ రాజకీయాలతో అవి వినియోగమవ్వలేదు. రిపబ్లిక్ డే రోజున జెండా ఎగరేయటం, దేశమాతను కీర్తిస్తూ ఉపన్యాసమివ్వటం, పాడుకోవటం, మిఠాయిలు పంచుకోవటం కార్యక్రమాన్ని 'నిజమైన దేశసేవ' కార్యక్రమంగా మార్చాలని కలెక్టర్ ప్రశాంత్ భావించారు. "మనమంతా ఈరోజు కొల్లా సరస్సును బాగుచేసుకుందాం. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారందరికీ కోజికోడ్ బిర్యానీ తినిపిస్తా" అంటూ పిలుపునిచ్చారు. పెద్ద, చిన్న, అధికారి, కూలీ అని తేడా లేకుండా అందరూ దేశభక్తి కార్యాచరణకు పూనుకున్నారు. ఒక్కరోజులో చెరువును శుభ్రపరిచి కొత్త కళాకాంతులు తీసుకొచ్చారు. ఉత్సవానికి ఓ పరమార్థాన్ని చూపారు. ప్రగతికి బాటలు వేశారు. స్వయంగా కలెక్టర్ గారు వంటలు చేయించి పళ్లాలతో అందించారు. అందరితో కలిసి భోజనం చేశారు.. 750మంది వలంటీర్లు, 14 ఎకరాల విస్తీర్ణం గల ఆ చెరువును ఒక్కరోజులో బాగు చేశారు.

50 కిలోల బియ్యంతో బిర్యానీ చేయించడానికి అయిన ఖర్చు కేవలం రూ. 30వేలు. టెండర్ వేసి, ప్రభుత్వ లాంఛనాలతో కాంట్రాక్టర్‌కి అప్పగిస్తే అదే పరిశుభ్రత కొన్ని రోజులు పట్టేది, లక్షల రూపాయల ప్రజాధనం ఖర్చయ్యేది. జనం చేతికి అధికారమిస్తే, వారికి తమ ప్రయోజనమేమిటో అర్థమయ్యేలా చెప్పి ఉత్సాహపరిస్తే.. స్థానిక పనులు ఎలా పూర్తవుతాయో ప్రశాంత్ నాయర్ నిరూపించారు (నిజానికి స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని కూడా ఇలా ప్రజల భాగస్వామ్యంతో, స్థానిక సాధికారతతో రూపొందించి ఉంటే, పెద్దఎత్తున విజయవంతమై ఉండేది). ప్రశాంత్ నాయర్ పాపులారిటీ పట్ల రాజకీయ నాయకులకు అసూయ కలిగినా.. అవినీతి లేకుండా, పనిచేసి, ప్రజలకు ప్రయోజనాలు చూపిస్తూ గుర్తింపు పొందుతుండటంతో క్రమంగా వారిలో కూడా పలువురు కలెక్టర్‌ని గౌరవించేవారు.

కలెక్టర్‌గా డా॥ జయప్రకాష్ నారాయణ్ సాధించిన ఓ విజయాన్ని కూడా ఇక్కడ గుర్తుచేసుకుంటే.. అవినీతిరహితంగా దేశాభివృద్ధిని సాధించటంలో అధికార వికేంద్రీకరణ, ప్రజల భాగస్వామ్యాలకున్న ప్రాధాన్యత మరింత స్పష్టంగా అర్థమవుతుంది.

ప్రకాశం జిల్లాలో ఎకరాకు కేవలం రూ. 2,000 ఖర్చుతో మైనర్ ఎత్తిపోతల పథకాలను రైతుల భాగస్వామ్యంతో జేపీ పూర్తిచేయించి 2,00,000 ఎకరాలకు పైగా సాగునీరు అందివ్వగలిగారు. ఇందులో రైతులు సగం డబ్బు జేబులో నుంచి పెట్టుకోగా, మిగిలిన డబ్బును బ్యాంకులు రుణాలుగా ఇచ్చాయి. ఈ రుణాలలో ఒక్క రూపాయిని కూడా ఎగ్గొట్టకుండా రైతులు తిరిగి చెల్లించారు. యావత్ రాష్ట్రంలో అప్పటిదాకా ప్రభుత్వం ఈ స్కీములకు ఇచ్చిన సాయం కంటే అతి తక్కువ మొత్తంతోనే.. సర్కారు సాగులోకి తెచ్చిన భూమి కంటే ఎన్నో ఎక్కువ ఎకరాల్ని ప్రకాశం జిల్లాలో సాగులోకి తెచ్చారు. రెండున్నరేళ్లలో 453 మైనర్ ఇరిగేషన్ పథకాలు, 2800 ఉపరితల బోరుబావులు, 70 మళ్లింపు పథకాలు రూపు దిద్దుకున్నాయి. వాటిలో దాదాపు అన్నీ ఇప్పటికీ విజయవంతంగా నడుస్తున్నాయి. 30ఏళ్ల తర్వాత ఇటీవల హైదరాబాద్ నుంచి ఎఫ్‌డీఆర్ అధ్యయన బృందం అక్కడికి వెళ్లినప్పుడు.. స్థానికులు ఎంతో ఆప్యాయంగా ఆతిథ్యమిచ్చి వివరాలు చెప్పారు. జేపీ కృషిని అక్కడి పెద్దలు అపురూపంగా పలుమార్లు ప్రస్తావించారు. మా గురించి జేపీ ఇంకా ఆలోచిస్తున్నారా? అని కూడా అడిగారు.. రైతులకు తమ ప్రయోజనమేమిటో పూర్తిగా తెలియచెప్పి, వారిని అందులో భాగస్వాముల్ని చేయటం ద్వారానే జేపీ ఈ అద్భుతాన్ని సాధించారు. కమ్మ గ్రామాలు, రెడ్డి గ్రామాలు.. ఇలా తరతరాలుగా ముఠాతగాదాలు నడుస్తున్న ఊళ్లను కూడా ఒక ఉమ్మడి ప్రయోజనం దిశగా జేపీ ఏకం చేశారు. కలెక్టర్‌గా ప్రకాశం, ఆ తర్వాత తూర్పు గోదావరి జిల్లాల్లో ఇలా పెద్ద విజయాలను సాధించినా, ప్రభుత్వంలో ఐఏఎస్‌గా అనేక ఉన్నత పదవులను నిర్వహించినా, పేరు తగ్గకుండానే కోట్ల సంపదను కూడబెట్టుకునే అవకాశమున్నా.. అన్నీ వదులుకుని జేపీ లోక్‌సత్తా రాజకీయ ఉద్యమాన్ని ప్రారంభించారు. ఒక అధికారిగా నిజాయతీగా, సమర్థతతో పనిచేస్తే ఇప్పుడున్న వ్యవస్థలో 20శాతం మాత్రమే ఫలితాలను సాధించగలం, కానీ

***లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా ఉన్నప్పుడు సాధించిన ఎత్తిపోతల, ఇతర సాగు పథకాలను పరిశీలించటానికి ఇటీవల ఎఫ్‌డీఆర్ అధ్యయన బృందం జిల్లాకి వెళ్లినప్పుడు.. 1989లో జేపీకి తామిచ్చిన ఈ అభినందన పత్రాన్ని ఉలిచి గ్రామ ప్రజలు వారికి అందచేశారు..***

# క్రాంతిరేఖ




సామర్థ్యం, నిజాయితీ, చిత్తశుద్ధి, స్థితప్రజ్ఞత, సంయమన దృక్పథం కలిగి, అనురక్తితో అంకితభావంతో అహర్నిశలు, అలుపెరుగక సమాజం కొరకు పనిచేసి వెలలేని కీర్తిసంపదనార్జించిన మా జిల్లా కలెక్టరు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్, ఐఏఎస్ గారిని ప్రేమించడం, అభిమానించడం, గౌరవించడం మా మహద్భాగ్యంగా భావిస్తాం.

మా మాగాణి భూములలో ప్రవహించే ప్రతి నీటి బిందువులో డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ గారు ప్రతిబింబిస్తారు. మా భూములలో పండే ప్రతి వడ్ల గింజ మీద డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ గారి పేరు లిఖించబడి ఉంటుందని మా నమ్మకం.

మేము తినే మెతుకు మెతుకు మీద డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ గారి పేరు మెరుస్తూనే ఉంటుంది.

డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ గారి ఆశయాలు, ఉన్నత భావాలు భావితరాలవారికి ఆదర్శాలు కావాలని ఆశిస్తాం.

"శ్రమయే దైవం
కృషితో నాస్తి దుర్భిక్షం
సర్వేజనా: సుఖినోభవంతు"

**- డా॥ చుంచు చలమయ్య,** ఎంఎస్.
**చుంచు శేషయ్య,** ఎంఏ బీఎల్.
**ఉలిచి గ్రామ ప్రజలు**

**తేదీ: 14-01-1989**

వ్యవస్థ మారితే అదే నిజాయతీ, సమర్థతతో 80శాతం ఫలితాలను సాధించగలం అనే అవగాహనతో జేపీ రాజకీయాల్లో మార్పు కోసం అసాధారణ సంకల్పంతో, దార్శనికతతో కృషిని ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాల్లో తెలిసినట్టుగా ఆయన ఉత్తరాదిన తెలియకపోవచ్చు. ఢిల్లీని కాకుండా, హైదరాబాద్‌ని ఆయన తన కార్యక్షేత్రంగా ఎంచుకోవటం కూడా ఇందుకు కారణం. కానీ కాస్త చదువుకుని ఈ దేశం గురించి ఏ కాస్త ఆలోచన ఉన్నవారికైనా ఈ సోషల్ మీడియా సాంకేతికయుగంలో జేపీ పరిచితులే. గద్దెనెక్కినవారి కంటే ఎక్కువగా, అంత ప్రాధాన్యత గల జాతీయస్థాయి సంస్కరణల్ని జేపీ సాధించారు. ప్రతి యువతి, యువకుడు వ్యక్తిగతంగా ఎదగాలని, వ్యవస్థలో మార్పు గురించి కూడా కొంత సమయం కేటాయించాలని చెప్పేందుకే ఇవన్నీ చెప్పుకుంటూ వచ్చింది.

ఇక్కడే ఇంకో విషయాన్ని ప్రస్తావించాలి.. ఇటీవల ఒక ప్రముఖ తెలుగు దినపత్రిక హైదరాబాద్ ఎడిషన్‌లో ఒక వార్త వచ్చింది. ఫోర్సిగేమ్.కామ్ అనే సంస్థ హైదరాబాద్ సహా పలు మెట్రోల యువతలో చేసిన సర్వే వివరాలు ఇందులో ఉన్నాయి. యువతలో అత్యధికులు (24శాతం) సెలబ్రిటీ కావాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. ఆ తర్వాత 22శాతంమంది డబ్బు సంపాదించాలని చెప్పారు. డాక్టర్లు, ఇంజినీర్ల వంటి ప్రొఫెషనల్స్ కావాలనుకుంటున్నట్టు 20శాతం చెప్పగా, రాజకీయాలలోకి వస్తామని కేవలం నూటికి నలుగురే చెప్పారు. అలాగే తమకు స్ఫూర్తినిచ్చేది సెలబ్రిటీలు, పారిశ్రామికవేత్తలు అని 37, 22శాతంమంది యూత్ చెప్పగా, రాజకీయ నాయకులు రోల్‌మోడల్స్ అని కేవలం 8శాతం మంది చెప్పారు. మనం వ్యక్తిగత జీవితంలో గెలవాలంటే.. మంచి సమాజం ఉండాలని, మంచి సమాజం ఉండాలంటే మంచి రాజకీయం, పాలన ఉండాలని మర్చిపోతున్నారని చెప్పే ఈ సర్వే ఆందోళనకరమనే చెప్పాలి.

సాంకేతికత అందించిన వెసులుబాటుతో యువతలో అత్యధికులు సమాచారాన్ని ఇంటర్నెట్/న్యూస్‌పోర్టల్స్/సోషల్ మీడియా (28శాతం), మొబైల్ (25) నుంచి వేగంగా, తేలిగ్గా తెలుసుకుంటున్నా.. వారికి వాస్తవాలు అందటం లేదని, సరైన దిశానిర్దేశం కొరవడుతోందని సర్వే స్పష్టం చేస్తోంది.

ఈ తప్పు యువతది కాకపోవచ్చు. మంచి పెంపకం, చదువులు అందించని పెద్దలది, సమాజానిది, రాజకీయానేదే కావచ్చు. కానీ రాబోయే కాలంలో 90శాతం యువతది. తప్పు ఎవరిదైనా పర్యవసానాలు అనుభవించాల్సింది యువత. అందుకే మరోసారి చెబుతున్నాను అనుకోకుండా.. యువతీయువకులారా! వ్యక్తిగత అభివృద్ధితోపాటు మంచి రాజకీయం, పాలన, సమాజం కోసం కూడా సమయం, వనరులు కేటాయించండి. ★





# విద్యుత్ గవర్నెన్స్‌ను
# ఎఫ్‌డీఆర్ బృందానికి వివరించిన ఈఆర్‌సీ ఛైర్మన్

డా॥ జేపీ దిశానిర్దేశంలో పాలనా విధానాలు, చట్టాలు, వ్యవస్థీకృత మార్పులపై పనిచేసే ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) బృందం ఇటీవల తెలంగాణ రాష్ట్ర విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ (టీఎస్‌ఈఆర్‌సీ) ఛైర్మన్ ఇస్మాయిల్ అలీ ఖాన్‌ని కలిసి ఆ రంగం పనితీరుపై చర్చించింది. గతంలో అణు విద్యుత్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పీసీఐఎల్) డైరెక్టర్‌గా పనిచేసిన ఇస్మాయిల్... వీరికి పలు అంశాలను తాజా పరిణామాలతో వివరించారు. విద్యుత్ నిర్వహణ, పంపిణీ నష్టాలు, విద్యుత్ నియంత్రణ చర్యల వల్ల వినియోగదారులు సహా భాగస్వామ్యవర్గాలకు కలిగే లాభం, రెగ్యులేటరీ కమిషన్ పనితీరు మెరుగుపరిచేందుకు చర్యలు, సంప్రదాయ విద్యుత్‌తో పోలిస్తే సౌర, అణు విద్యుత్ రంగాలకు భవిష్యత్తులో ఉండే అవకాశాలు, విద్యుత్‌రంగంలో ఉండే రాజకీయ ఆర్థిక కోణం తదితర విషయాలను విశదీకరించారు. సందేహాలకు సమాధానమిచ్చారు. పంపిణీ నష్టాల నివారణలో పైలెట్ ప్రాజెక్ట్ నిర్వహణ సహా విద్యుత్ రంగంలో సుదీర్ఘకృషి నేపథ్యమున్న లోక్‌సత్తా / ఎఫ్‌డీఆర్ నూతన ప్రతిపాదనల్ని అడిగి తెలుసుకున్నారు.

Posting Date 22-07-2017
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on July16th, 2017

సాక్షాత్తు ప్రధాన మంత్రే దేశ అత్యున్నత చట్ట సభలో ప్రత్యేక హోదాపై ప్రకటన చేస్తే అది చట్టం తో సమానం . దానిపై వెనకడుగు రాజ్యాంగ ధిక్కారమే!అది ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం , సమైక్యతకు విఘాతం.



ఏపీ ని ఆదుకోవడానికి ,ప్రజల ఆకాంక్షలు తీర్చడానికి ఒక వినూత్నమైన ఫార్ములా కావాలి . ఉదా : దేశం లో 100 జిల్లాలకు పన్ను మినహాయింపు ఇవ్వండి . ఖచ్చితంగా ఆంధ్ర ప్రదేశ్ కు న్యాయం జరుగుతుంది.

# నిజాలు మాట్లాడుకుందాం-24

షేర్ చేయండి . ప్రజలకు నిజాలు చేరవేయండి

Book-Post
PRINTED MATTER

To

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad